
# మూసీ

# MUSI


◆ Samputi : 26 ◆ Sanchika : 02 ◆ Pages : 64 ◆ Rs. 20
◆ December 2022

UGC Care List
Approved Journal


- స్వాతంత్ర్యోద్యమ తెలంగాణ సాహితీవేత్త - బి.ఎన్.శాస్త్రి
- బాలవ్యాకరణం - శ్రీరామ, శ్రీకృష్ణ అవతారాంశాలు
- బి.ఎన్.శాస్త్రి పురస్కార (2022) గ్రహీత డా. గుంజి వెంకటరత్నం
- వేమన సంపూర్ణ జీవిత చరిత్రము
- కుందుర్తి కవిత్వం - సూక్తి నిధిత్వం
- సాహిత్యంలో శ్రీశైల క్షేత్ర ప్రస్తావన - ఒక పరిశీలన
- అందేశ్రీ ది పాటంత జీవితం
- సీతారాం కవిత్వంలో మృత్యు తాత్త్వికత





కీ॥ శే॥ బిన్నూరి నరసింహ శాస్త్రిగారి
90వ జయంతి







వ్యవస్థాపకులు
**శ్రీ బి.ఎన్.శాస్త్రి**

సంపుటి : 26 సంచిక : 2
డిసెంబర్ - 2022
'శుభకృత్' మార్గశిర మాసం
**సంపాదకులు** (EDITOR)
**సాగి కమలాకర శర్మ**
**SAGI KAMALAKARA SHARMA**
**సహ సంపాదకులు** (ASSOCIATE EDITOR)
**డా. దత్తయ్య అట్టెం**
**Dr. DATTAIAH ATTEM**

**Printed and Published by**
B. Anantha Laxmi
***Type Setting at :***
**Kavyasree Graphics**
**Ph: 934 797 1177**

**Printed at : Sri Sai Process**
**Ph. 27563075**

**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 200/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు **'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine)** పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట,
హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
**email : editormusi@gmail.com**

ISSN 2457-0796



# మూసీ

సాహిత్య
సాంస్కృతిక
చారిత్రక

**చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక**

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

స్వాతంత్ర్యోద్యమ తెలంగాణ సాహితీవేత్త - బి.ఎన్.శాస్త్రి ... డా. ఘనపురం సుదర్శన్ 7
బాలవ్యాకరణం - శ్రీరామ, శ్రీకృష్ణ అవతారాంశాలు ... డా. గంగిశెట్టి లక్ష్మీనారాయణ 9
ఒక చీకటి రాత్రి (బందారం కథలు -13) ... డా. నందిని సిధారెడ్డి 11
బి.ఎన్.శాస్త్రి పురస్కార (2022) గ్రహీత డా. గుంజి వెంకటరత్నం తో మూసీ ముచ్చట 15
భారతీయీకరణ7 : ఆంగ్లమూలం : బలరాజ్ మధోక్, తెలుగు : కోవెల సంపత్కుమార 23
వేమన సంపూర్ణ జీవిత చరిత్రము - బోధనలు (గ్రంథాంతరంగం-19) ... ఘట్టమరాజు 27
పద్య మనోహరం - 37 ... డా. గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు 32
తెలంగాణ ఉద్యమం - ఉ.సా. సంఘీభావ వ్యాసాలు ... జె. శంకర్ 33
కుందుర్తి కవిత్వం - సూక్తి నిధిత్వం ... డా. అట్టెం దత్తయ్య 37
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గిరిజన జాతరలు - పండుగలు ... మునేశ్వర్ చంద్రకాత్ 41
సాహిత్యంలో శ్రీశైల క్షేత్ర ప్రస్తావన - ఒక పరిశీలన ... డా. జి. తిరుమల వాసుదేవరావు 45
శుభసంకల్పం (కె. విశ్వనాథ్ చిత్రాలు -సామాజిక అవలోకనం : 28).. టి. లక్ష్మీనారాయణ 47
అందెశ్రీ ది పాటంత జీవితం ... ఎం. విప్లవ కుమార్ 51
కందుకూరి సంఘ సంస్కరణ - అధిక్షేప రచనలు ... డా. కె.వి.ఎన్.డి. వరప్రసాద్ 53
సీతారాం కవిత్వంలో మృత్యు తాత్త్వికత ... పడిగెపల్లి వెంకటేశ్వర్లు 55
స్ఫూర్తి మంత్రాలు - ఆత్మ కథలు ... జి. ప్రదీప్ 57

### కవితలు

మమతలున్న వాడె మనిషి ... డా.గన్నోజు శ్రీనివాసాచారి - 5; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ - 6; సంసిద్ధత ... డా.ఎన్. గోపి - 6; కొట్టివేతలు ... కుడికాల వంశీధర్ - 50; గోసి ... చంపావతి - 52; నా కావ్య బంధువు ... డా. సిహెచ్. ఆంజనేయులు -56; స్మశానం ... సాహిత్యమణి - 58; నేను మళ్ళీ జన్మిస్తా ... లక్ష్మీ శ్రీనివాస్ - 62.

### సమీక్షలు

గిరిజా మనోహరుని ఆత్మ జ్ఞాన ప్రకాశిక ... డా. టి. శ్రీరంగస్వామి 59
స్వీకృతి ... 61

**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**


*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 2  హైదరాబాద్ డిసెంబర్ : 2022

## సంపాదకీయం







వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి


స్థాయి విస్తరించాలి


దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**





## విగ్రహం

విశేషేణాత్మనా గృహ్యత ఇతి విగ్రహః – విశేషముగా ఆత్మచేత గ్రహింపబడునది విగ్రహం. మనం సాధారణంగా విగ్రహ శబ్దాన్ని 'ప్రతిమ' అనే అర్థంలో ఉపయోగిస్తున్నాం. ఒకదానికి 'ప్రతి'గా దీనిని వినియోగించడం. మన మనస్సును ఆ రూప పరోక్షంలో రూపసహితమై మనను ఆకర్షించి ఆనందింపజేసేది విగ్రహం. భారతీయమైన దైవ విగ్రహ స్వరూపాల వెనుక ఎంతో వైజ్ఞానికత ఉంది. భూమికి ప్రతిగా శివలింగం, విశ్వానికి ప్రతిగా విష్ణువు, సంపదలకు ప్రతిగా లక్ష్మీదేవి, ఓజోన్ పొరలోని ఆక్సీజన్‌కు స్వరూపంగా లలితాదేవి, భూమ్యాకర్షణకు గణపతి, విద్యుదయస్కాంత తరంగ శక్తికి ప్రతిగా సుబ్రహ్మణ్య స్వామి, విశ్వాంతరాళంలోని మొత్తం శక్తికి ప్రతీకగా ఆదిశేషుడు, వెలుగులకు (జ్ఞానానికి) స్వరూపంగా సరస్వతీదేవి, ప్రకృతికి, కాలానికి ప్రతీకగా బ్రహ్మ, వికాసానికి ప్రతీకగా పద్మం ... ఇలా ఎన్నో భావాలకు ప్రతీకలు విగ్రహాలు. ఇవి దైవ స్వరూపాలైతే ఊహాత్మకాలు, ప్రతీకాత్మకాలు, వ్యక్తి స్వరూపాలైతే వారిని మళ్ళీ మళ్ళీ గుర్తు చేసుకోవడానికి వినియోగపడేవి.

చైతన్యవంతుడైన మానవుడు విగ్రహంగా ఉండగలగడం చాలా కష్టం. అనేక రూపాలలో రాగద్వేషాలకు లోనైన వారు విగ్రహంగా ఉండలేరు. విగ్రహమంటే భారతీయుల భావనలో అచేతనమైన పదార్థం కాదు. పూర్ణ చైతన్యం కలిగి కూడా ప్రశాంతంగా ఉండగలగడం. తమ పనిలో తాము ఉండడం. అన్ని గుణదోషాలకు సిద్ధపడటం. దేనినీ అనవసరంగా పట్టించుకోక పోవడం. ఒక సూర్యునిలాగా, ఒక చంద్రునిలాగా వారి పనిలో వారు ప్రశాంతంగా ఉండటం. పూర్ణ చైతన్యం, రిజర్వాయర్‌లో ఉన్న నీరు, స్విచ్‌బోర్డులోని పవర్... అన్నీ దాదాపుగా ఒకటే. అవసరం అయినప్పుడు వాటి గొప్పతనం చూపించగలవు. అప్పటివరకు పరుగెత్తకుండా, చలించకుండా ఉండటమే అసలు అర్థం చేసుకోవలసింది.

విగ్రహం వల్ల నిగ్రహంగా ఉండటం తెలియాలి. ఆగ్రహం వదలాలి. అనుగ్రహం పెరగాలి. తమ చుట్టూ అనేక రకాల ఇబ్బందులు ఉన్నా తమ మనస్సును అంతకన్నా ఉన్నతమైన శక్తి వద్ద కేంద్రీకరించగలిగే శక్తి పెంచుకుంటే విగ్రహ భావన సిద్ధిస్తుంది. విగ్రహాన్ని ఎన్నో పదార్థాలతో అభిషేకిస్తారు. తోముతుంటారు. ఇష్టం లేని, ఇష్టమైన వస్తువులతో, పుష్పాలతో అర్చనలు చేస్తుంటారు. అన్నింటినీ భరించాలి. ఇష్టాయిష్టాలు, రాగద్వేషాలు ప్రకటించకూడదు. తమ ఒంటికి కలిగే నొప్పులు గూర్చి ఆలోచించడం కన్నా దర్శించినవాని అభ్యున్నతిని మాత్రమే కాంక్షించే స్థితి వస్తే విగ్రహ భావన పూర్ణమవుతుంది. లోకక్షేమాన్ని మాత్రమే కాంక్షిస్తూ ఒక తపోలోకంలో, స్థిరమైన మనశ్శరీరాలతో ఉండేదే విగ్రహం. తనపై కాళ్ళు పెట్టినా, కళ్ళు మార్చినా అనుగ్రహించే ఉత్తమ స్థితిలో ఉండగలగడం విగ్రహ లక్షణం. మీద ఏది వాలినా, పాకినా, పడినా.... అన్నింటికీ ఒకే స్పందన. తయారీ నుండి శాశ్వతమైన ప్రతిష్ఠ, నిత్యపూజల వరకు నిరంతరం ఎన్నో ఒత్తిడులు అనుభవిస్తున్నా లోకక్షేమం కోసం అన్నింటినీ భరించి ఆనందాన్ని పంచేదే విగ్రహం.

విగ్రహాన్ని చూసి మనం విగ్రహంగా మారడంపై దృష్టి కేంద్రీకరించాలి. వేరు వేరు ప్రదేశాలలోని విగ్రహాలు వేరువేరుగా మనకు సంతోషాన్ని, సంతృప్తిని కలిగిస్తూనే ఉన్నాయి. విజ్ఞానాన్ని, కళాత్మకతను, ఆనందాన్ని మనకు పంచేస్తున్నాయి. విగ్రహంగా మారగలిగితే శాశ్వతత్వం సిద్ధిస్తుంది. నమస్కార యోగ్యత లభిస్తుంది. మనో మందిరాలలో ప్రతిష్ఠించుకునే అవకాశం కలుగుతుంది.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 2

UGC Care List Approved Journal
హైదరాబాద్ డిసెంబర్ : 2022

# మమతలున్న వాడె మనిషి...!



మనిషిమనిషిగాను మనలేక పోయిన
దానవుండు మదిన దాగివుండు
చేయుపనులు కూడ చెరుపునే చేయును
మనసు చచ్చినట్టి మార్మికుండు!

తెలిసితప్పుజేయుతెలివిగా మనిషిల
ఓర్పుగాను తనకు ఒప్పుగాను
నిప్పులాంటినిజమునిలకడగ దెలియ
కఠిన గుణము కల్గి కలత పడడు!

అంతరంగమందు నవివేకపుపనులు
చేసి మునులవోలె ముచ్చటగను
మనసులోనితప్పు మాధవుకెరుకని
మనసు మార్చుకోడు మాయలోడు!




తనదుమాటనెగ్గ తాపత్రయపడును
ఇతరుల పలుకులకు నిష్టపడడు
విర్రవీగు మనసు లితరులెరుగుదురు
జీవితాన నటన జీవనంబు!

ధర్మనిరతి లేక దానవ రూపమ్మే
నీతి లేని మనిషి నిల్చుటెట్లు?
ధనసంపదలను దాచుకొనుటకిలను
దారిదప్పిపోయి తరలుచుండు!?

ఎన్నివిద్య లెరిగి యేమి ఫలము? గాంచ
అంతరంగనీతి నమలులేని
హీనగుణపువాణ్ణి ఈశ్వరుడెరిగియు
కీలెరిగిన వాత పెట్టగలడు!?



సద్గుణంబుగల్గి సన్మార్గమందున
నడుచువాని కిలను నవ్యపథము
పువ్వు పుట్టగానె పుట్టదా తావియు
మనిషి పంచ వలెను మమతలన్ని!!

డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి
మహబూబ్‌నగర్, ఫోన్ : 8555899493

# సంసిద్ధత

ఫలానా కవి పద్యం చదివితే
మనలో నిద్రాణమై వున్న
భావనా పటిమ లేచి నిలబడాలి
మెరుపు మెరిస్తే పరిసరాలు
ప్రజ్వరిల్లినట్టుండాలి
పూలు పూసి మొక్క
రాళ్లను చీల్చుకుని
మొలిచినట్టుండాలి
కొత్తరక్తం ఎక్కుతున్నట్టుండాలి

ఎక్కడో హిమాలయాల్లో వీచే
గాలి
ఇక్కడిదాకా కొనసాగి
ఇక్కడి వాయు మండలాన్ని
మృదువుగా నిమిరినట్టుండాలి

ఫలానా పద్యంలోకి దిగితే
జీవితంలో లీనమైనట్టుండాలి
అమ్మ మమతల సరోవరంలో
మరోసారి తడిసినట్టుండాలి

చేతులు కలిసిన వెచ్చదనంలో
భద్రత దొరికినట్టుండాలి

నువ్వొక ఒంటరి చెట్టువు కాదు
భూమి పొరల్లోంచి
మట్టి సందేశాల్ని అందుకోవాలి
రమ్యమైన నీ ఆలోచనలే
పారమ్యాలు కాదు
అనశ్వరమైన విశ్వ నియతిలోని
రహస్యాల్ని ఒడిసి పట్టుకోవాలి

అనేకుల అనుభవాలు
నీ అనుభూతిలో కలిసిపోవాలి
కోపం రావాలి
మార్పు కోసం కల్లోల పడాలి

పద్యమంటే
మిత్రుడితో మాట్లాడినట్టుండాలి
ఫలానా పద్యాన్ని ముట్టుకుంటే
నువ్వే ఓ పద్యమైపోవాలి



డా. ఎన్. గోపి
ఫోన్ : 939 102 8496

# తుకారాం అభంగం

లోకరీతి వినరే జనులా
లోకరీతి వినరే......
భార్యా బిడ్డలు ఉపాసమున్నా
ఉలకడు దొనకడు అభిమాని
ఇల్లు గుల్లైనా బతుకు బండైనా
పలుకును గొప్పలు మైమరచి
లోకరీతి వినరే జనులా
లోకరీతి వినరే.....

మారాలన్న తలంపుకు రాడు
అహంకారమును వీడి నడవడు
సాధు జనుల సమ్మానము చేయక
సందు గొందుల్లో తిరుగుతుంటడు
లోకరీతి వినరే జనులా
లోకరీతి వినరే.....

మాటలు కోటలు దాటుతుంటవి
నమ్మిన జనులకు ముంచుతుంటవి
నమ్మితే నరకం పిలుస్తుంటది
తిమ్మిని బమ్మిని జేస్తుంటది
లోకరీతి వినరే జనులా
లోకరీతి వినరే....

కనుగొని నడుచు వివేకమే సొమ్ము
తరచి కదులుటే మనిషికి మందు
తుకా పలుకు కాపాడుకో ముందు
ప్రగల్భాల పరివారము మెందు
లోకరీతి వినరే జనులా
లోకరీతి వినరే.....

అనువాదం : డా॥ మంత్రి శ్రీనివాస్
ఆదిలాబాద్.
ఫోన్ : 83283 33720

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 2 (7) హైదరాబాద్ డిసెంబర్ : 2022

# స్వాతంత్ర్యోద్యమ తెలంగాణ సాహితీవేత్త – భిన్నూరి నరసింహ శాస్త్రి

డా. ఘనపురం సుదర్శన్, ఫోన్ : 9494248348


తెలంగాణ పల్లెల్లో ఏ రాయిని ముట్టినా, ఏ మనిషిని తట్టినా వారి పేరు వినబడుతుంది. ఈ ప్రాంతంలో ఏ గుట్టను అడిగినా, చుట్టను కాల్చే ఏ పెద్దాయనను అడిగినా వారి పేరు ప్రతిధ్వనిస్తుంది. ఆయన ఒక సంకల్పం, ఒక పట్టుదల, ఒక స్ఫూర్తి. ఆయన సాధారణుల్లో అసాధారణంగా కనబడే మూర్తి. ఆయనే భిన్నూరి నరసింహ శాస్త్రి.

మాసాలెన్నో వస్తుంటాయి. ఋతువులెన్నో పోతుంటాయి. సంవత్సరాలు కాల చక్రంలా తిరుగుతుంటాయి. మనుషులు మాత్రం పోతే తిరిగిరారు. భిన్నూరి నరసింహశాస్త్రి ఒక మాసము కాదు, ఒక ఋతువు కాదు, ఒక సంవత్సరమూ కాదు, ఈ మూడింటిని తనలో కలుపుకొని తానే అన్నీ అయి, తానే ప్రకృతి అయి కనబడిన ప్రతీ శిలను, ఎదురైన ప్రతీ రప్పనూ పలకరించి అగుపడిన చరిత్రను చూసి పులకరించి దాన్ని లోకానికందించాలని పరితపించిన రూపం.

**జననం**

భిన్నూరి నరసింహ శాస్త్రి అందరికీ బి.ఎన్.శాస్త్రి గా సుపరిచితులు. వీరు డిసెంబర్ 10, 1932 సంవత్సరంలో తన అమ్మమ్మ గారి ఊరైన తుమ్మలగూడెంలో జన్మించారు. తల్లి సరస్వతమ్మ, తండ్రి రామకృష్ణయ్య. వీరి స్వంత ఊరు వలిగొండ.

నిజాం రాజ్యంలో తెలుగు వారికి చెప్పుకోదగ్గ బడులేవి లేవు. ఇంత అక్షర జ్ఞానం సంపాదించాలన్నా, భాషాభివృద్ధికి సమావేశాలు నిర్వహించుకోవాలన్నా నియంత నిజాం అనుమతి తప్పనిసరయ్యేది. అటువంటి పరిస్థితుల్లో బాల, బాలికలకు ఖాన్గీ బడులే బాసటగా నిలిచాయి. నరసింహ శాస్త్రి తన బాల్యంలో బుచ్చిరంగయ్య అనే పంతులు దగ్గర చదువుకున్నారు. అనంతరం అంజల్ మాస్టర్ దగ్గరికి వెళ్లారు. ఇలా బుచ్చిరంగయ్య పంతులు మొదలుకొని ఐదారుగురు పంతుళ్ల దగ్గర పాఠాలు నేర్చుకున్నారు. ఈ సమయంలోనే, మాతృభాష తెలుగు కావడంతో సహజంగానే తెలుగును, బ్రాహ్మణుల లోగిలి కావడం వలన పూర్వీకులు సంస్కృత భాషలో పండితులు కావడంతో సంస్కృతాన్ని, నిజాం సర్కార్ ఉర్దూని అధికార భాషగా చేసుకొని పరిపాలిస్తుండడంతో ఆ భాషను నేర్చుకోవాలన్న ఉత్సాహం వలన ఉర్దూను నేర్చుకున్నారు. అయితే చదువు పట్ల అంతగా జిజ్ఞాస లేనందున, తన మనవడి భవిష్యత్తు బాగుండాలని, జీవించడానికని తాత పౌరోహిత్యం నేర్పినా అందులో స్థిరత్వాన్ని నిల్పుకోలేదు. జన్మకార్యం శాసనాలను వెతికి, వాటిని పరిష్కరించి తెలంగాణ చరిత్రను లోకానికి అందించాలని భగవంతుడు నిర్ణయించాడు కావున పౌరోహిత్యం వైపు వెళ్ళలేదు. చదువు పట్ల ఆసక్తి లేకపోయినా




ఐదవ తరగతి కోసం కుటుంబీకులు భువనగిరికి పంపారు. ఒకేడాది గడిచాక మేన మరదలితో వివాహం జరిగింది. కొంత కాలం తర్వాత గుంటూరులోని దాచేపల్లిలో ఉన్న తన బంధువుల ఇంట్లో పాఠశాల విద్యను చదివారు.

**ఉద్యమం**

శాస్త్రి గారు పుట్టేనాటికి హైదరాబాద్ రాష్ట్రం ఉద్యమాగ్నిని రాజేసుకుంది. వారు పెరిగి పెద్దయ్యే నాటికి ఆ ఉద్యమం కూడా సాంస్కృతికంగా, రాజకీయంగా విస్తృతమవుతూ వచ్చింది. ఆ ఉద్యమం నిజాం, హైదరాబాద్ రాష్ట్రాన్ని వీడాలని, భారతావనికి స్వరాజ్యం వచ్చాక యూనియన్ ప్రభుత్వంలో విలీనం అవ్వాలని పలు నిర్దేశాత్మక ఆశయాలతో కొనసాగింది. ఆ ఉద్యమం పలు సంస్థల, పలు పార్టీల ఆధ్వర్యంలో ముందుకు సాగింది. దానిలో కమ్యూనిస్టు పార్టీ ఒకటి. శాస్త్రి గారిపై రావి నారాయణరెడ్డి వైయక్తిక ప్రభావం బాగా పడింది. దీంతో పదకొండవ ఆంధ్ర మహాసభ సమావేశాల్లో పాల్గొన్నారు. కొంతకాలం సోలిపురం లక్ష్మీ నరసింహ రెడ్డి అనే నాయకుని ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమంలోనూ పాల్గొన్నారు. ఈ విధంగా ఆనాడు అందరి నోళ్ళల్లో నానిన నాయకుల ప్రభావాలతో ప్రేరేపితుడై, నిజాం నుంచి విముక్తి కలగాలని చేసిన పోరాటంలో భాగమై నేలపట్లలో ఏర్పాటు చేసిన కమ్యూనిస్టుల క్యాంపులో చేరారు. ఈ క్యాంపుల ద్వారా ఆనాడు ప్రజలను నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని చైతన్యం తీసుకురావాలని తపించి సరిహద్దుల వద్ద వీటిని నెలకొల్పారు. ఇలా

నాయకుల ప్రభావానికి గురై, 1947లో కొండూరు మార్కండేయ శర్మ గారిచ్చిన ప్రోత్సాహంతో ఎర్రజెండా పార్టీలో చేరారు. ఈ సందర్భంలోనే తల్లిదండ్రులు, శాస్త్రి గారిని ఉద్యమానికి దూరంగా ఉంచాలని భావించడంతో కావచ్చును గుంటూరులో ఉన్న తమ బంధువుల ఇంటికి పంపారు. శాస్త్రి గారు స్వాతంత్ర్యం కోసం నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నారు. శాస్త్రి గారు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలోనూ పాల్గొని, అనారోగ్యంగా ఉన్నా, మంచిర్యాలలో జరిగిన తెలంగాణ జనసభకు హాజరై అప్పటి వరకు ఎవరూ ఎత్తని 610 జీ.వో విషయాన్ని లేవనెత్తి గంభీరంగా మాట్లాడారు.

**ఉద్యోగం, ఉన్నత చదువు**

శాస్త్రిగారు కొంతకాలం అధ్యాపక వృత్తిని నిర్వహించారు. ఆనాటి నాయకుడు గోపాలరావు ఎగ్బోటే సహకారం అందించడంతో నారాయణగూడ పాఠశాలలో 1952వ సం.లో ఉద్యోగం దొరికింది. ఇది కాస్త 1954 లో గోషామహల్ పాఠశాలకు బదిలీ అయ్యింది. ఇలా ఉపాధ్యాయులుగా ఉద్యోగం చేస్తూనే 1959లో ఉస్మానియా యూనివర్సిటీలో ఎం.ఏ తెలుగు చదివారు. అనంతర కాలంలో అనివార్య పరిస్థితుల్లో బోధనావృత్తికి స్వస్తి పలికారు. వీరు యూనివర్సిటీలో ఉన్నప్పుడు, ఈనాడు మహామహులుగా పేరొందిన వారందరితో సన్నిహితంగా మెలిగేవారు. వారిలో పల్లా దుర్గయ్య, బిరుదురాజు రామరాజు, చెలమచెర్ల రంగాచార్యులు, ఖండవల్లి లక్ష్మీరంజనం లాంటి వారున్నారు.

ఎం.ఏ లో ఉన్నప్పుడే పరిశోధన చేయాలనుకున్న వీరికి తన పరిశోధన పట్ల సరైన స్పష్టత ఉండడంతో సకాలంలోనే "శాసనాల ద్వారా తెలుగు భాషా పరిణామం" (Evolution of telugu language through Inscriptions) అనే అంశంపై సిద్ధాంత వ్యాసం పూర్తి చేసి సమర్పించినా అది నిరాకరణకు గురైంది. కారణం, ఆయన సిద్ధాంత వ్యాసంలో ఆదికవి నన్నెచోడుడు అని ప్రతిపాదించడం. ఈ ప్రతిపాదనను నచ్చని ఆచార్య దివాకర్ల వేంకటావధాని వ్యాసాన్ని తిరగేసి రాయాలని కోరాడు. దానికి కార్య దీక్షత, నిబద్ధత గల్గిన పరిశోధకుడు అంగీకరించలేదు. దాంతో వారికి డాక్టరేట్ పట్టం లభించలేదు గానీ, నమ్మిన సిద్ధాంతం కోసం కార్యరంగంలోకి దిగడం, నమ్మిన దానికే కట్టుబడి వుండటం మూలానా ఆయన ఎంత స్థితప్రజ్ఞత గల వ్యక్తియో ఈ సంఘటన ద్వారా తెలుసుకోవచ్చు. ఈ సంఘటన గురించి ఆచార్య మాదిరాజు రంగారావు **"ఆత్మ ప్రత్యయంతో సదభిమానంతో పిహెచ్.డి డిగ్రీని తృణప్రాయంగా వదులుకున్న ఉక్కుమనిషి బి. ఎన్ శాస్త్రి"** అన్నాడు. రోజుల్లో 'సత్య ప్రకటనకై తన ప్రాణాన్ని విష పాత్రకు విసిరేసిన పురుష పుంగవుడిలా, సత్యాన్ని ప్రతిపాదించి, నమ్మిన సత్యాన్నే ప్రకటించి పొందవలసిన తన డాక్టరేట్ డిగ్రీని పుచ్చుకోకుండానే యూనివర్సిటీకి విసిరేసిన సత్య ప్రతిపాదన శక్తిశాలి బి.ఎన్. శాస్త్రి.

**సాహిత్యం, పత్రికా సేవ**

వీరు 'ఆంధ్ర ప్రదేశ్ చరిత్ర సంస్కృతి' అనే గ్రంథాన్ని మూడు సంపుటాలుగా రచించి వారికి అత్యంత ఆప్తులైన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి చేత ఆవిష్కరింప చేశారు. రావి నారాయణరెడ్డికి, వీరికి మధ్య ఉన్న సాన్నిహిత్యం వీరి చేత నారాయణ రెడ్డి గారి ఆత్మకథ ప్రచురణకు దారి వేసింది. వీరు రెడ్డిరాజ్య, బ్రాహ్మణ రాజ్య సర్వస్వాల్ని రాశారు. 1986లో నల్లగొండ జిల్లా సర్వస్వం రాసి తెలంగాణలో సర్వస్వాల రచనకు శ్రీకారం చుట్టారు. దీని అనంతరం ఆదిలాబాద్ , మహబూబ్ నగర్ జిల్లాల సర్వస్వాలూ రాశారు. సురవరం ప్రతాపరెడ్డి తరవాత, 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' అనే గ్రంథాన్ని 1974లో శాస్త్రి గారు రచించారు.

నరసింహ శాస్త్రిగారు పరిశోధనకే పరిమితమవకుండా సాహిత్య సృజన కూడ చేపట్టారు. పలు చారిత్రక నవలలు రాశారు. అవి, వాకాటక దేవి (అంకితం, పులిజాల వెంకట రంగారావుకి) విప్లవ జ్వాల (రావి నారాయణరెడ్డికి అంకితం), తుక్కాదేవి. వీటితో పాటు మరికొన్ని ఇతర నవలలు రాశారు అవి, రాధ, జీవనపథం, తీరిన కోరిక, పరివర్తన, జీవిత గమనం, సంధ్యారాగం వంటివి. "నిర్బంధ విద్య" అనే నాటిక రాశారు. నీరాజనం అనే గేయ నాటిక, తపోభంగం అనే గేయ కావ్యం, పాపాయి పతకం అనే బాల గేయ కావ్యం, సహకారం, గ్రామ జీవనం, కీరాయిదారు అనే నాటకాలు రాశారు. మన సంస్కృతి చరిత్ర, శ్రీనాథ భారతం (సంపాదకత్వం), భారతదేశ చరిత్ర – సంస్కృతి (21 సంపుటాలు), అలాగే వీరు పులిజాల వెంకట రంగారావు గారి జీవిత చరిత్ర రాశారు. వీరి మానస పుత్రిక అయిన మూసీ పత్రికను 1980 ఆగష్టులో సాహిత్య, చారిత్రక, సాంస్కృతిక మాసపత్రికగా స్థాపించారు. దీని తొలి సంచిక, మహాకవి దాశరథి రచించిన "ముచికుందా" అనే కవితతో ప్రారంభమైనది. ఈ విధంగా ప్రారంభమైన మూసీ పత్రిక పాఠకుల అభిమానాలను చూరగొని నేటికీ శాస్త్రి గారి ఆశయాలను కొనసాగిస్తున్నది.

**శాసనాల సేవ**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో ఎక్కడ ఏ రాయి కనిపించినా ప్రతీ రాయిలో ఏదో ఒక చరిత్ర, సంస్కృతి దాగే ఉంటుందని విశ్వసించి పరిశోధనకు పూనుకున్న వ్యక్తి. వీరికి మనుషుల కంటే రాతులతోనే ఎక్కువ సాన్నిహిత్యం అంటే అతియోక్తి కాదేమో. ఆ సాన్నిహిత్యమే తనను తెలంగాణ పల్లె సీమల్ని తిరిగేలా చేసింది. ఒక అధ్యాపకుడు, తన భుజానికి వేసుకున్న సంచిలో నాలుగు పుస్తకాలు, రెండు కలాలు, సులోచానాలు పెట్టుకోవడం సహజం. కానీ ఒక శాసనాల పరిశోధకుడు తన వాహనంలో శాసనాల అన్వేషణ కోసం వెళ్ళే సందర్భంలో పారలు, బొగ్గులు, చాక్ పీస్ లు పెట్టుకొని వాహనాన్నే సామాన్ల బండిగా మార్చడమొక ప్రత్యేకత. నిబద్ధత గల అన్వేషణ కూడాను.

తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక, చారిత్రక సమాజానికి తన పరిశోధన, అన్వేషణల ద్వారా ఇంతటి అపారమైన సేవ చేసిన భిన్నూరి నరసింహ శాస్త్రి గారు ఏప్రిల్ 4, 2002 లో కాలంధర్మం చెందారు.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 2 (9) హైదరాబాద్ డిసెంబర్ : 2022

# బాలవ్యాకరణం – శ్రీరామ, శ్రీకృష్ణ అవతారాంశాలు

డా. గంగిశెట్టి లక్ష్మీనారాయణ, ఫోన్ : 9494248348

భాషను విశ్లేషించే శాస్త్రం వ్యాకరణం. భాషలోని పదజాలంయొక్క ప్రకృతి ప్రత్యయ సంయోజనని శాస్త్రీయంగా విశ్లేషించే శాస్త్రం వ్యాకరణం. వేదాంగాలలో ఒకటైన వ్యాకరణం సుశబ్ద అపశబ్ద పరిజ్ఞానం కలిగించే శాస్త్రం. వ్యాకర్తల ప్రాముఖ్యాన్ని ఆనందవర్ధనుడు **'ప్రథమే హి విద్వాంసో వైయాకరణాః'** అని తన ధ్వన్యాలోకంలో పేర్కొన్నాడు.

వ్యాకరణం రచించే శాస్త్రజ్ఞులు, ప్రత్యేకించి భారతీయులు ఆస్తిక్యబుద్ధి కలవారు కావడం ఒక విశేషం. అంతే కాకుండా వారు సంస్కృత సాహిత్యంలో ప్రప్రథమ మహాకావ్యమైన శ్రీమద్రామాయణం పట్ల గౌరవ ప్రపత్తులు కలవారు. ఆ కారణంవల్ల వారు తమ వ్యాకరణాదులలో శ్రీరామ, శ్రీకృష్ణ సంబంధి పదజాలాన్ని అనేక సూత్రాలకు ఉదాహరణలుగా ఇచ్చారు.

శాస్త్ర సంప్రదాయాల పాలనలో సంస్కృతం తరువాత తెలుగు నిలుస్తుందనడం సత్యం. ఆ దృష్టితోనే ఆంధ్ర వ్యాకర్తలు సంస్కృతంలో వ్యాకరణాలు వ్రాసినా, పద్యాలలో వ్రాసినా, గద్య పద్ధతిలో సూత్రరచన చేసినా శాస్త్రసంప్రదాయాల్ని మార్చలేదు. ప్రత్యేకించి చిన్నయసూరి తన బాలవ్యాకరణంలో సంస్కృతశాస్త్ర మర్యాదలు పాటిస్తూ దైవసంబంధిత అంశాలను ఉదాహరణలుగా ఇచ్చా దనడం సత్యం. బాల వ్యాకరణంలో శ్రీరామ శ్రీకృష్ణ అవతారాంశాల గురించి పరిశీలించం ఈ వ్యాస రచనోద్దేశ్యం.

చిన్నయసూరి బాలవ్యాకరణ రచనలో శ్రీరామ శ్రీకృష్ణ అవతార సంబంధి అంశాలు అనేక రకాలలో ఉదాహరింపబడడానికి ప్రధానంగా ఐదు కారణాలు కనిపిస్తాయి.

మొదటిది పరవస్తు చిన్నయసూరి చాత్తాద వైష్ణవసంప్రదాయానికి సంబంధించినవాడు. విష్ణ్వాలయాలలో ఆగమోక్తంగా షోడశోపచారాలు నిర్వహించే శ్రీవైష్ణవులకు వీరు వివిధ కైంకర్యాలలో సహాయం చేసే పరిచారకులు. ప్రత్యేకించి చందనాదులను సమకూర్చడం, స్వామికి ప్రియమైన పుష్పమాలా కైంకర్యాదులను నిర్వహించడం. ఆ కారణం వల్లనే శ్రీవైష్ణవులకులాగా చాత్తాద వైష్ణవులకు కూడా రామ, కృష్ణాదులపై భక్తి ఎక్కువ. చాత్తాద వైష్ణవులు 'శరణాగతిని' నమ్మినవారు. శ్రీరామానుజ సిద్ధాంతం మేరకు శ్రీమద్రామాయణం శరణాగతిశాస్త్రం.

ఇక రెండవది ఆంధ్రులకున్న సహజమయిన శ్రీరామభక్తి. పక్షుల పేర్లలో రామచిలుక, సీతాకోకచిలుక అని పేరు పెట్టుకొని సీతారాముల పవిత్రనామాలను స్మరించే జాతి, శ్రీరామరక్ష సర్వ జగద్రక్ష అని విశ్వసించే జాతి, వినరాని మాట విన్నవేళ రామ రామ




అని స్మరించే జాతి, శ్రీరామకోటి సకల పాపహారి అని నమ్మే జాతి, రామదాసు, త్యాగరాజులను శ్లాఘించే జాతి మన తెలుగు జాతి కావడం.

మూడవది సూరి జన్మించిన జిల్లాలోను, పక్కనగల జిల్లాలలోనూ శ్రీరామాలయాలు ఎక్కువ ఉండడం తిరువళ్ళూర్‌లో వీరరాఘవ పెరుమాళ్, చెన్నైలో పార్థసారథి ఆలయాలుండడం. ఈ ఆలయాలను సేవించడం శ్రీవైష్ణవులకు పరమప్రీతి కరమైన అంశం.

నాల్గవది ఇతర భాషాసాహిత్యాలలో కంటే తెలుగుసాహిత్యంలోనే రామాయణాలు ఎక్కువ. సూరి పద్యరచనా ప్రియుడయినా, కావ్య గ్రంథస్థ కుశలుడయినా వ్యాకరణ రచన చేబట్టడం వలన ఆ వ్యాకరణ రచనలోనే తనకుగల రామాయణకథా ప్రీతిని ప్రకటించుకొన్నాడని చెప్పవచ్చు.

ఐదవది అన్నిటికిమించి సంస్కృత వ్యాకరణాదులలో కూడా మొదట రామశబ్దం నేర్చుకోవడంతోనే భాషాపరిచయం పెంచుకోవడం ఆనవాయితిగా ఉంది. శబ్దమంజరి వల్లె వేశాక సంగ్రహ రామాయణాన్ని 'ఆసీత్ అయోధ్యానగరీ' అని మొదలెట్టి నేర్చుకోవడం ఆనవాయితిగా ఉంది.

బాలవ్యాకరణంలో రామ, కృష్ణుల ప్రసక్తి రెండు రకాలుగా కనిపిస్తోంది. మొదటిది కేవలం రామ, కృష్ణ శబ్దాదుల ఉదాహరణ. ఇక రెండవది వాక్యరూపంలో రామాయణ కథాప్రసంగాలు ఉటంకించడం.

సంజ్ఞాపరిచ్ఛేదంలో **"సంస్కృత ప్రాకృతతుల్యంబగు భాష తత్సమంబు"** (సూ. 9)సూత్రానికి మొదట ఉదాహరింపబడింది. రామ: – రాముఁడు

సంధిపరిచ్ఛేదంలో **"ఉత్తునకచ్చు పరంబగునపుడు సంధియగు"** (సూ. 1) అనే సూత్రోదాహరణలో చిన్నయసూరి ఇచ్చిన ఉదాహరణ : రాముఁడు + అతఁడు = రాముడఁతడు.

"ఓ యామంత్రణంబు నందగు" (తత్సమ సూ. 14) సూత్రంలో ఇచ్చిన ఉదాహరణ – ఓ రాముఁడ.

కారక పరిచ్ఛేదంలో **"విశేష్యంబునకుం బోలె విశేషంబునకు లింగ విభక్తి వచనంబులగు"** (కారక సూ.19) అనే సూత్రంలోఉదాహరణగా 1. నంద తనయుండు కృష్ణుండు నాకు దిక్కు 2. దేవకీపుత్రు హరిని నుతింతు నెపుడు 3. శుభ విధాయుల రామకృష్ణుల భజింతు 4. భువనవంద్యను రుక్మిణిఁ బొగడుచుందు.

క్రియా పరిచ్ఛేదంలో **"అనభిహిత కర్త కొకానొకచో షష్ఠి బహుళంబుగానగు"** (సూ.124) అనుదానిలో **"కృష్ణుడర్జునుకు విశ్వరూపంబు జూపెను"** అన్నది ఉదాహరణగా చూపారు.

బాలవ్యాకరణంలో కేశవ, కృష్ణ, హరినామాలు ఉదాహరణలుగా ఇవ్వబడ్డాయి.

"అతి మానుష మత్యద్భుతమతి దుష్కరమయిన కేశవార్జున కృతిన్" – (కారక. సూ. 28)

"కృష్ణుండు తల్లివలన దాఁగె" – (కారక. సూ. 9)

"రామకృష్ణులు సాందీపనితోడ వేదంబులం జదివిరి" – (కారక. సూ.7)

"హరిననుఁ గృపగాంచెదును" – (క్రియా సూ.26)

"హరి ననుఁ గృప గాంచుతను"– (క్రియా.సూ. 26)

"ఆర్తి హరుఁడవౌ నినుఁ గొల్తు నంబుజాక్ష" – (కారక.సూ.34)

"అతులుఁడయి యప్రమేయుఁడౌ హరిని గొలుతు" – (కారక.సూ. 29)

"ఆద్యుఁడు నమేయగుణుఁడునౌ హరిని గొలుతు" – (కారక. సూ. 30)

"ఆద్యుఁడ యప్రమేయుండగు హరిని గొలుతు" – (కారక.సూ. 30)

"ఆద్యుఁడయి యప్రమేయుఁడై యఖిలసేవ్యుఁడై యెసంగెడు దేవుని నభినుతింతు" – (కారక సూ. 31)

బాలవ్యాకరణంలోని కొన్ని సూత్రాల ఉదాహరణ వాక్యాలను ఒకచోట చేరిస్తే సంక్షిప్త రామాయణకథ తయారవుతుంది.

"రామునికంటె నన్యుండు ధానుష్కుండు లేడు" – (కారక. సూ. 12)

"విశ్వామిత్రుడు రామునకు మిథిలం గానిపించెను' – (క్రియా. సూ.124)

"రాముడు మిథిలం గనియె" (క్రియా.సూ.124)

"రాముడు విల్లందినం ద్రిలోకంబు లాకులంబులగు"–(కారక. సూ.32)

"జనకుండు రామునకుం గన్యనిచ్చెను" – (కారక. సూ. 8)

"రాముఁడు పట్టిన ప్రతినవారింపం దరంబు గాదు" – (కారక. సూ. 32)

"రాజనాజ్ఞ విధాతృనానతి" – (సంధి. సూ. 34)

"రాముఁడు వసించిన పర్ణగృహము" – (సమాస. సూ. 36)

"రాముఁడు వాలినొక్క కోలం గూలవేసె" – (కారక. సూ. 22)

"ఓ రాముఁడ! ఓ రాముఁడా! ఓ హరీ! – (తత్సమ. సూ. 14,15,33)

"ఓరోరి యింకెందుఁ బోవవచ్చు" – (తత్సమ. సూ.16)

"మడిసెడు దడములు, కావలుడు రావణుఁడు" – (సమాస. సూ. 5)

'లంకం గలకలంబు పుట్టె" – (కారక. సూ. 22)

"రామునిచే రావణుండు సంహరింపఁబడియె" – (కారక.సూ.1)

"రాముండు రావణుం బరిమార్చి సీతయుం దాను సౌమిత్రి సహితంబుగం బుష్పకారూఢుం డయి సాకేతంబున కేతెంచె"
– (క్రియా. సూ.120)

"సుగుణాభిరాముఁడు రామునకు జోహారు నొనర్చెద" – (కారక. సూ. 27)

"మేననిప్పుడుం బులకలు వొడమెడును" – (క్రియా.సూ. 22)

ఈ విధంగా బాలవ్యాకరణంలో చిన్నయసూరి ఉక్తి లాలిత్యంతో శ్రీరామ, శ్రీకృష్ణ అవతార అంశాలను చేర్చాడు. ఇందువల్ల బాలలు బాల్యంలో బాలవ్యాకరణం చదువుతున్నప్పుడు వారికి సంక్షిప్త రామాయణ కథాపఠన ప్రయోజనం కూడా కలుగుతుందనడంలో అతిశయోక్తిలేదు.

**ఆధార గ్రంథాలు**

1. చిన్నయసూరి బాలవ్యాకరణం రమణీయ వ్యాఖ్య – ఆంధ్ర విశ్వ కళాపరిషత్ – 1970

2. చిన్నయసూరి బాలవ్యాకరణం, ఘంటాపథవ్యాఖ్య – వంతరాం రామకృష్ణారావు, విశాలాంధ్ర ప్రచురణలు – హైదరాబాద్ – 2005



బందారం కథలు – 13

# ఒక చీకటి రాత్రి...

డా. నందిని సిధారెడ్డి, ఫోన్ : 9440 381148



ఎత్తి కుదేసినట్టు అకస్మాత్తుగా మెలకువ వచ్చింది సాయిలుకు. తల దిమ్ముగా ఉంది. కళ్లు నులుముకుంటూ చుట్టూ చూశాడు. ఎవరూ కనిపించలేదు. చిమ్మచీకటి. చిమ్మెటల చప్పుడు చీకాకు పెడుతున్నది. పక్కకు తడిమి చూశాడు. చెట్టు వేరు గట్టిగా ఒత్తుకున్నది. పక్కకు బొర్లబోయాడు. మట్టి మెత్తగా తగిలింది. తను ఎక్కడున్నట్టూ... అనుమానం మొదలైంది. బజారు పక్కన చింతచెట్టు ఒడిలో ఒళ్లు మరిచి పడిపోతే నిద్రపట్టినట్టు తెలిసొచ్చింది. కల్లు తాగిన తర్వాత సారా ప్యాకెట్ తాగడంతో సోయి తప్పినట్టు అర్థమైంది. కల్లు సరిపోనట్టు అనిపించే సారా దుకాణం దగ్గరికెళ్ళాడు. ఎంతసేపు బతిమిలాడినా సారాపొట్ల ఉద్దెర ఇయ్యనని నర్సింలు అన్నది గుర్తున్నది. కాళ్లల్లా మొక్కితే ఒక్కటంటే ఒక్క పొట్లం ఇచ్చి తలుపు మూసుకున్నది గుర్తున్నది. ఆ ఒక్క పొట్ల చింపుకొని నోట్లో పోసుకున్న తర్వాత ఏమైందీ గుర్తులేదు.

సాయిలు మెల్లగా లేచి కూర్చున్నాడు. పైకి చూచాడు. చుక్కలు చూసి నడిరాత్రి దాటి ఉండవచ్చునుకున్నాడు. పూర్తిగా స్పృహ లేకపోయినా ఇంటికెళ్ళి పడిపోతే మంచిదనుకున్నాడు. బలవంతంగా లేచి ఈడ్చుకుంటూ నడుస్తున్నాడు. మలుపు బురుజు దగ్గరకు చేరుకుంటే కాళ్లకు మెత్తగా గట్టిగా ఏదో తగిలి ఇబ్బంది అనిపించింది. కిందికి వంగి చూశాడు. కుక్క పడిపోయి ఉంది. తను ఎప్పుడు నడిరాత్రి నడిచొచ్చేటప్పుడు కుక్కలు మొరుగుతుంటే అదమాయించాడు గాని కుక్క పడిపోయి ఉండటమేమిటో తోచలేదు. దానికీ నిద్ర వచ్చిందేమో అనుకుని ముందుకు అడుగులు వేశాడు. తలదిమ్ము మరింత పెరిగింది. తన అడుగుల చప్పుడు తప్ప ఏమీ వినిపించలేదు. కనిపించటం లేదు. మరి రెండు అడుగులు వేశాడు. కొంచెం దూరంగా లైటు వెలిగి ఆరిపోయింది. టార్చిలైటు వెలుగు. మళ్లా వెలిగి ఆరిపోయింది. ఇంతరాత్రి ఎవరై ఉంటారు? టార్చిలైటు ఉండేది అయిదారుగురి ఇళ్లలోనే. పెద్ద సావుకారి బయటకు రాడు. పెద్ద పటేలు బయటకు రాత్రిపూట రాడు. ఎవరై ఉంటారు? ఆలోచిస్తూ అడుగులు వేస్తున్నాడు. మత్తు వదలకా, దిమ్ము వదలకా, ఆలోచన వదలకా అయోమయంగా ఉంది. అంతే. ఒక చేయి వచ్చి తలమీద కొట్టింది. తల గిర్రున తిరిగింది. సాయిలు కొంద పడిపోయాడు. తేరుకొని బలవంతంగా కళ్లు తెరుచుకొని చూశాడు. ఎదురుగా చెయ్యి, చేతిలో కత్తి బెదిరిస్తున్నది. లెవ్వుమని సైగ చేసిందా చెయ్యి. 'చుప్ బైట' గుసగుసగా లోగొంతు వినిపించింది. సాయిలుకు భయమైంది. అతను పిక్కలమటుకు చెడ్డీ వేసుకొని భీకరంగా ఉన్నాడు. సాయిలుకు ఏడుపొచ్చింది. కూచొమ్మన్న చోట కిక్కురు మనకుండా కూచున్నాడు. అతనిలాగే చెడ్డీలేసుకుని ఉన్న నల్లటి మరో మనిషి పక్కన కనబడ్డాడు. సారాపొట్లం తాగి చావు కొని తెచ్చుకున్నానని గజగజ వణుకుతున్నాడు సాయిలు.

కన్ను పొడుచుకున్నా కానరాని చీకటి. చిమ్మ చీకటి. భయపెడుతున్న ఇద్దరు మనుషుల ఆకారాలు కనిపించీ కనిపించనట్టు నల్లటి చీకటి. చావు భయం వంటి చీకటి. లేని సంసారం లాంటి చీకటి. మత్తు దిగిపోయినా దిక్కు తోచని చీకటి. సాయిలు కండ్లు పైకెత్తి చూసే ధైర్యంలేక నేలచూపులు తిప్పుకుంటూ ఓరగా పటేలు వాకిటి దాటి సావుకారి ఇంటివైపు చూశాడు. ఒళ్లు చల్లబడింది. బీడీ తియ్యబోయాడు. చెంప పెటిల్లుమన్నది.

సావుకారి ఇంటెనుక దర్వాజ దగ్గర ముగ్గురు, పదునైన ఇనుప పరికరంతో గోడ తొలుస్తున్నాడొకడు. గరగర.... గరగర చప్పుడు. నడుమ నడుమ టార్చి వెలిగించి చూస్తున్నాడొకడు. తలుపు గొళ్లెం దగ్గర గోడ పెళ్లలు పెళ్లలుగా రాలి పడుతుతున్నది. మరొకతని భుజానికి జోలె. జోలెలో కంకర రాళ్లు. లైటు వెలుగు పడినప్పుడు చేతిలో కత్తి మెరుస్తున్నది. సాయిలు వణుకుతూనే చూపులు కండ్లలోకి తెచ్చుకోబోయి ఆగలేక అవతల బజారు వైపు ఓరగా చూశాడు. మరో ఇద్దరు నల్లటి చెడ్డీలు వేసుకొని కావలి కాస్తూ

కనిపించారు. అటువైపు కూడా అప్పుడప్పుడు లైటు వెలిగి ఆరిపోతూ వుంది. ఒకని చంకకు సంచి ఉంది. ఒకని చేతిలో కత్తి ఉంది. ఆ వెలుగు కంటే చీకటే నయమనిపించింది సాయిలుకు. మరొకరు ఆవైపు నుంచి ఈ వైపుకు ఈ వైపు నుంచి ఆ వైపుకి అవయవాలన్నీ రిక్కించుకొని తిరుగుతున్నాడు. ఏ చిన్న అలికిడి కాకపోయినా చురుగ్గా తిరుగుతున్నాడు. చుట్టిన పగ్గం అతనితో పాటు చంకలో కదులుతున్నది.

అటుపక్క రెండు కుక్కలు మొరుగుతూ చేరబోయాయి. ఒకడు రాళ్లు విసిరాడు. భయపడి మొరుగుతూ కుక్కలు పరిగెత్తాయి.

గోడకు రంధ్రం పడ్డట్టు పెళ్ల రాలిపడ్డది. చిన్నగా లైటు వెలగింది. చెయ్యి పెట్టి చూస్తే పట్టింది. కొంచెం కొంచెం చేయి చాస్తే గొళ్లెం అందింది. కష్టంగా గొళ్లెం తీశాడు. తలుపులు నూకితే రాలేదు. గోడ సందుల్లో కట్టె బేడెం ఉన్నట్టు గమనించారు. చేతితో సందు తడిమి చూస్తే బేడెం పెద్దగా ఉండి ఊడ్చి వచ్చేటట్టు కనిపించలేదు. గోడకు పడిన రంధ్రాన్ని పెద్దది చేయటానికి ఇనుప పరికరంతో పొడువ సాగాడు. చప్పుడు కాకుండా పొడవటంలో అతని నైపుణ్యం బయటపడుతున్నది. కొద్దిసేపటి తర్వాత గోడరంధ్రం పెద్దదైంది. అంత పెద్ద మనిషి. నిలువెత్తు ఆకారం ఒదిగి ఒదిగి గోడ పొక్కలోకి దూరింది.'హోగయా' గుసగుసగా చెప్పాడు. లోపలనుంచి తలుపు తెరుచుకున్నది. ముగ్గురు దర్వాజలోంచి లోపలికి వెళ్లారు. కొంచెం ఖాళీ స్థలం చిన్న ఆవరణ. చీకట్లో చెట్లు కదులుతున్నాయి. చెట్లలాగా నల్లగా ముగ్గురు కదులుతున్నారు. ముందుకు పోగానే మరో దర్వాజ. మళ్లా దర్వాజ గొళ్లెం అంచనా వేసి గోడను తొలువసాగారు. మళ్లీ గరగర.... గరగర....

సాయిలు ముందునుంచి అడుగుల చప్పుడు వినబడుతున్నది. లైటు వెలిగింది. అంతే విసురుగా రాయి వెళ్లి తగిలింది. ఊగుతూ వస్తున్న వ్యక్తి పడిపోయాడు. రాయి విసిరినవాడే వెళ్లి నడిపించుకుంటూ తీసుకొచ్చి సాయిలుకు అంతదూరంలో కూచో బెట్టాడు. 'అన్నా' అనబోయాడతను. నెత్తి మీద 'ఫట్'మని తగిలింది. సాయిలు నోరు మూసుకొమ్మని పెదవుల మీద వేలుపెట్టి సైగ చేశాడు. చీకటి... నిశ్శబ్దం... సైగలు... గుసగుసలు ఎంత పెద్ద ఘోరం జరుగబోతుందో ఊహించుకుంటే సాయిలుకు భయమవుతున్నది. రాయి తగిలిన వ్యక్తి మాటిమాటికి తలను తడుముకుంటున్నాడు. నొప్పికి బొప్పికి నడుమ కండ్లల్లో నీరు తిరుగుతున్నాయి. చీకట్లో ఎవరికెవరూ కనిపించకపోయినా తెలియని భాషలో నడుమ నడుమ గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఎవరో లేసినట్టే పెద్ద సావుకారి పెద్ద భార్యకు మెలకువొచ్చింది. నిద్ర చెదిరి ఊపిరి పీల్చుకున్నది. ఏదో చప్పుడు వినిపిస్తున్నట్లనిపించింది. సత్తెమ్మ చెవి పెట్టి విన్నది. గర.... గర... గరగర.... ఆకురాయితో గోడను అరగదీస్తున్న చప్పుడు చిన్న పెళ్ళలు పడుతున్న చప్పుడు. మళ్లీ వింటున్నది. గరగర... అనుమానం లేదు. గోడ తొలుస్తున్నట్టు అర్థమైంది. కొంచెం దూరంగా అదే గదిలో పనిమనిషి లచ్చవ్వ నిద్రిస్తున్నది. లేపింది. చప్పుడు వినుమన్నది. నిజమే. దొంగలే అయి ఉండాలని నిర్ధారించు కున్నది. పెద్దభార్య మూడో దర్వాజ తెరిచింది. మెల్లగా వెళ్లి సావుకారిని లేపింది. దొంగల విషయం చెప్పింది. పెద్ద టార్చిలైటు పట్టుకొని పెద్ద సావుకారి వచ్చాడు. వచ్చి చూసేసరికి రెండో దర్వాజ గోడకు కన్నం పడిపోయింది. కన్నంలోంచి దూరిన చెయ్యి గొళ్లెం కోసం తడుముతున్నది. ఒక్కక్షణం సావుకారి వణికాడు. మరుక్షణం తేరుకున్నాడు. అడ్డుకోలేదు. రెండోభార్య లేచింది. నిశ్శబ్దంగా లోపలికి వచ్చేశారంతా. మూడో దర్వాజ అసలు దర్వాజ. తలుపులు గట్టిగా పెట్టారు. గొళ్లెం పెట్టారు. ఇనుపబేడెం పెట్టారు.

పెద్ద సావుకారి వేగంగా కదిలాడు. ఇటుపక్క అర్రలో పడుకున్న భూమయ్యను లేపాడు. భూమయ్య మరింత చురుకైన మనిషి. హుషారు మరింత ఎక్కువ. ఎడమవైపు పెరట్లో దర్వాజ తీసి కొట్టం తలుపులు తెరిచాడు. కొట్టంలో పడుకున్న జీతగాళ్లను త్వరత్వరగా లేపి లోపలికి రప్పించుకున్నాడు. అన్ని దర్వాజలు, తలుపులు గట్టిగా బిగించాడు. పెద్ద సావుకారి పెద్ద జీతగాడు మల్లయ్య చెవిలో గుసగుస చెప్పాడు. భూమయ్య నారాయణను తీసుకొని సావుకారి అనుమతి కోసం వచ్చాడు. ముగ్గురు జీతగాళ్లు పెద్దర్వాజ దగ్గర, ముగ్గురు జీతగాళ్లు మూడో దర్వాజ దగ్గర గొడ్డళ్లు పట్టుకొని నిలబడ్డారు. సావుకాని అనుభవం అంతా ఆ క్షణంలో నీరసడింది. తాయిమాయి అయితున్నాడు. పెద్ద భార్య చిన్న భార్యకు ధైర్యం చెప్తుతున్నది. కారంపొడి తెచ్చుకుందామనుకున్నారు కానీ, వంటింట్లోకి వెళ్ళితే ప్రమాదమని తోచి మానుకున్నారు.

రెండో దర్వాజ దాటి లోపలికొచ్చారు దొంగలు. ముగ్గురికి ఒకరు తోడయి నలుగురయ్యారు. మూడో దర్వాజ గోడ తవ్వుతున్నారు. సావుకారి కుటుంబం నిద్ర లేచిందని తెలిసింది గనుక దొంగలు బాహాటంగానే తవ్వుతున్నారు. వంటింట్లో రోకండ్లు దొరికితే తెచ్చి తలుపులు బద్దలు కొడుతున్నారు. ఒక్కోదెబ్బకు తలుపులు వణుకుతున్నాయి. దెబ్బదెబ్బకు సావుకారు ధైర్యం దెబ్బ తింటున్నది. గుండె వేగంగా కట్టుకుంటున్నది. తలుపు దడదడ విని క్షణక్షణానికి ప్రాణం మీద ఆశ పటాపంచ లయితున్నది. జీతగాండ్లు గొడ్డండ్లు, గోడలు ధైర్యం నిలబెట్టలేక పోతున్నాయి. యాదగిరి నరసింహస్వామినీ, తిరుపతి వేంకటేశ్వర స్వామినీ మాటిమాటికి తలచుకుంటున్నాడు.

భూమయ్య, మల్లయ్య ఇద్దరు జీతగాళ్లు బంగ్లా తలుపులు తెరిచారు. బంగ్లాపైకి చేరుకున్నారు. నలుగురూ నాలుగు దిక్కుల

నిలబడి శక్తికొద్దీ అరుస్తున్నారు. 'పెద్దసావుకారి ఇంటి మీదికి దొంగలొచ్చిండ్రు. రాండ్రుల్లో, రాండ్రుల్లో. నారాయణ తాంబాలం తెచ్చి బంగ్లా మీద దభాల్న ఎత్తేశాడు. పెద్ద శబ్దమైంది. "అయ్యా దొంగలొచ్చిండ్రు" "అన్నా దొంగలు".... 'ఓ పటేలా... ఓ మస్కూరీ దొంగలు, దొంగలు'. 'అయ్యాలారా ఉరికిరాండ్రి. సావుకారిని కాపాడుండ్రి" "దొంగలు... ఇంట్లకొచ్చిరి... అయ్యయ్యో.... దొంగలు... దొంగలు...."

ఊరంతా పిలుపులతో, అరుపులతో దద్దరిల్లుతున్నది. కొందరు అరుపులకు నిద్రలేచి ఇవతలికి వచ్చి వింటున్నారు. కొందరు అప్పటికే ఇంటి తలుపులు తెరిచి బడిత కట్టెలు వెదుకుతున్నరు. మరికొందరు మనకెందుకులే అని మలుచుకొని తిరిగి పండుకుంటున్నరు. పాలదుగోల్ల వాడ నుండి పదిమంది బడ్తలు పట్టుకొని బయల్దేరారు. "సావుకారింటికి దొంగలొచ్చిండ్రట.. పాండ్రి... పాండ్రి..." వాడల పిలుపులు మొదలైనాయి. అనుమాండ్ల నుంచి ఒక గుంపు, అలుగుల్ల నుంచి మరో గుంపు బయల్దేరినాయి. బంగ్లమీది పిలుపులు, వాడనుంచి వచ్చే అరుపులు ఓ అంటే ఓ అంటున్నాయి. మూడు దిక్కులనుంచి మూడు గుంపులు సావుకారి ఇంటివైపు అరుచుకుంటూ, చప్పుడు చేసుకుంటూ ఉరుకొస్తున్నాయి. కొందరు బడతలు పడితే కొందరు రాళ్లు పట్టుకొని ఉరుకొస్తున్నారు. ఏది దొరికితే అది ఆయుధం. ఒకరు వస్తే ఒకరికి ధైర్యం.

సావుకారి ఇంటి ఉత్తరం బజారు కావలి కాస్తున్న దొంగలు ఉరికొచ్చే గుంపు మీదికి రాళ్లు విసురుతున్నారు. గుంపు దొంగల మీదికి రాళ్లు విసురుతున్నది. గుంపులు చేరుకుంటున్న కొద్దీ దొంగలు దొరికిపోతామని ఆందోళన పడ్డారు. గుంపుల్లో యువకులు మరింత దూకుడుగా ముందుకొస్తున్నారు. దొంగలకు బందార మంటే ఏందో చెప్పాలని తెగింపు, సాహసం. ప్రాణాలకు సిద్ధపడి తెగించి మీదిమీదికొస్తుంటే దొంగలకు ప్రమాదం చేరువవతున్నదని అర్థమైంది. గుంపు చాలామంది. గుండెధైర్యం చాలా వుంది. అక్కడున్న దొంగలు ముగ్గురే. తట్టుకోలేమని సైగ చేసుకున్నారు. 'బాగో' బాస చేసుకున్నారు.

లోపల ఉన్న దొంగలకు బయట పరిస్థితి తెలియదు. వాళ్ళంతా ఒక కట్టు. ఎవరు దొరికినా అంతా బయట పడుతుంది. దొంగలపెద్ద ఈల వేశాడు. ఇవతలి దొంగలు ఈల వేశారు. లోపలి దొంగలకు ప్రమాదం తెలిసిపోయింది. ఈలల ఆంతర్యం అర్థమైపోయింది. పరుగు పరుగున బయటకొచ్చేశారు.

ఇంటెనుక దర్వాజ దగ్గర దొంగలందరు కలుసుకున్నారు. లెక్క సరిపోయింది. కత్తులు పట్టుకొన్న దొంగలు ముందు నడిచారు. రాళ్లు జోలెల్లో ఉన్న దొంగలు ముగ్గురు వెనుక నడుస్తూ వెంబడిస్తున్న గుంపు మీదికి రాళ్లు విసురుతున్నారు. పెద్ద దొంగలు నడుమ ఉరుకుతున్నా హుందాగా ఉన్నారు. వచ్చిన గుంపుల్లో ఒకటి సావుకారి ఇంటిముందు ఆగిపోయింది. దొంగల్ని ఎట్లా తరిమి కొట్టారో ఒకటోసుకుంటున్నారు. కొందరు పెద్దలు సావుకారిని పరామర్శించటానికి పెద్దర్వాజ ముందు నిలబడ్డారు. మరొక గుంపు వాళ్లను వెంబడిస్తున్నది. విసురుగా రాళ్లు పచ్చి తలలకు తగులుతున్నాయి. బడతలకు అందనంత దూరంలో దొంగల పరుగు. తరుముతూ ఊరోల్ల పరుగు. రాళ్లు, బడతలు పోటీ పడుతున్నాయి. ఆ బజారు మూల మలుపు దాకా ఉరికి ఆగిపోయింది గుంపు. వెనుకకు చూస్తే ఆ ఒక్క గుంపే మిగిలింది. సాయిలు గుమిగూడిన జనానికి తన పెద్దర్వాజ తెరుచుకొని పెద్ద సావుకారి యింటికొచ్చినాడు. అనుభవాన్ని విడమర్చి చెప్తున్నాడు.

దొంగలు రాళ్లు విసురుతూ, కత్తులు చూపెడుతూ మరోమూల దాకా పరుగెత్తారు. వెనుక ఎవరూ రావటం లేదని తెలుసుకుని నిమ్మలంగా నడుస్తున్నారు. ఒక వాడ.... మరొక వాడ.

ఊర్లో వినిపించిన కల్లోలానికి నిద్రలేచాడు చంద్రయ్య. తలుపు తీసుకొని బయటకు వచ్చి చూశాడు. ఏమీ లేదు. మూత్రం వచ్చినట్టనిపించింది. చెట్టునీడకు చీకట్లో కూర్చున్నాడు. అంతే దబాదబా అడుగుల చప్పుడు. బూట్లున్నాయి. చెడ్డీలున్నాయి. కత్తులున్నాయి. కలకలం బెదిరిస్తున్నట్టు వినిపించింది. మూత్రం ఆపేసి ఇంట్లోకి ఉరికాడు. వెంట రాకుండా అరవకుండా ఉండటానికి ఇంటిముందు ఏదో పడేశారు. దొంగలు దాటిన తర్వాత చంద్రయ్య వెళ్లి చూశాడు. ఎవరిదో చెవి గంటీ. బంగారిదే. తెచ్చుకొని తలుపులు బిగించుకున్నాడు.

దొంగలు పోతుంటే ఆ బజారు నడుమ ఇంటి తలుపు తెలిచి ఉన్నది. తలుపులు దర్వాజ గోడలు చూస్తుంటే చిన్న సావుకారి ఇల్లులాగే అనిపించింది. దొంగలు ఆ ఇంట్లో దూరారు. అప్పటికే లేచి ఉన్న ఆడవాళ్లు ఏడుపులు, బొబ్బలు బయట దొడ్లోకి వెళ్లిన చిన్న సావుకారి వచ్చి ఆయనా ఏడుపూ, అరుపూ. ఒక దొంగ కత్తి చూపి నోరు ముయ్యమని సైగ చేశాడు. ఇద్దరు అర్రలో దూరారు. సందుకలు తెచ్చి తాళాలు పగుల గొట్టారు. దేవుని పటాల చాటుకు దిగూళ్లు వెదికారు. ఇవతల ఈల వినిపించింది. గుంపు వస్తున్నట్టు అడుగులు వినిపించాయి. వెంటనే దొంగలు బయటకు ఉరికొచ్చారు. మళ్లీ పరుగు. దొంగల పరుగు. వెంబడిస్తూ గుంపుల పరుగు. రాళ్లు అయిపోవటం దొంగలు పరుగు పెంచారు దొంగలు. ఊరోళ్లు... పరుగు పరుగు... బజారు దాటుతుంటే పెద్దబండి ఆగి వుంది. ఒకరిని పట్టక ఒకరు దొంగలు ఉరుకుతున్నారు. చీకట్లో బండి కనిపించినా 'కాని' కనిపించలేదు. ఉరుకుతున్న దొంగ తడబడ్డాడు. బండి 'కాని' తట్టుకొని దభాల్న పడిపోయాడు. లేవబోయి మళ్లీ పడిపోయాడు. పడిపోయిన దొంగమీద దెబ్బలు పడిపోయాయి.

ఒక దొంగ దొరికిపోయాడు. కొట్టినంత కొట్టారు. కొట్టుకుంటూ తీసుకొచ్చి పెద్ద సావుకారి ఇంటిముందు నిలబెట్టారు. సావుకారి కొట్టంలోనుంచి తాళ్లు తెచ్చి ఆ దొంగను 'రాతికని' కట్టి వేశారు. వెనుకకు రెక్కలు విరిచి కట్టారు. నెక్కరులాంటి చెడ్డీ మాత్రమే వేసుకొని ఉన్నాడు. ఒంటిమీద ఏమీ లేదు. నల్లటి మొఖం. చిన్న కటింగ్ చేసిన తల వెంట్రుకలు. చూపుల్లో దైన్యం లేదు. దొరికిపోయానన్న దిగులు లేదు. ఏ భావమూ లేని నిదానం ఆ ముఖంలో నిండి ఉన్నది.

తెల్లారబోతున్నది. మసక చీకట్లు తొలగిపోలేదింకా. ఊరంతా పాకిపోయింది వార్త. పనులన్నీ మానుకొని దారులు పట్టారు జనం. 'దొంగ దొరికిండట'. 'సావుకారింటికాడ కట్టేసిండ్రట', 'ఎంత కొట్టినా ఏడుస్తలేడట', 'దొంగలెట్లుంటరో చూసొద్దాం పాండ్రి'. ఇట్లా ఒకరిమీద ఒకరు ఊరంతా సావుకారి ఇంటిదారి.

బావి దగ్గరికి వెళుతూ వచ్చే రైతులు, వాకిలి ఊడ్వబోయి మానేసి వచ్చే ఆడవాళ్లు. కళ్లు నులుముకుంటూ ఉరుకొచ్చే పిల్లగాండ్లు. కట్టె పట్టుకొని నడిచే ముసలివాండ్లు, యువకులు, తలా ఒక తిట్టు, తలా ఒక దెబ్బ. ఒకాయన చేతిలో గొడ్డలి ఉంది. గొడ్డలి చిప్పమర్లేసి దొంగ కాలిగోళ్ల మీద కొట్టాడు. దొంగ ఓర్చుకున్నాడు. 'దొంగలకు నొప్పి పెట్టదని' నిర్ధారించిందొకామె. ఆ గొడ్డలి తీసుకుని మరొక సేటు దొంగ మోకాలి చిప్పమీద కొట్టాడు. నోరు తెరిచి ఊకున్నాడు. 'అమ్మా' అని కూడ అంటలేదు. అంటే భాష తెలుస్తుందని దొంగలకు ట్రేనింగిస్తారు' అన్నాడొక సగం చదువరి. మొండి అంటే జగమొండి అన్నారు.

ఇంకొకతను గడ్డపార పట్టుకొని పనికిపోతూ అటు వచ్చాడు. 'ఇప్పుడు నేను చెప్పిస్తా" అనుకుంటూ దొంగ కాలి బొటనవేలి గోరు మీద గడ్డపార మర్లేసి గట్టిగా గుద్దాడు. 'నీ ఊరు చెప్పు' మళ్లా గుద్దాడు. నోరు తెరిచాడు దొంగ. 'నీ పేరు చెప్పు'. మళ్లీ గోరుమీద ఒత్తి నలిచాడు. మాట్లాడలేదు. 'ఎంతమంది ఉన్నరో చెప్పు' మళ్లీ పొడిచాడు. విప్పిన నోరు మూశాడు దొంగ.

'ఈ... గట్ల కొట్టకుండ్రి. దొంగమాత్రం మనిషి కాదా. గోళ్లమీద పొడిస్తె నొప్పి కాదా!' 'నిన్ను గుద్దాలె. దొంగలకు సద్ది కడుతవు ముసలిదానా"

అట్లా కాదనుకుంటూ దొంగ మాట వింటేనే జడుసుకునే సావుకారి దబ్బదం తెచ్చాడు. చేతివేళ్ల మీద కుచ్చాడు. కళ్లల్లో కుచ్చి గుడ్లు పీకేస్తా అని బెదిరించాడు. దొంగ నోట మాట లేదు. బాధగా, కోపంగా చూశాడు.

"సేటూ, వాడు నిన్ను యాదికి పెట్టుకుంటడు. మిగతా దొంగల్తోని వచ్చి నీ సంగతి చూస్తడు" 'ఔనే నాకెందుకొచ్చింది" "కాళ్లు చాపాడు దొంగ. తల ఎత్తాడు. దించాడు. పొద్దెక్కింది. వస్తూ పోతున్నారు జనం. హింసిస్తూ వీరత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. మధ్యాహ్నం పోలీసు జీపు వచ్చింది. జీపులో వెళ్తున్న దొంగ, ఊరివైపు అదోరకంగా చూశాడు.

'ఊరిమీద పగబడితే ఎట్లా...' అన్నారెవరో. 'అవును నిజమే. పగబడితే...' ఊరికి ధైర్యమూ ఎక్కువే, పిరికీ ఎక్కువే'...

---


## 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం **'కదంబం'.**

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

## ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.
తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.
330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.
అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

# బి.ఎన్.శాస్త్రి పురస్కార గ్రహీత (2022) డా. గుంజి వెంకటరత్నం గారితో ..
# మూసీ ముచ్చట




**"ఉత్సాహో బలవానార్య, నాస్త్యుత్సాహాత్పరం బలమ్**

**సోత్సాహస్య హి లోకేషు, న కించి దపి దుర్లభమ్"** (రామా.కిష్కింధా. 1-121)


*ఉత్సాహమే బలం. దాన్ని మించిన బలం లోకంలో లేదు. ఉత్సాహం ఉన్నవారికి అసాధ్యమని విడిచిపెట్టదగిన పని అంటూ ఈ భూమిమీద ఉండదు అని శ్లోకం తెలుపుతున్నట్లు 86 సంవత్సరాల వయస్సులో కూడా ఉత్సాహంతో సాహిత్య, శాస్త్రసేవ చేస్తున్నవారు... ఉద్యోగం, పదోన్నతుల కోసం పుస్తకాలు రాస్తున్న కాలంలో వయసుతో నిమిత్తం లేకుండా నిరంతరం అక్షర సేద్యం చేస్తున్నవారు... గ్రంథస్థమైన ప్రాచీన విజ్ఞానాన్ని ఆధునికులకు అందించాలనే దీక్షతో విజ్ఞాన సర్వస్వాలను నిర్మిస్తున్నవారు. తెలుగు అధ్యాపకులుగా ఉంటూ అందరిలాగా మూసపద్ధతి పరిశోధన కాకుండా ప్రత్యేక మార్గాన్ని అనుసరిస్తూ తనకంటూ ఒక స్థానాన్ని పదిలపరుచుక్ను డా. గుంజి వెంకటరత్నం గారికి ఈ సంవత్సరం శ్రీ బి.ఎన్.శాస్త్రి అవార్డును ప్రకటించిన సందర్భంగా...... మూసీతో ముచ్చట.*

**1. బి.ఎన్.శాస్త్రి గారి అవార్డు మీకు ప్రకటించడం పట్ల మీ అభిప్రాయం.**





**బి.ఎన్.** శాస్త్రి గారు చరిత్ర, సాహిత్య రంగాల్లో విశేష కృషి చేసిన విశిష్ట పరిశోధకులు. అటువంటి వారి అవార్డును చరిత్ర, సాహిత్య పరిశోధనా రంగంలో కృషి చేస్తున్న వారికి ప్రకటించడం ద్వారా ఆ రంగానికి ఇతోధిక ప్రోత్సాహం కల్పిస్తున్నందుకు సంతోషంగా ఉంది. మీలాంటి సంస్థల ప్రోత్సాహంతో ఎన్నో విశిష్ట పరిశోధక గ్రంథాలు వెలుగు చూడాలని ఆశిస్తున్నాను.

**2. కార్మికులుగా ఉన్న మీరు సాహిత్యం వైపు రావాలని ఎందుకనుకున్నారు?**




నేను బియ్యే ఫైనలియ్యరు చదువుతున్న రోజుల్లోనే ఒక మైకా వ్యాపారి వారి కుమార్తెతో వివాహం జరిగింది. బియ్యే పూర్తి కాగానే నన్ను ఆ మైకా వ్యాపారంలో దింపారు. అసలే వ్యాపార లక్షణాలు లేని నేను దాన్ని సరిగా నిర్వర్తించలేక చేతులు కాల్చుకొని ఇంటి పట్టు చేరాను. ఇదంతా నాలుగు సంవత్సరాల్లో జరిగి పోయింది. అప్పటికి నాకు ఇద్దరు కొడుకులు. అప్పుడు ఉద్యోగం కోసం ప్రయత్నిస్తే వరంగల్ ఆజాంజాహి మిల్లులో రైటర్‌గా ఉద్యోగం దొరికింది. ఆ రైటర్‌గిరీ నాకు ఇష్టం లేకపోయినా జీతం కోసం, జీవితం కోసం వెంటనే వరంగల్ ఆజాంజాహి మిల్లులో కార్మికుడుగా చేరిపోయాను. (1965) అధ్యాపకుడిగా స్థిర పడాలనుకున్న నేను కార్మికుడిగా విధులు నిర్వర్తిస్తూనే 1966లో బి.యిడిలో చేరేందుకు ప్రయత్నించాను. సీటురాలేదు. 1967 వరంగల్లులో ఆచార్య రామరాజుగారి ఆధ్వర్యంలో పి.జి.సెంటర్ ప్రారంభమయింది. తెలుగు విభాగంలో మొదటి జట్టు విద్యార్థిగా చేరిపోయాను. ఆ విధంగా వ్యాపార రంగంలో అడుగు పెట్టిన నేను, కార్మికుడుగా జీవితాన్ని కొనసాగించి, చివరకు సాహిత్యరంగంలో అధ్యాపకుడిగా స్థిరపడగలిగాను. ఏదీ మన చేతుల్లో ఉండదండీ. అట్లని చేతులుడిగి కూర్చోకూడదు. మన ప్రయత్నాలు మనం చేస్తూనే ఉండాలి.

**3. హంస వింశతిపై పరిశోధన చేయాలని ఎందుకనిపించింది?**




ఎం.ఏ. ఫైనల్ వరంగల్ పి.జి.సెంటర్ నుండి ప్రథముడిగా పాసైన నాకు వెంటనే వరంగల్ సి.కె.యం.కళాశాలలో అధ్యాపకు డిగా ఉద్యోగం లభించింది. (మార్చి 24, 1970) మొదటి నుండి ప్రాచీన సాహిత్యం మీద అభిమానం పెంచుకున్న నేను, ఆ రంగంలోనే పరిశోధన చేయాలనుకున్నాను. కొందరు ఆచార్యులను సంప్రదించాను. సుప్రసన్నాచార్య గారు హంసవింశతి మీద చేయి, ఆ ప్రబంధాన్ని పరిశోధనకుగాను ఇంతవరకు ముట్టుకోలేదు అని చెప్పి, పుస్తకం కూడా ఆయనే ఇచ్చాడు. తర్వాత రామరాజు గారికి ఆ విషయం చెప్పినప్పుడు ఆయన చాలా సంతోషించి, నేను ఇప్పటికి ఏడుగురికి హంసవింశతిని పరిశోధనాంశంగా ఇచ్చాను. ఒక్కరు కూడా దాన్ని ముట్టు కోలేదు. రత్నం.. నువ్వు తప్పక చేయవయ్యా అని

నన్ను ప్రోత్సహించాడు. అయితే హంసవింశతిలో అనేక శాస్త్రాంశాలు ప్రతిపాదింపబడి ఉన్నాయి. విషయపరంగా పరిధి పరిమితి ఎక్కువగా ఉంటుంది. అందుకని మొదట ఎం.లిట్. డిగ్రీకిగాను (అప్పటికి ఎం.ఫిల్ లేదు. తర్వాత దీని స్థానంలోనే ఎం.ఫిల్ వచ్చింది) **'హంసవింశతి సమకాలీన జీవన విధానం'** అనే అంశాన్ని గూర్చి పరిశోధన చేయి. అటు పిమ్మట **'హంసవింశతి – విజ్ఞాన సర్వస్వ లక్షణాలు'** అనే అంశం మీద పిహెచ్.డి. పరిశోధన చేద్దువు గాని అని సూచించాడు. ఎం.లిట్. పరిశోధనకు ఆయనే పర్యవేక్షకుడుగా ఉన్నాడు. ఎం.లిట్. పూర్తి అయింది. ఆ విధంగా ఉస్మానియా యూనివర్సిటీ నుండి మొదటి ఎం.లిట్. డిగ్రీ అందుకున్న వాడిని కూడా నేనే అయ్యాను. అటు పిమ్మట ఆచార్య సుప్రసన్నాచార్య వారి పర్యవేక్షణలో హంసవింశతి–విజ్ఞాన సర్వస్వ లక్షణాలు అనే అంశం మీద సిద్ధాంత వ్యాసం సమర్పించి కాకతీయ విశ్వవిద్యాలయం నుండి పిహెచ్.డి. పట్టా పొందాను. అయితే ఇక్కడ మీకొక విషయం చెప్పాలి. హంసవింశతి మీద పరిశోధన చేసేందుకు ఇంతకు ముందు కొందరు విద్యార్థులు ప్రయత్నించి మానుకున్నారు అని రామరాజు గారు చెప్పినా, నేను దానినే పరిశోధనాంశంగా ఎందుకు తీసుకున్నానంటే హంసవింశతి, పైకి చూచేందుకు ఒక శృంగార ప్రబంధంగా కనిపిస్తున్నా, దానిలోని 20 కథల్లో ఆనాటి (18వ శతాబ్దం) తెలుగునాట ప్రచురంగా వ్యాప్తిలోనున్న విద్యా విషయాలు, ప్రజల జీవన విధానం, ఆహార వ్యవహారాలు, ఆటలు పాటలు, గణిత, ఆయుర్వేద, కామశాస్త్రాది విశేషాలెన్నో పోగు పోసి ఉన్నాయి. కొత్త కొత్త విషయాలు తెలుసుకొనే ఆసక్తి ఉన్న నాకు అందులోని పూర్వతరాలకు సంబంధించిన విజ్ఞానాన్ని వెలికి తీసి సమకాలీనులకే గాక ఉత్తరోత్తర తరాల వారికందించాలనే ఆకాంక్షతో హంసవింశతినే పరిశోధనాంశంగా ఎన్నుకొని ముందుకు సాగాను. అందుకు నన్ను అన్నివిధాలా ప్రోత్సహించిన ఆచార్యులు రామరాజు గారికి, సుప్రసన్నాచార్య గారికి సర్వదా కృతజ్ఞుడను.

**4. విజ్ఞాన సర్వస్వాల వైపు మీ ఆలోచన ఎలా మరలింది?**

విజ్ఞాన సర్వస్వాల నిర్మాణం వైపు నా ఆలోచనలు సాగడానికి 'హంసవింశతి–విజ్ఞాన సర్వస్వం' అనే అంశంపై చేసిన పరిశోధన ముఖ్యకారణంగా చెప్పవచ్చు. ఈ సందర్భంగా ప్రాచ్యదేశ భాషల్లోనే గాక పాశ్చాత్య దేశ భాషల్లో వెలువడి ఉన్న రకరకాల విజ్ఞాన సర్వస్వాలను అధ్యయనం చేయడం జరిగింది. ముఖ్యంగా ఆంగ్లభాషలో వచ్చిన విజ్ఞాన సర్వస్వాల క్రమ పరిణామాన్ని పరిశీలిస్తే ఆనాటి ప్రాచీన సాహిత్యమే పునాదిగా కనిపిస్తుంది. గ్రీకు తత్వవేత్త ప్లాటో శిష్యులు అరిస్టాటిల్, స్ప్యూసెపెస్ అనే రచయితలు ఆయన రచనల్లోని విజ్ఞానాంశాలను సేకరించి, వాటికి వివరణలు వ్రాసి, ప్రచారం చేసినట్లుగా తెలుస్తుంది. అటువంటి కృషి మన దేశ భాషల్లో జరగలేదు. ఆ కారణంగా మనం ఎంతో మన పూర్వతరాల వారి విజ్ఞానం కోల్పోవలసి వచ్చింది. ఇటువంటి కృషి తెలుగులో కూడా చేస్తే బాగుంటుంది. మన ప్రాచీన సాహిత్యంలోని విజ్ఞానాంశాలను వెలుగులోనికి తీసుకొని వస్తే, పూర్వతరాల వారి చారిత్రక సాంస్కృతిక విజ్ఞానం భావితరాల వారికి అందిచ్చినట్లవుతుందనే ఆలోచనే నేను విజ్ఞాన సర్వస్వాల నిర్మాణానికి పూనుకొనేటట్లు చేసింది.


**5. నిఘంటు నిర్మాణ విభాగం కూడా మీకు చాల ఇష్టమైన అంశంగా విన్నాం.**

అవును నిజమే. నిఘంటువులు, విజ్ఞాన సర్వస్వాలు తోబుట్టువు ల్లాంటివి. అయితే చిత్రమేమిటంటే మన దేశ భాషల్లో నిఘంటువు పుట్టిన చాలాకాలానికి గాని విజ్ఞాన సర్వస్వాల ఆవిర్భావం జరగలేదు. కారణాలేమయినా కావచ్చు. ఆ విషయం అలా ఉంచితే, విజ్ఞాన సర్వస్వ నిర్మాణానికి ప్రప్రథమంగా చేయవలసింది ఆరోపాల ఎంపిక (Selection of Entries) అంటే అర్థవంతమైన, విషయ సమృద్ధమయిన పదాలనే ఆరోపాలుగా తీసుకోవలసి ఉంటుంది. అర్థవంతమైన పదాల నిర్మాణమే నిఘంటువు. 'ని=నిశ్చయేన, ఘంటయతి= భాషయతి' అనేది నిఘంటు పద వ్యుత్పత్తి. అంటే ఒక పదం యొక్క అర్థాన్ని కచ్చితంగా చెప్పేది నిఘంటువని భావం. అలా నిశ్చయమైన అర్థం. దానికి తగిన సమాచారం కలిగిన పదాలే విజ్ఞాన సర్వస్వాల్లో ఆరోపాలుగా ఉంటాయి. అలా ఈ రెంటికి అవినాభావ సంబంధం ఉంది. నిఘంటువులమీద అధ్యయనం చేస్తుండే రోజుల్లోనే కలకత్తాలో Oriental Languages మీద జరిగిన ఒక అంతర్జాతీయ సెమినార్ 'తెలుగు నిఘంటువుల మీద ఇంగ్లీషులో వ్రాసిన ప్రసంగ వ్యాసాన్ని సమర్పించడం జరిగింది. ఆ వ్యాసం వారి జర్నల్‌లో ప్రచురించబడింది కూడా. ఆ విధంగా నిఘంటు నిర్మాణం మీద కూడా అభిమానం పెంచుకున్న నేను ఆ విభాగంలోను కొంత కృషి చేయడం జరిగింది.

**6. విజ్ఞాన సర్వస్వాల వల్ల ప్రత్యేక ఉపయోగమేమిటి?**

ఈ రోజుల్లో మనం ఏ సంస్థకు పోయినా అక్కడ కనిపించేది "R & D" బోర్డు. అంటే Research and Development. తెలుగులో 'పరిశోధన–ప్రగతి'గా మనం చెప్పుకోవచ్చు. అంటే సమాజాభివృద్ధికి పరిశోధనే మూలమన్నమాట. ఈ పరిశోధనల వల్ల కలిగే ప్రయోజన మేమిటి? విజ్ఞాన సముపార్జన. విశ్వవ్యాప్తమై వివిధ శాఖలుగా విస్తరిల్లి ఉన్న ఈ విజ్ఞానాన్నిసేకరించి ఒక క్రమపద్ధతిలో చెప్పినపుడు అది సమకాలీన సామాజికులకే గాక భావితరాల వారికి అందుబాటులోనికి వస్తుంది. ఈ ఆశయ ప్రయోజనాలను సాధించేది ప్రముఖ సాధనమైన విజ్ఞాన సర్వస్వం. ఈ సందర్భంగా ఫ్రెంచి విజ్ఞాన సర్వస్వ నిర్మాతల్లో ప్రముఖుడయిన డెన్నిస్ డిడిరో చెప్పిన మాటలు గమనార్హం. 'విజ్ఞాన సర్వస్వాల నిర్మాణం వలన పూర్వ పూర్వతరాల వారి విజ్ఞానం ఉత్తరోత్తర తరాల వారికి అందుబాటు లోనికి వస్తుంది. లేకుంటే అది నష్టపోయే ప్రమాదముంది. మన


## ఎప్పటికైనా మహాభారతాన్ని ఒక విజ్ఞాన సర్వస్వంగా నిర్మించాలనే కోరిక ఉండేది...





సంతతివారు విజ్ఞానావలోకనంతో జ్ఞానవంతులు, సుఖవంతులు కావడం కూడా విజ్ఞాన సర్వస్వాల లక్షణమే'. విజ్ఞాన సర్వస్వం గ్రంథ రూపంలోఉన్నా, Multimedia System CDROM రూపంలో ఉన్నా మరే రూపంలో ఉన్నా డెన్నిస్ డిడిరో చెప్పినట్లు మానవ సమాజం జ్ఞానవంతం, సుఖవంతం కావడమే విజ్ఞాన సర్వస్వాల ప్రయోజనం.

**7. మీరు స్ఫూర్తి పొందిన సర్వస్వాలను గూర్చి వివరిస్తారా? మీరు నిర్మించిన సర్వస్వాలకు ఎవరి పద్ధతిని ఆదర్శంగా తీసుకున్నారు?**


నేను నిర్మించిన విజ్ఞాన సర్వస్వాలకు ప్రత్యేకంగా ఏదో ఒక విజ్ఞాన సర్వస్వం స్ఫూర్తిగా నిలిచింది అని చెప్పలేను గాని, మొత్తం మీద ఇంగ్లీషు విజ్ఞాన సర్వస్వాలు Encyclopedia Britanica, World Book of Encyclopedia, Pears Encyclopaedia మొదలైనవి స్ఫూర్తి కావచ్చును. తెలుగులో దేవిడీ జమీందారయిన కందుకూరి బాల సూర్య ప్రసాదరాయ భూపాలుడు ఒంటి చేత్తో నిర్మించిన 'ఆంధ్ర విజ్ఞానము' నన్ను బాగా ఆకర్షించింది. అది ఏడు సంపుటాలుగా దాదాపు 4000 పుటల్లో వెలువడిన విజ్ఞాన సర్వస్వము. సంక్షిప్త సమాచారంతో, సులభశైలిలో రచింపబడిన ఒక విశిష్ట గ్రంథం. ఆయన కృషి అభినందనీయం. అయితే విజ్ఞాన సర్వస్వ నిర్మాణాల్లో అనేక పద్ధతులున్నాయి. ఏ పద్ధతిలో మనం విజ్ఞాన సర్వస్వ నిర్మాణానికి పూనుకున్నామో, అదే పద్ధతిలో అంతకు ముందు నిర్మించబడి ఉన్న విజ్ఞాన సర్వస్వాలు స్ఫూర్తిగా నిలుస్తాయి. ఈ దృష్టితో చూచినప్పుడు నా మొదటి ప్రయత్నం 'హంసవింశతి–విజ్ఞాన సర్వస్వం' అనేది ప్రాకరణికాక్షర క్రమంలో (Selectional Alphabet) నిర్మింపబడింది. దీనికి స్ఫూర్తి ఇంగ్లీషులో ఇదే పద్ధతిలో వచ్చిన Pears Encyclopedia. 'వరంగల్ జిల్లా విజ్ఞాన సర్వస్వం' విషయ– అకారాది పద్ధతి (Topical, Alphabet System)లో నిర్మించబడింది. దీనికి బి.ఎన్. శాస్త్రి గారి మండల సర్వస్వాలు, తెలుగు భాషా సమితి వారు నిర్మించిన 'విజ్ఞాన సర్వస్వ సంపుటాలు' స్ఫూర్తిగా నిలుస్తాయి. తర్వాత వచ్చినవి 'ప్రాచీన సమాజ విజ్ఞాన సర్వస్వము', 'మహాభారత విజ్ఞాన సర్వస్వము'. విజ్ఞాన సర్వస్వ నిర్మాణాల్లో సంప్రదాయ పద్ధతి, బహుళ ప్రచారంలో ఉండేది. అక్షర సమీకరణ పద్ధతి (Limit Letter System)లో నిర్మించబడినవే. ప్రపంచ భాషల్లో వచ్చిన అనేక విజ్ఞాన సర్వస్వాలు ఈ పద్ధతిలో నిర్మింపబడినవే.




**8. ప్రాచీన సమాజ విజ్ఞానసర్వస్వంలో అందించిన అంశాలను గూర్చి కొన్ని మాటలు వివరిస్తారా?**




అంతకు ముందు తరాల నాటి విజ్ఞానమంతా ఏమయినట్లు అంటే ఆయా కాలాల్లో వచ్చిన కావ్యాల్లో నిక్షిప్తమై ఉంది. ప్రాచీన కావ్యాలు పద్య రూపంలో, గ్రాంథిక భాషలో ఉండడం వలన సామాన్య పాఠకులకు అందుబాటులో లేకుండా పోయింది. కావ్య నిర్మాతల్లో విజ్ఞాన ప్రసారాపేక్ష గల కవులు కొందరుంటారు. అలాంటి వారు తమ కాలంలో వ్యాప్తిలోనున్న విజ్ఞానాంశాల నన్నిటిని తమ రచనల్లో పొందు పరుస్తుంటారు. అలాంటి కావ్యాల్లో మొదట నిలిచేది మహాభారతమే. అటు పిమ్మట చెప్పదగినవి పండితారాధ్య చరిత్ర, సింహాసన ద్వాత్రింశిక, శుకసప్తతి, హంసవింశతి, వాణీవిలాస వనమాలిక మొదలైనవి. వీటిలోని విజ్ఞానాంశాలను ఆరోపాలుగా గ్రహించి వాటి సమాచారాన్ని సంక్షిప్తంగా సమకూర్చి నిర్మించిందే ప్రాచీన సమాజ విజ్ఞాన సర్వస్వం. (తెలుగు అకాడమి ప్రచురణ) ఉదాహరణకు బట్టమేక జలమట్టె, సంపాతి, వారుడము మొదలైన పదాలకు సంబంధించిన వివరాలు కాదు గదా, వాటి అర్థాలు కూడా ఈ తరం వారికి తెలియక పోవచ్చు. పోనీ వాటి అర్థాలయినా తెలుసుకుందామా? అని నిఘంటువులు చూస్తే అవి ఒక విధమైన పక్షి విశేషాలుగా మాత్రమే మనకు తెలుస్తుంది. వాటిని



గురించిన సమాచారాన్ని ప్రాచీన సమాజ విజ్ఞానసర్వస్వం అందిస్తుంది. అవసరమైనచోట్ల నేటి సమాజానికి అన్వయించి కూడా సమాచారాన్ని సమకూరుస్తుంది. ఉదాహరణకు చిర్రగోనె అనే పదముంది. ఇది ఒక క్రీడా విశేషం. తెలుగు నేల నాలుగు చెరగులా వేరు వేరు పేర్లతో బాలురు ఈ ఆట ఆడుతుంటారు. దీనికి నేడు విశ్వవ్యాప్తంగా ఆదరణ పొందుతున్న క్రికెట్ ఆటకు దగ్గర పోలికలున్నాయి. అలాంటప్పుడు చిర్రగోనె ఆట ఏయే ప్రాంతాల్లో ఏయే పేర్లతో వాడుకలో ఉన్నదో సూచిస్తూ ఆయా ప్రాంతాల్లో ఆ ఆట ఆడే పద్ధతులు, దానికి క్రికెట్‌కు ఉండే పోలికలు కూడా వివరించడం జరిగింది. ఇలాగే అందులోని దాదాపు 4000 పదాలకు సంక్షిప్త సమాచారాన్ని సమకూర్చిన గ్రంథం ప్రాచీన సమాజ విజ్ఞాన సరస్వం.

**9. వరంగల్ జిల్లా విజ్ఞాన సరస్వం పొందిన ఆదరణ గురించి చెప్పండి.**

జిల్లా విజ్ఞాన సర్వస్వాల్లో అక్షర క్రమంలో నిర్మించిన తొలి విజ్ఞాన సర్వస్వంగా ఇది పాఠక లోక ఆదరణ పొందింది. అది వెలువడిన తొలి రోజుల్లో నాకు ఎన్నో ఫోనుకాల్సు వచ్చేవి. కొంత మంది కొత్త సమాచారాన్ని అందిస్తూ ఉత్తరాలు కూడా వ్రాశారు. అనతి కాలంలోనే ఆ గ్రంథం అమ్ముడైపోయింది. ఇప్పుడది మార్కెట్‌లో దొరకడం లేదు. అందుకని దాని కోసమై పాఠకులు ఇప్పటికీ నాకు ఫోన్లు చేస్తూనే ఉంటారు. అంత ఆదరణ పొందిన వరంగల్ జిల్లా విజ్ఞాన సర్వస్వం మళ్లీ ప్రజల కందుబాటులోనికి తెచ్చేందుకు ద్వితీయ ముద్రణకు తయారౌతున్నది.

**10. ఈ వయసులో మహాభారత విజ్ఞాన సర్వస్వాన్ని నిర్మించే సాహసానికి ఎందుకు పూనుకున్నారు?**

మీరన్నట్లు ఈ వృద్ధాప్య దశలో మహాభారత విజ్ఞాన సర్వస్వ నిర్మాణానికి పూనుకోవడం సాహస కార్యమే. మహాభారతమంటే విజ్ఞాన భాండాగారం. అందులోని శాస్త్రాద్యనేకానేక అంశాలను ఆరోపాలుగా ఎంపిక చేసి, వాటికి సంబంధించిన సమాచారాన్ని సేకరించడం. దాన్ని క్రోడీకరించి ఒక క్రమ పద్ధతిలో నిబంధించడం అంత సులభసాధ్యము గాదు. అందులోను ఒక్కడు ఆ పనికి పూనుకోవడం నిజంగా సాహసమే. అయితే అది ఈ మధ్య కాలంలో తలపెట్టిన కార్యం గాదు. హంస వింశతి మీద పరిశోధన గావిస్తున్న రోజుల్లోనే నా దృష్టి మహాభారతం మీద ఉండేది. ఎప్పటికైనా మహాభారతాన్ని ఒక విజ్ఞానసర్వస్వంగా నిర్మించాలనే కోరిక ఉండేది. అది రాను రాను జీవిత లక్ష్యంగా పరిణమించింది. హంస వింశతిపై పరిశోధన పూర్తిచేసి పట్టా పొందిన తర్వాత మహాభారతాన్ని విజ్ఞాన సర్వస్వ దృష్టితో అధ్యయనం చేయడం ప్రారంభించాను. విజ్ఞానాంశాలకు సంబంధించి నోట్సు వ్రాయడం మొదలు పెట్టాను. ఈ పని 1980 ప్రాంతాల్లోనే ప్రారంభమయింది. అప్పటికి నా వయస్సు 43 సంవత్సరాలుంటుంది. ఇప్పుడు నా వయసు 86 సంవత్సరాలు. అప్పుడు మొదలు పెట్టిన ఈ విజ్ఞాన సరస్వ రచన, మధ్యలో కొన్ని అవాంతరాలు వచ్చినా, 2015లో గాని పూర్తి కాలేదు. మూడు సంపుటాలుగా (నామ విజ్ఞానం, సూక్తి విజ్ఞానం, శాస్త్ర విజ్ఞానం) దాదాపు 1600 పుటల్లో వెలువడిన ఈ ఉద్గ్రంథం ప్రచురించేందుకు ఏ సంస్థ ముందుకు రాలేదు. ఎమెస్కో వాళ్ళను సంప్రదించగా చివరకు చంద్రశేఖరరెడ్డి గారి సౌజన్యంతో మూడు సంపుటాలుగా ఉన్న ఆ ఉద్గ్రంథం ఏక సంపుటంగా ప్రచురింపబడి వెలుగులోనికి వచ్చింది.


**11. మహాభారతంలో.. ఇవి మీకు తెలుసా? అనే గ్రంథంలో 27 ప్రశ్నలు మాత్రమే ఎందుకు వేసుకొని వివరించారు.**

మహాభారతం కేవలం 27 ప్రశ్నలకే పరిమితం కాదు. ఆ మహాకావ్యాన్ని మనం ఏ దృష్టి కోణం నుండి అధ్యయనం చేసినా, లోనారసి తెలుసుకోవలసిన విషయాలు వందల కొలది ఉంటాయి. ఉదాహరణకు పాండవులు మహాప్రస్థానంలో వారితో కూడా సారమేయం (కుక్క) ఎందుకు బయలుదేరింది. కవి ఆ పాత్రను ప్రవేశపెట్టడం వలన ఏ ప్రయోజనం సాధించదలిచాడు. సమాజానికి దాని ద్వారా ఏ సందేశం ఇవ్వదలిచాడు? అలాగే ఖాండవ గృహ నిర్మాణం చివరకు అర్జునుడికి ప్రాణహానిగా ఎందుకు పరిణమించింది. మాండవ్యమహర్షి కథ నేటి బాల నేరస్థుల చట్టానికి ఉన్న సంబంధమేమిటి? నేటి న్యాయ వ్యవస్థలో దాని ప్రాముఖ్యమేమిటి? ఇలాంటివే కొన్ని వందల సందేహాలు పాఠకులకు కలుగక మానవు. నా అధ్యయనంలోనే వందకు పైగా ప్రశ్నలు వెళ్లాయి. అయితే వాటిలో నాకు మిక్కిలి ఆసక్తికరంగా అనిపించిన వాటిని మాత్రమే ఎంపిక చేస్తే అవి 27వరకు వచ్చాయి. ఇంకా అనేక ప్రశ్నలు మిగిలి ఉన్నాయి. వాటిలో ఒక పదంలో జవాబు చెప్పగలిగినవి, ఒక వాక్యంలో జవాబులుండేవి మరికొన్ని వందల వరకు ఉన్నాయి. ఉదాహరణకు కురుక్షేత్ర సంగ్రామంలో మొదట అసువులు బాసిన రాకుమారు డెవరు. దీనికి ఒకే పదంలో సమాధానం చెప్పవచ్చు. అలాగే ఒకే వాక్యంలో సమాధానం చెప్పగల్గిన ప్రశ్నలు భారతంలో కొల్లలుగా కనిపిస్తాయి. ఇలాంటి వాటినన్నిటిని సమీకరించి ఒక క్రమపద్ధతిలో 'మహాభారత క్విజ్' తయారు చేయాలనే కోరిక ఉంది గాని, ఈ ముదిమి వయసులో దానికి పూనుకునే సాహసం చేయలేక పోతున్నాను.

**12. మొదట్లో నాటక సాహిత్యం మీద కూడా కృషి చేశారని విన్నాము. ఆ విశేషాలు వివరిస్తారా?**

నాటక సాహిత్యం మీద నేను అంతగా కృషి చేయలేదు గాని, మొదటి నుండి నాటక సాహిత్యమన్నా, ప్రదర్శన అన్నా అభిమానం ఉండేది. నేను బియ్యే చదివే రోజుల్లో కళాశాల సాంస్కృతిక ఉత్సవాల్లో మా గురువుగారు పోలూరి హనుమజ్జానకీరామ శాస్త్రి గారి ప్రోత్సాహంతో తెలుగులోనే గాక హిందీలో కూడా నాటకాలకు

దర్శకత్వం వహించి, నటుడుగా కూడా ప్రదర్శనలిస్తుండేవాడిని, ఒక సంవత్సరం హిందీ నాటిక 'చందన్‌చోర్' నా దర్శకత్వంలో ప్రదర్శించడం జరిగింది. దాంట్లో హీరో పాత్ర చందన్ నేనే పోషించాను. ఆ సందర్భం ఆ ప్రదర్శనకు ఏకంగా ఏడు ప్రైజులు వచ్చాయి. ఆ ప్రభావం నా మీద బాగా పని చేసింది. ఆ నాటిక ఆంగ్లంలోని Bishop and Candle Stick అనే నాటికకు హిందీ అనువాదం. ఆ ఉత్సాహంలో ఆ నాటికను తెలుగులోనికి అనువదించి చాను. అది ముద్రణకు నోచుకోలేదు గాని, సి.కె.యం. కళాశాలలో అధ్యాపకుడిగా పని చేసే రోజుల్లో మా విద్యార్థుల చేత ఆ నాటికకు నేను దర్శకత్వం వహించి ప్రదర్శింప చేశాను. తర్వాత మా కళాశాలలో నాటక సాహిత్యం మీద ఒక రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించడం జరిగింది. దానికి నేను కోఆర్డినేటరుగా వ్యవహరించాను. 'నాటక రంగం–రచన–ప్రయోగం' అనే పేరుతో గ్రంథంగా కళాశాల ప్రచురించింది. ఈ గ్రంథాన్ని తర్వాత పాఠ్య ప్రణాళికలో రెఫరెన్సు గ్రంథంగా చేర్చడం జరిగింది. ఆ తర్వాత మా కళాశాలలో పి.జి. తరగతులు ప్రారంభించినపుడు కాకతీయ విశ్వవిద్యాలయం సూచనల మేరకు రెండు కొత్త పేపర్లు పెట్టవలసి రాగా, అందులో ఒకటి విజ్ఞాన సర్వస్వాలు, నిఘంటు నిర్మాణాలకు సంబంధించి, రెండోది నాటక సాహిత్యానికి సంబంధించి పాఠ్య ప్రణాళికలు తయారు చేసి ప్రవేశ పెట్టడం జరిగింది.




**13. మీ కుటుంబ నేపథ్యాన్ని గూర్చి వివరిస్తారా?**

మా స్వగ్రామం నెల్లూరు జిల్లా, సైదాపురం మండలం, కలిచేడు. మా తాత గారికి మా నాన్నగారు ఏకైక సంతానం. ఆయనకు మేము అయిదుగురం పిల్లలం. అందులో పెద్దవాడిని నేను. నాకు ఇద్దరు తమ్ముళ్ళు, ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. మా నాన్నగారు ఒక మైకా కంపెనీలో స్టోరు కీపర్‌గా పని చేసేవారు. 30 రూపాయలు జీతం. నాన్నగారు కాస్తో కూస్తో చదువుకున్న వాడు కాబట్టి కొన్ని దుకాణాల్లో లెక్కలు వ్రాసి మరికొంత సంపాదించేవాడు. దాంతో మాకేలోటు లేకుండా బాగా చదువులు చెప్పించాడు.

నాకు ఇద్దరు కుమారులు. బాగా చదువుకున్నారు. పెళ్ళిళ్లు కూడా అయినాయి. వారికీ పిల్లలు. మా పెద్దబ్బాయి నేను నెలకొల్పిన రత్నం హైస్కూల్‌ను నడుపుతున్నాడు. చిన్నాబ్బాయి ఏపీ ట్రాన్స్‌కోలో డివిజనల్ ఇంజనీర్‌గా ఉద్యోగిస్తూ ఉండేవాడు. పోయిన సంవత్సరం వచ్చిన కరోనా వేవ్‌లో అకాల మరణం పొందాడు.

**15. మీ విద్యాభ్యాసం గురించి....**

నా ప్రాథమిక విద్య మా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోనె జరిగింది. తర్వాత సైదాపురంలోని హైస్కూల్లో ఉన్నత విద్య S.S.L.C. పూర్తి చేశాను. కళాశాల విద్య కోసమై నెల్లూరు వి.ఆర్. కాలేజీలో చేరి బియ్యే (స్పెషల్) తెలుగు మెయిన్‌తో పూర్తి చేశాను. (1961) నేను బియ్యే చదివే రోజుల్లోనె 1960లో వివాహమయింది. బియ్యే పూర్తికాగానే మైకా వ్యాపారంలో చేరాను. అనుభవం లేని ఆ వ్యాపారంలో చేతులు కాల్చుకొని అనతికాలంలోనే ఇంటిపట్టు చేరాను. అప్పటికే మాకు ఇద్దరు కుమారులు కలిగారు. ఆ రోజుల్లో బియ్యే అంటె పెద్ద గౌరవం. ఆ రోజుల్లో మా నాన్నగారు కిరాణా వ్యాపారం చేస్తూ ఆర్థికంగా స్థిరపడి ఉన్నాడు. ఇంటి పట్టు చేరి ఊరకుండడం ఇబ్బందికరంగా అనిపించింది. ఉద్యోగాన్వేషణలో పడ్డాను. వరంగల్ ఆజాంజాహి మిల్లులో రైటర్‌గా ఉద్యోగానికి ఇంటర్వ్యూ (1964) తర్వాత 1965లో మిల్లులో రైటర్‌గా ఉద్యోగం. ఉద్యోగం చేస్తూ వరంగల్ పి.జి. సెంటర్‌లో ఎం.ఏ. పూర్తి చేశాను. ఆ తర్వాత 1970లో సి.కె.యం. కళాశాలలో అధ్యాపకుడిగా, తర్వాత ఉస్మానియా నుండి ఎం.లిట్., కాకతీయ యూనివర్సిటీ నుండి పిహెచ్.డి. పట్టాలు పొందడం జరిగింది.

**16. మీకు బిరుదురాజు రామరాజు గారితో మంచి అనుబంధం ఉందంటారు. దాన్ని గురించి తెలియజేస్తారా?**

రామరాజు గారు నాకు గురువులే గాక పితృతుల్యులు కూడా. ఆయన కూడా వరంగల్ పి.జి. సెంటర్ తొలిబ్యాచ్ విద్యార్థులమయిన మమ్ములను పుత్ర సమానులుగానె ఆదరించేవాడు. మరీ ముఖ్యంగా నేనన్నా, వనం మధుసూదన్ అన్నా ప్రత్యేకమయిన అభిమానం కనబరచేవాడు. మేము కూడా వారి కుటుంబ సభ్యులుగానే వారింట్లో మెదిలే వాళ్ళం. తొలి బాచ్ 10మంది విద్యార్థుల్లో ఎవరికి ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తూ మా విద్యాభ్యాసానికి ఏ అవరోధాలు కలగకుండా చూచేవాడు. నా వరకు నాకు ఎం.ఎ. ఫైనలియ్యర్‌లో ఉండగా నా చదువు ఆగిపోయేటంత సమస్యలు రెండు ఎదురైనాయి. నేను ఆజాంజాహి మిల్లులో రాత్రి షిఫ్టులో పనిచేస్తూ పగలు కాలేజీకి వచ్చే వాడను. దానికనుకూలంగా డిపార్టుమెంటు వారే నాకు షిఫ్టులు ఏర్పాటు చేస్తుండేవాళ్లు. చివరి రోజుల్లో కొంత మంది గిట్టనివాళ్ళు నేను కూడా మూడు షిఫ్టుల్లో పనిచేయ వలసిందేనని పేచీ పెట్టారు. అదే జరిగితే పగలు నేను కాలేజీకి రావడం జరగదు. ఆ కారణంగా నా చదువు ఆగిపోయేది. ఆ సమయంలో రామరాజు గారు కల్పించుకొని మిల్లు మేనేజరుతో మాట్లాడి, నేను మూడో షిఫ్టులో మాత్రమే పనిచేసేటట్లు ఏర్పాటు చేశాడు. అదేవిధంగా కాలేజీలో

అవరోధాలు సంభవించాయి. ఉద్యోగం చేస్తూనే రెగ్యులర్ విద్యార్థిగా కళాశాలలో చదివేందుకు వీలులేదనే అవరోధం కల్పించారు. అప్పుడు కూడా రామరాజు గారే అప్పటి ప్రిన్సిపాలు వెంకట్రామయ్య గారికి నా విషయమంతా చెప్పి, ఒప్పించి, నా చదువు సజావుగా సాగేందుకు వీలు కల్పించాడు. ఆ విధంగా మాది గురుశిష్య సంబంధమే కాకుండా అంతకు మించిన ఆప్యాయతానుబంధం.

**17. మీ ఉద్యోగ జీవితం గురించి....**

ఆజాంజాహి మిల్లులో రైటర్ ఉద్యోగిస్తున్న సమయంలోనె 1970 మార్చి 24న వరంగల్ సి.కె.యం. కళాశాలలో అధ్యాపకుడిగా చేరాను. మొదట లెక్చరరుగా చేరిన నేను 1984లో తెలుగు శాఖాధ్యక్షులుగా పదవిని చేపట్టాను. 1990లో రీడర్‌గా ప్రమోట్ అయ్యాను. అదే సంవత్సరం మా కళాశాలలో పి.జి.కోర్సులు ప్రారంభించ బడినాయి. 1990 నుండి 1995లో రిటైర్ అయ్యేంత వరకు పి.జి. సెంటర్ కోఆర్డినేటర్‌గా, తెలుగు శాఖాధ్యక్షులుగా విధులు నిర్వర్తించాను. ఈ మధ్య కాలంలో టైంటేబుల్ కమిటి కోఆర్డినేటర్‌గా కొంత కాలం, సాంస్కృతిక వ్యవహారాల కమిటి కార్యదర్శిగా కొంతకాలం వ్యవహరించాను. 1990-95 మధ్య కాలంలో కాకతీయ యూనివర్సిటీ పి.జి. & డిగ్రీ పాఠ్య ప్రణాళికా సభ్యులుగా విధులు నిర్వర్తించాను. 1992-95 సంవత్సరాల్లో హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయం విజ్ఞాన సర్వస్వ కేంద్రంలో పాఠ్య ప్రణాళికా సభ్యులుగా ఉన్నాను. 1992 నుండి 2000వరకు కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో పరిశోధనా పర్యవేక్షకుడుగా పనిచేశాను. నా పర్యవేక్షణలో 10 పిహెచ్.డిలు, 3 ఎం.ఫిల్ అవార్డయినాయి. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత తెలుగు విశ్వవిద్యాలయం, జానపద గిరిజన విజ్ఞాన పీఠం వరంగల్లో రీసర్చ్ ఫెలోగా రెండు సంవత్సరాలు (2009-2011) ఉద్యోగించాను.

**18. మీరు నెలకొల్పిన సంస్థలను గురించి, చేపట్టిన పదవులను గురించి వివరించండి?**

1995లో ఉద్యోగ విరమణ పొందిన తర్వాత 1996లో వరంగల్ లోని మామునూరులో రత్నం ఎడ్యుకేషనల్ సొసైటీ అనే విద్యా సంస్థను స్థాపించి, దానికి ప్రధాన కార్యదర్శి పదవిని చేపట్టి, అనుబంధంగా ఒక హైస్కూలును నడపడం జరిగింది.

2000లో రంగశాయిపేటలో నెలకొల్పిన డా॥ రత్నం ఎడ్యుకేషణల్ అకాడమీలో అధ్యక్షులుగా ఉంటూ అనుబంధంగా రత్నం హైస్కూలును నడపడం జరిగింది. అది రెండు దశాబ్దాలుగా నేటికీ నడుస్తున్నది.

1989లో మేముంటున్న దయానందకాలనీలో నిర్మాణమౌతున్న శ్రీరత్న గర్భగణపతి ఆలయ నిర్మాణ కమిటీకి కార్యదర్శిగా ఎన్నుకోబడినాను. ఆలయం నిర్మాణం 1990 కల్లా పూర్తి చేయబడి విగ్రహ ప్రతిష్ఠాపన జరిగింది. ప్రస్తుతం ఆ ఆలయ కమిటీలో గౌరవాధ్యక్షులుగా కొనసాగుతున్నాను.

2009లో డా॥ గుంజి వెంకటరత్నం చారిటబుల్ ట్రస్టు అనే ధార్మిక సంస్థను నెలకొల్పి మా గ్రామంలో నున్న మూడు ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు పది సంవత్సరాల పాటు (2009 నుంచి 2019) నోటు పుస్తకాలు, స్టడీ మెటీరియల్స్ అందించడం జరిగింది. ఇంకా ఆ సంస్థ తరఫున నేటికీ ఇంజనీరింగ్ మొదలయిన కోర్సులు చదువుతున్న పేద విద్యార్థులకు కొంత ఆర్థిక సహాయం అందించడం జరుగుచున్నది.

**19. బి.యన్. శాస్త్రి గారితో మీకున్న అనుబంధం గురించి చెప్పండి.**

శాస్త్రిగారితో నాకు దాదాపు 20 సంవత్సరాల అనుబంధం ఉన్నది. నేను వరంగల్ జిల్లా విజ్ఞాన సర్వస్వాన్ని నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకొనింది మొదలు హైదరాబాదు పోయినప్పుడల్లా ఆయన ఇంటికి పోయి కలిసి ఆయన సలహాలు తీసుకుంటూ ఉండేవాడను. సాహిత్యపరమైన మా సంభాషణ గంటల కొలది జరుగుతుండేది. ఈ లోపల శాస్త్రిగారు నాకు టిఫిన్లు, టీలు ఇచ్చి, నా సందేహాలన్నిటికి ఓపిగ్గా సమాధానాలు చెప్పేవాడు. నేను విద్యా సంస్థలు స్థాపించి, ఆ పనుల ఒత్తిడిలో వరంగల్ జిల్లా విజ్ఞాన సర్వస్వ రచన ఆగిపోయిన సందర్భంలో శాస్త్రిగారిని కలిసి, నా అశక్తతను శాస్త్రిగారికి చెప్పి, ఇన్ని మండల సర్వస్వాలను నిర్మించిన మీరే వరంగల్ మండల సర్వస్వాన్ని కూడా నిర్మించండి సార్ అని కోరినప్పుడు ఆయన నా భుజం తట్టి రత్నం అక్షర క్రమంలో నీవు తలపెట్టిన వరంగల్ జిల్లా విజ్ఞానసర్వస్వ రచనా ప్రణాళిక ప్రశస్తమైనది. ఇప్పటి వరకు అక్షర క్రమంలో మండల సర్వస్వాలు వెలువడిన దాఖలాలు లేవు. వరంగల్ జిల్లా విజ్ఞాన సర్వస్వం మండల సర్వస్వాల్లో కొత్త ఒరవడిని నెలకొల్పుతుంది అని నన్ను ప్రోత్సహించడమే గాక, ఆయన వరంగల్ మండల సర్వస్వాన్ని నిర్మించదలచి సేకరించిన సమాచారంతో కూడిన దాదాపు 200 పేజీల నోట్సు నాకిచ్చి వరంగల్ జిల్లా విజ్ఞాన సర్వస్వాన్ని పూర్తి చేయించడంలో నాకన్నివిధాల సహాయ సహకారాలందించిన సౌజన్యమూర్తి శాస్త్రి గారు. మా 20 ఏళ్ళ అనుబంధం స్వచ్ఛమయిన సాహితీ సంబంధం.

**20. ఈ ఆధునిక సమాజంలో విజ్ఞాన సర్వస్వాల అవసరం ఎంత మేరకు ఉంటుందంటారు?**

విజ్ఞానం సమాజ ప్రగతికి మూలం. విజ్ఞాన ప్రసారంలో ముఖ్య సాధనాలయిన విజ్ఞాన సర్వస్వాలు ఆధునిక సమాజమయినా, ప్రాచీన సమాజమయినా, రాబోయే అత్యాధునిక సమాజానికయినా వాటి అవసరం ఉంటుంది.

విజ్ఞానం శాఖోపశాఖలుగా విస్తరిల్లి ఒక జీవ నదిలా తరతరాలుగా ప్రవహిస్తూనే ఉన్నది. ఇకముందు కూడా ప్రవహిస్తూనే ఉంటుంది. అతి ప్రాచీన సమాజాల్లో మౌఖిక రూపంలో ప్రసారమౌతున్న విజ్ఞాన ప్రసారం, భాషా సాహిత్యాలు పురుడు పోసుకున్న దశలో అది అక్షర రూపం దాల్చి ప్రసారం కాసాగింది. ముద్రణ సౌకర్యాలు అందుబాటు లోనికి వచ్చిన మధ్య యుగాల్లో అది గ్రంథ రూపం దాల్చింది. ఆధునిక సమాజంలో అది ఒక సాహిత్య ప్రక్రియగా పరిణతి చెంది విజ్ఞాన ప్రసారంలో ప్రముఖ సాధనంగా ఉంటున్నది. అయితే సాఫ్టవేర్ టెక్నాలజీ అందుబాటులోనికి రావడంతో పాఠకునికి అసరమైన అంశానికి సంబంధించిన సమాచారం కంప్యూటర్లు, లాపుటాపులు స్మార్ట్‌ఫోన్లలో లభ్యమౌతున్నది. ఈ నేపథ్యంలోనే పైప్రశ్న ఉత్పన్న మౌతున్నది. అయితే గ్రంథ రూపంలో అనేక పద్ధతుల్లో వెలువడుతున్న విజ్ఞాన సర్వస్వాలకు ఒక అసిత్త్వమంటూ ఉంటుంది. అంతేగాదు గ్రంథరూపంలో ఉండే విజ్ఞాన సర్వస్వాలు అందించినంత విస్తృత సమాచారాన్ని, విషయ విశ్లేషణను కంప్యూటరైజ్డ్ విజ్ఞాన సర్వస్వాలు అందించలేవు. ఈ కారణంగానే విశ్వ విఖ్యాతమైన Encyclopeadia Britannica లాంటి విజ్ఞాన సర్వస్వ నిర్మాణ సంస్థలు ఎప్పటికప్పుడు వాడుకలోనికి వస్తున్న సమాచారాన్నంతటిని సేకరించి బ్రిటానికా విజ్ఞాన సర్వస్వ సంపుటాలకు అనుబంధంగా Year Books ప్రచురిస్తున్నాయి. కాబట్టి విజ్ఞాన ప్రసారంలో ప్రముఖ సాధనాలైన విజ్ఞాన సర్వస్వాలు ఏ రూపంలో ఉన్నా, ఏ సమాజానికైనా వాటి అవసరం ఎంతయినా ఉంటుందనే చెప్పవచ్చును.

**21. మీ రచనలు, మీరు పొందిన అవార్డులు, రివార్డులను గూర్చి, ఇంకేమయినా విశేషాంశాలు ఉంటే చెప్పండి.**

**ముద్రిత రచనలు :**

**విమర్శ గ్రంథాలు :** 1. హంసవింశతి – కావ్య స్వరూపం – విజ్ఞాన సర్వస్వ లక్షణాలు (1989) 2. Circle of Learning - AStudy in Telugu Encyclopeadia Making (1994) 3.విజ్ఞాన సర్వస్వాలు – విశ్లేషణాత్మక అధ్యయనము (1995) 4.రత్నమాలిక (పూర్వ విద్యార్థులు ప్రచురించిన అభినందన గ్రంథం) (1996) 5. తెలుగులో విజ్ఞాన సర్వస్వాలు (తెలుగు అకాడమి, హైదరాబాద్ ప్రచురణ) (2012) 6. విజ్ఞాన సర్వస్వాలు – వాటి నిర్మాణము (తెలుగు అకాడమి, హైదరాబాద్ ప్రచురణ) (2014) 7. Encyclopedia and Its Making. (2015) 8. మహాభారతంలో... "ఇవి మీకు తెలుసా?" (ఎమెస్కో ప్రచురణ–2019) 9. నా అమెరికా యానం (ఎమెస్కో ప్రచురణ – 2020) 10. వ్యాస రత్న ప్రభావళి (ఎమెస్కో ప్రచురణ – 2021)

**విజ్ఞాన సర్వస్వాలు:** 11. హంసవింశతి – విజ్ఞాన సరస్వము (రెండు సంపుటాలు) (1989, 1995) 12. వరంగల్ జిల్లా విజ్ఞాన సర్వస్వము (2008) 13. ప్రాచీన సమాజ విజ్ఞాన సర్వస్వము (తెలుగు అకాడమీ, హైదరాబాద్ ప్రచురణ) (2014) 14. మహాభారతం – విజ్ఞాన సర్వస్వము (మూడు సంపుటాలు) (యమెస్కో ప్రచురణ) (2019)

**అనువాద గ్రంథాలు:** 1. ధన్యజీవి (నాటిక) Bishop and Candle Sticks అనే ఆంగ్ల నాటికకు స్వేచ్ఛానువాదం 2. శ్రీమద్భగవద్గీత – సంస్కృతము నుండి తెలుగు అనువాదము తాత్పర్య సహితము.

**సంపాదకత్వం:** 1. తెలుగు నాటక రంగం – రచన – ప్రయోగం (సి.కె.యం. కళాశాల ప్రచురణ) (1989) 2. పేర్వారం ఇంటర్వ్యూలు (1997) 3. ప్రసన్న శారద

**వీటితో పాటు ముద్రణలో ఉన్న గ్రంథాలు ఐదు.** అముద్రిత గ్రంథాలు ఆరు.

**అవార్డులు:** 1. "FUWAI" award by United Writers Association of India, Chennai. 20-9-1995.

2. "విజ్ఞాన సరస్వ నిధి" By కళా దీప్తి A Literal and Cultural Association, Warangal. 5-1-1996.

3. 'సరస్వతీ పుత్రుడు, సాహితీ కార్మికుడు', రసమయి ఆర్ట్స్ క్రియేషన్స్, హనుమకొండ.

ఇంకా సాహిత్య సభల్లో జరిగిన అనేక సన్మానాలు.

**ఇష్టమైన పనులు :** నిరంతర సాహిత్యాధ్యయనం, రచనా వ్యాసంగము, ఆధ్యాత్మిక, ధార్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు.

**ఇంటర్వ్యూ......... డా. అట్టెం దత్తయ్య**

**ఫోన్ : 9494715445**







**శ్రీసూక్తము – పద్యానువాదము**

– శ్రీమతి కటకం విజయలక్ష్మి

వెల : అమూల్యం

**ప్రతులకు :** రచయిత్రి, కమలా శంకర నిలయం, ఇం.నెం. 2–390/హెచ్, హెచ్ఎంటి నగర్, మియాపూర్, హైదరాబాద్ – 500 049.

ఫోన్ : 94911 88809



## సాధన పంచకమ్

**క్షుద్వ్యాధిశ్చ చికిత్స్యతాం ప్రతిదినం భిక్షౌషధం భుజ్యతాం**
**స్వాద్వన్నం న తు యాచ్యతాం విధివశాత్ ప్రాప్తేన సంతుష్యతామ్**
**శీతోష్ణాది విషహ్యతాం నతు వృథావ్యాం సముచ్చార్యతాం**
**ఔదాసీన్య మభీప్స్యతాం జన కృపా నైష్ఠుర్య ముత్సృజ్యతామ్॥**

**తాత్పర్యం :** 1. ఆకలి రోగమును నయం చేసికొనవలెను. 2. ప్రతిదినము భిక్షాన్నమును ఔషధముగా భుజింపవలెను. 3. రుచికరమైన ఆహారమును కోరకుండా ఉండవలెను. 4. విధివశాత్తుగా లభించిన దానితో తృప్తి చెందవలెను. 5. శీతోష్ణాదుల వంటి ద్వంద్వములను సహించవలెను. 6. వ్యర్థమైన మాటలను మాట్లాడకుండా ఉండవలెను. 7. ఉదాసీనమును ఇష్టపడవలెను. 8. జనుల యొక్క కృపను కోపగించుటను (నిష్ఠురత్వమును) విడిచి పెట్టవలనెను.

**వివరణ**

**1. క్షుద్వ్యాధిశ్చ చికిత్స్యతామ్ –**


"యుక్తాహార విహారస్య యుక్త చేష్టస్య కర్మసు
యుక్త స్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా"


అనగా మితమైన ఆహారమును, హితమైన విహారమును, తగినంత నిద్ర, మెలకువలు కలిగి, చేయవలసిన కర్మలను చక్కగా చేసేవారికి దుఃఖమే ఉండదు. ఇదియే దుఃఖాన్ని దూరం చేసే యోగమని గీతామాత ఉపదేశము. మరొక్క మాట – తింటే ఒంటికి బలం. వింటే బుద్ధికి బలం. పశువుకేమో తిన్నది బలం, మనిషికేమో విన్నది బలం. కావున ఎవరికి వారే తాము ఎంత తింటే మంచిదో ఎవరికి వారుగా నిర్ణయించుకొని ఆకలి రోగాన్ని నయం చేసుకో మంటుంది సాధన పంచకం. నిజమే, మరి ఔషధమేది? అంటే తరువాత వాక్యం చదువుమంటుంది.

**2. ప్రతిదినం భిక్షౌషధం భుజ్యతామ్ –**

ప్రతినిత్యము భిక్ష అనెడు ఔషధమును సేవించవలెను. వ్యాధి గలవారికి ఔషధం కావాలిగదా! ఆకలిని వ్యాధిగా పేర్కొన్నారు. కనుక ఆకలికి ఔషధం ఏమిటి? అంటే భిక్ష అంటున్నారు శంకరులు. సన్న్యాసులకు, సాధువులకు పెట్టేది భిక్ష అంటారు. అయితే అందరం భోజనం చేసేది భగవంతుడు పెట్టే భిక్షనే. కనుక భగవంతుడు పెట్టిన భిక్షను, ఆయనకు నివేదించడం వలన అది ప్రసాదంగా మారుతుంది. అట్టి నైవేద్యాన్ని ప్రసాద బుద్ధితో స్వీకరించడం వలన అది భిక్షగా మారుతుంది. ఆ భిక్షయే ఔషధంగా మారుతుంది. తద్వారా ఆకలిరోగం నయమవుతుంది అని అంటున్నారు శ్రీ శంకరాచార్యులు. (సశేషం)

## సత్సంగం





### భావ రహితం – నిద్ర

నిద్రపోతే, ఆ స్థితిలో ఏమీ చేయలేవు. కాని మేల్కొని ఉండగానే ఏ భావమూ లేకుండేట్టు ప్రయత్నించు. నిద్ర గురించి ఆలోచించట మెందుకు? అది కూడ ఒక భావమే కదా? మేల్కొని ఉండగా ఏ భావమూ లేకుండా ఉండగలిగితే చాలు. నీకు నిద్రవస్తే, అంతకు పూర్వమున్న స్థితే మేల్కొనగానే కొనసాగుతుంది. నిద్రపోయే ముందు ఎక్కడ విడిచి పెట్టావో అక్కడనుంచే మళ్ళీ అందుకుంటుంది. ఏదో ఒక వ్యాపకం గురించి ఆలోచనలుంటే, నిద్ర కూడా ఉంటుంది. నిద్రా, ఆలోచనా రెంటికీ పరస్పర సంబంధముంది. మనం అతిగా నిద్రపోకూడదు, అసలు నిద్రే లేకుండానూ ఉండకూడదు. మితంగా నిద్రపోవాలి. అతిగా లేకుండా చేసుకోవాలంటే ఏ ఆలోచనలు గాని, చలనం గాని లేకుండా, మితంగా సాత్త్వికమైన ఆహారం తీసుకోవాలి. భౌతికమైన పనిని కూడా ఎక్కువ చేయకూడదు. ఆలోచనలనీ, ఆహారాన్నీ, వ్యాపకాలనీ నిగ్రహించిన కొద్దీ నిద్రని కూడ నిగ్రహించవచ్చు. కాని, గీతలో చెప్పినట్టు సాధకునికి అన్నిటిలోనూ "మితం" అవసరం. సాధకులందరికీ మొదటి అవరోధం, నిద్ర. రెండవది, విక్షేపం – అంటే ప్రపంచంలోని విషయాలు – ఏకాగ్రతని చెడగొట్టేవి. మూడవది కషయ – గడచిపోయిన విషయానుభూతులకి సంబంధించిన ఆలోచనలు. నాల్గవది, ఆనందం. దీనిని కూడా అవరోధమనే అంటారు. ఎందుచేతనంటే, ఆ స్థితిలో ఆనందానికి మూలస్థానం నుండి ఎడబాటు కలిగి, "నేనిప్పుడు ఆనందంగా ఉన్నాను" అనే భావం కలగటం చేత, దీనిని కూడా అతిక్రమించాలి. ఆఖరి దశ అయిన సమాధిని చేరాలి. ఇందులో, మనిషి ఆనందంతో, లేక సత్యంతో ఏకమైపోతాడు. ఈ స్థితిలో ఆనందించేవాడూ, ఆనందమూ అనే ద్వయీ భావం పోతుంది. సత్–చిత్–ఆనందం, లేక ఆత్మ, అనే మహాసముద్రంలో.

ధ్యానంలో ఆఖరి అవరోధం సంతోషాతిరేకం. ఎంతో ఆనందం కలుగుతున్నప్పుడు ఆ స్థితిలోనే ఉండాలనిపిస్తుంది. దానికి వశంకాక, ఆ తరువాతి స్థితి అయిన ప్రశాంతతకి వెళ్ళు. దానికి వశం కాక, ఆ తరువాతి స్థితి అయిన ప్రశాంతతకి వెళ్ళు.



# భారతీయీకరణ – 7

## ఆంగ్ల మూలం : బలరాజ్ మధోక్, అనువాదం : కోవెల సంపత్కుమార

బలరాజ్ మధోక్ దేశశాంతి సమైక్యతలను పరిరక్షించడానికి భారతీయ ప్రజల ఆలోచనలను భారతీయీకరించవలసిన అవసరాన్ని చెబుతూ ఇంగ్లీష్ లో వ్రాసిన Indianness కు అనువాదం ఈ భారతీయీకరణ. భారతీయీకరణ అంటే అన్ని రకాల దీపాసనా మార్గాలను స్థలాలను సమానంగా గౌరవించడం. ఒక వ్యక్తి తాను ఏ కుల, మత, భాషావర్గాలకు చెందినవాడైన వాటి ప్రయోజనాలన్నిటి కన్నా దేశ ప్రయోజనానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం ప్రధానమన్న అభిప్రాయాలు బలరాజ్ మధోక్ ఆలోచనల్లో కనిపిస్తాయి.

రాజకీయ వ్యవస్థలో జాతీయ భావన స్వరూపాన్ని, భారతీయీకరణ విషయంలో జరుగుతున్న చర్చలు, వ్రాసిన వ్యాసాలు, లేఖలు వాదోపవాదాలు ఈ గ్రంథ రచనకు బలరాజ్ మధోక్‌ను ప్రేరేపించాయి. భారతీయీకరణను గురించి ఒక జాతీయ భావన గల మేధావి ఆలోచనల ప్రతిబింబం భారతీయీకరణ. 1970లో వచ్చిన ఈ రచనను సంపత్కుమార తర్వాత కాలంలో సుమారు 80లకు ముందే అనువదించిందంటారు.

భారతదేశం భౌగోళిక స్వరూపం, జాతీయత – భారతీయత మధ్య గల తేడా, భారతీయీకరణ అంటే ఏమిటి? ఎందుకు? దానివల్ల ప్రయోజనమేమిటి? అది జరగవలసిన తీరు ఏమిటి? అన్న విషయాలను యథామూలంగా సంపత్కుమార అందించారు. అనువాదకుడిగానూ జాతీయభావనా చైతన్యం, దేశీయ ఆలోచనా విధానం వ్యక్తమయ్యే రచనను ఎన్నుకోవడం ఆయన దేశీయ నిబద్ధతను చెబుతుంది.

ఇది ఇస్లాం మీద భారతీయ ప్రభావానికి ఒక ప్రత్యేకమయిన ఉదాహరణ. తుర్క అన్న మాటను, ఈ దేశీయుల నుండి ముస్లింలను విడిగా చూపడానికి జాయాసీ ఉపయోగించినాడన్న అంశం ఇక్కడ గుర్తించవలసి ఉన్నది. ఈ మాట ఈ అర్థంలోనే మధ్యయుగాల సాహిత్యంలో అంతటా ఉపయోగించబడింది. ముస్లింలను తురకలనీ, తురకదాసులనీ భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో ఇప్పటికీ వ్యవహరించడం జరుగుతున్నది. ఈ అంశం ఇస్లాం యొక్క విదేశీయ మూలకత్వాన్ని సూచిస్తుంది. భారతదేశంలో మతం మార్చుకున్నవారు కూడా ఎందుకట్లా చూడబడినారో కూడా తెలియజేస్తుంది.

ఈ విధంగా ఒకవైపు తెలియరాకుండానే ఇస్లాం యొక్క భారతీయీకరణ విధానం సాగుతూ ఉండగా, మరొకవైపు ఇస్లాం యొక్క ప్రామాణికతకు, నిబద్ధతకూ తామే సంరక్షకులమనుకునే ముల్లా వర్గాలవారు ముస్లిం సుల్తానుల బలంతో భారతదేశంలో అంతటా ఇస్లాంను వ్యాపింపజేయడానికీ, ఈ దేశం నుంచి విగ్రహారాధనను పేకలించి వేయడానికీ ఒత్తిడులు సాగిస్తూనే ఉన్నారు. ఈ వత్తిడిలు పెరిగినాకొద్దీ, ముస్లిం పాలకుల అధికారంలోకి క్రమక్రమంగా భారత భూభాగం వెళ్తున్నకొద్దీ, హిందూ సమాజాన్ని ఇస్లాం కబళించకుండా రక్షించుకునేందుకు, ఇస్లాంకు సంబంధించిన ప్రతి అంశాన్ని తప్పించుకొనడమనే రక్షాకవచాన్ని భారతీయ సామాజిక నాయకులు గ్రహించినారు. భారతీయీకరణకు వ్యతిరేకదిశగా సాగే ఈ పద్ధతి ఇట్లా ప్రారంభమయింది. ఈ పద్ధతివల్ల ఇస్లాంపట్ల, దాన్ని అనుసరించే దేశీయ విదేశీయుల పట్ల హిందువులలో “అంటకు ముట్టకు” మన్న ప్రవృత్తి ఉత్పన్నమయింది. అయితే, ఈ రక్షాకవచం, ముస్లింల ప్రాబల్యం ఉన్నంతకాలం దాని ప్రయోజనాన్ని అది చక్కగా నెరవేర్చింది.

ఉద్యమకాలంలో ఒక ఎత్తుగడగా మొదలయి చివరకొక గాఢ విశ్వాసంగా మారిన గాంధీ గారి అహింసా సిద్ధాంతం మాదిరిగానే, విదేశీయ ముస్లిం పాలకులు కల్పించిన రాజకీయ, ఆర్థిక, సైనికమయిన ఒత్తిడులకు తట్టుకొనలేని సందర్భంలో ఒక ఎత్తుగడగా హిందూసమాజం స్వీకరించిన ఈ రక్షాకవచం చివరికొక మూఢవిశ్వాసంగా పరిణమించింది. ఆ కారణంగా సమాజం వికసించడానికి బదులు క్షయోణ్ముఖమయి ముడుచుకు పోవడం మొదలయింది. తనలో ఇతరులను విలీనం చేసుకోగల, ఇతరులతో తాను అమరిపోగల తన అద్భుత ప్రతిభను కోల్పోయింది. దీని ఫలితంగా, ఇస్లాం తన రాజకీయాధికారాన్ని పోగొట్టుకున్న తరువాత

గూడ ఒత్తిడుల వల్ల మతం మారినవారు తిరిగి తమ పూర్వ విశ్వాసాలకూ, ఉపాసనా మార్గాలకూ రావడానికి ఉత్సాహంతో సిద్ధపడినప్పుడు గూడా, హిందూ సమాజం, వారి మొగం మీదనే ఫిడేలుమని తలుపులు మూసింది. ఇది, వారిని హిందూ సమాజ వ్యతిరేకులనుగా, మతోన్మత్త ముస్లింలనుగా తయారుచేసింది. బెంగాల్ రాజకుమారుడైన "కాలా పహాడ్" విషయం దీనికి ఒక చక్కని ఉదాహరణ. ఆ రాకుమారుడు ఒక ముస్లిం రాకుమారిని ప్రేమించి వివాహ మాడదలచుకున్నాడు. ఈ వివాహం జరగడానికి ఆ రాకుమారి ఇస్లాంను పరిత్యజించడానికి గూడా సిద్ధపడింది అయినా గూడా బ్రాహ్మణులు వారి వివాహానికి అంగీకరించలేదు. దీనితో ఆయన బ్రాహ్మణుల క్రియకు ప్రతిక్రియగా ముస్లిమయిపోయినాడు. తూర్పు బెంగాల్లో ముస్లింల సంఖ్య అధికం కావడానికి ఈయనే ప్రధాన కారణం.

కానీ, బ్రాహ్మణులీవిధంగా మూర్ఖపు పట్టుదలతో, ముస్లింలను, వారి పూర్వపు సమాజంలో పునర్విలీనం కావడానికి కాశ్మీర్‌లో నిరోధించినా గూడా భారతీయ ముస్లింలలో చాలామంది హిందూ జీవిత విధానాన్ని అనుసరిస్తూనే ఉన్నారు. అయితే, ఆంగ్లేయుల, "విభజించి పాలించు" విధానం, షావలీ ఉల్లా మరియు యు.పి అతని అనుయాయులు "Pan-Islami" ప్రయత్నాలు, గాంధీజీ ఖిలాఫత్ ఉద్యమంలో ప్రవేశించటం మొదలయిన కారణాల వల్ల వారు "ముస్లిం దేవ్ బంద్" చేతుల్లో పడిపోయినారు. ఈ విధంగానే ఆంగ్ల పాలకుల సూచనలతో, పోషణతో ఆలీఘుర్ ముస్లిం విశ్వవిద్యాలయం నుంచి దేశీయతారాహిత్యం గల ముస్లిం మేధావి వర్గం ఉత్పన్నమయింది.

అయితే, ఈ దోషమంతా కేవలం ఆంగ్లేయుల నెత్తినే రుద్దటం భావ్యం కాదు. ఈ వేర్పాటు ధోరణి బీజాలు అంతకు ముందు నుంచే భారత ముస్లింలలో ఉన్నాయి. కాబట్టే, ఆంగ్లేయులు వాటిని ఆసరాగా తీసుకొని ముస్లింలను భారత స్వాతంత్రోద్యమం నుంచి విడదీసి, వారి వేర్పాటుతత్వాన్ని పోషించి పెంపొందించినారు.

ముస్లిం లీగ్ ప్రతిపాదించిన ద్విజాతి సిద్ధాంతం ఆధారంగా 1947లో జరిగిన భారతదేశ విభజన, భారతదేశంలో ముస్లింలు ఇమిడిపోయే రీతికీ, సుదీర్ఘ చరిత్ర గల భారతీయీకరణ విధానానికీ చరమగీతం పాడింది. అంతేకాదు, ఆ విభజన భారతీయ చరిత్ర విధానాన్నే సంపూర్ణంగా తలక్రిందులు చేసింది. అయినా గూడా, ఈ విభజన, అనుకున్న విధంగా సమస్యలను పరిష్కరించలేదు. కాశ్మీర్‌లోని ముస్లింలందరూ కలిసి తమ పూర్వీకులు బలవంతంగా ఇస్లాం మతంలోకి మార్చబడినారు కాబట్టి, మళ్లీ తమ పూర్వపు సమాజంలో చేరడానికి అనుమతించవలసిందిగా మహారాజా రణబీర్‌సింగును కోరినారు. మహారాజా రణబీర్‌సింగ్ కూడా అంగీకరించినారు. అయితే, రాజు వారి కోరికను మన్నించితే తాము ఆత్మహత్య చేసుకుంటామని కొందరు కాశ్మీరీ బ్రాహ్మణులు మహారాజును బెదిరించినారు. ఈ బెదిరింపులకు లొంగి మహారాజు తన ప్రజల కోరికను త్రోసి పుచ్చినాడు. కాశ్మీరీ బ్రాహ్మణులు ఈ విధమైన మూర్ఖపు పట్టు ఆనాడు పట్టకుండా ఉండి ఉన్నట్లయితే, ఈనాడు కాశ్మీర్ సమస్య అంటూ ఉండేది కాదు.

35 మిలియన్ల ముస్లింలు విభక్త భారతదేశంలో మిగిలి ఉండిపోయినారు. ఉభయత్రా వదిలివేయబడి ఉన్న హిందూ – ముస్లిం జనాభాల మార్పిడి, దేశవిభజనకు మూలమైన ద్విజాతి సిద్ధాంతానికి కీ.శే. డా. బి.ఆర్. అంబేద్కర్ సూచించిన ఒక తార్కికమయిన ఉప సిద్ధాంతం. దీన్ని అనుసరించి ఉండినట్లయితే సమస్యలు ఎంతోహాయిగా పరిష్కారమయ్యేవి. కాని ఈ పరిష్కార మార్గం కాంగ్రెస్ నాయకులకు అంగీకారయోగ్యం కాలేదు. దీనికి రెండు కారణాలున్నాయి. మొదటిది, వారిలో చాలామంది ఆత్మవంచనా బాధితులు కావటం. ముస్లింలీగుకు పాకిస్తాన్ లభించింది కాబట్టి, ఆంగ్లేయులు దేశాన్ని వదిలి పెట్టి పోయినారు కాబట్టి ఇక ముస్లింలను రెచ్చగొట్టే శక్తులు ఉండవనీ అందువల్ల భారతదేశంలో మిగిలి ఉన్న ముస్లింలు పాకిస్తాన్‌ను మరిచిపోయి, గతాన్ని విస్మరించి భారత జాతీయ జీవన విధానంలో శాంతియుతంగా ఇమిడిపోతారని వారు భావించినారు. ఇక రెండవ కారణం, దేశ విభజన నేర్పిన పాఠాన్ని మరిచిపోయి, భారతదేశంలో మిగిలి ఉన్న ముస్లింల ఓట్లన్నీ కాంగ్రెస్ పార్టీకే మళ్ళగట్టుకోవచ్చుననుకొనడం. తాము భారతదేశాన్ని మోసం చేసి, భారత విభజనకు అంగీకరించిన కారణంగా, జాతీయ భావన గల చాలామంది భారతీయుల ఓట్లను కోల్పోతామని వారికి తెలుసు. అందువల్ల ఈ నష్టాన్ని పూడ్చుకొనడానికిగాను భారతదేశంలో ఆగిపోయిన ముస్లింలను అట్లాగే నిలిపి ఉంచుకొనడానికీ, వీరిని అనునయిస్తూనే ఉండేందుకు నిశ్చయించినారు.

కాంగ్రెసు నాయకత్వం యొక్క ఈ విధమైన నా ఆలోచన విధానం, దాని అనుసరణరీతి, అప్పటికి కొద్దినాళ్ల క్రిందనే– దేశ విభజనలో పతాకస్థాయి చేరుకొని ఉండిన మతతత్వ రాజకీయాలకు ఒక నూత్నారంభం కలిగించింది. కాంగ్రెసు నాయకత్వంలోని ఈ వర్గానికి గాంధీ మహాత్ముని నాథూరాం గాడ్సే హత్య చేయడం ఒక చక్కని అవకాశంగా పరిణమించింది. ఈ దురంతాన్ని తమ దృక్పథానికి సర్వత్రా అంగీకారాన్ని సంపాదించుకోవటం కోసం సంపూర్ణంగా ఉపయోగించుకున్నది. ఆనాటి ఆ దృక్పథమే ఈనాడు

లౌకిక విధానం పేరిట, గాంధీతత్త్వం పేరిట సాగుతున్న మిన్నంటే నినాదాలలో దాగి ఉన్నది. ఆనాడు ఘాతుకమయిన ఆ హత్య కారణంగా దేశమంతటా వ్యాపించిన ప్రతిచర్యా భావం, కాంగ్రెసు నాయకత్వం యొక్క ఈ నవీన మతతత్త్వాన్ని విమర్శించేవారు అణిగిపడి ఉండేటట్లుగా చేసింది. వారిలో చాలా మంది అప్పటికే జైళ్లలో కుక్కి వేయబడ్డారు.

దీనివల్ల కాంగ్రెసుకు ముస్లింల ఓట్లను సంపూర్ణంగా సంపాదించడం, ప్రతిపక్షాలను విభజించడం వంటి మంచి లాభాలు కొన్ని కలిగినయి. ఈ కారణంగానే రాష్ట్రాల్లోనూ, కేంద్రంలోనూ 1952, 1957, 1962లలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఆధిక్యాన్ని సంపాదించడానికి కాంగ్రెసుకు వీలు కలిగింది. నిజానికి ఈ ఎన్నికలన్నింటిలోనూ పడ్డ ఓట్లలో 44 శాతానికి మించి ఏనాడూ కాంగ్రెసుకు ఓట్లు రాలేదన్న అంశం ఈ సందర్భంలో ప్రధానంగా గమనించవలసి ఉన్నది. అంతేకాదు, ఈ 44శాతంలోనూ, 10 శాతం ఓట్లు ముస్లింలవే అయి ఉండేవని గూడా గమనించవలసి ఉన్నది.

ఉదాహరణ ప్రాయమయిన కాంగ్రెసు యొక్క ఈ నీతి మిగిలిన పక్షాలను, పార్టీలను ప్రధానంగా ఆ కాంగ్రెసు నుంచి చీలిపోయిన వాటిని అధికంగా ప్రభావితం చేసింది. ఈ స్థితి మతతత్త్వపు వేర్పాటు ధోరణికి ఒక క్రొత్త అవకాశాన్ని కలిగించింది. భారతదేశ రాజకీయాలలో కన్పించే ఈ క్రొత్త పోకడలను తెలుసుకోవడానికి ఇతర మత వర్గాలకు కూడా ఎక్కువ కాలం పట్టలేదు. ఈ కారణంగా దేశంలోని అన్ని ప్రాంతాలలోనూ మతతత్త్వపు వికృత స్వరూపం విద్రోహకరంగా తలెత్తడం ప్రారంభమయింది.

ఎన్నికల్లో మతవర్గాల ఓట్లను సంపాదించుకొనడంకోసం పెచ్చు పెరిగిన దురాశతో, మళ్లీ వెలుగులోకి వచ్చిన అనేక ప్రమాదకర సూచనలను పలు పక్షాలు నిర్లక్ష్యం చేయడం ప్రారంభించినయి. భారతదేశంలోని ముస్లింలకు మైత్రీ రూపంగా, తాత్త్వికంగా, మార్గదర్శకంగా పాకిస్తాన్ నిర్వహిస్తున్న పాత్ర ఈ సమస్యకు మరొక క్రొత్త రూపాన్ని కల్పించింది.

1962 చైనా, భారత సంఘర్షణ సందర్భంగా ఏర్పడ్డ చైనా, పాకిస్తాన్ సంబంధాలు భారత ముస్లిం రాజకీయాలలో ఒక క్రొత్త మలుపును తీసుకువచ్చినయి. ముస్లింలు తమ విధేయతను కాంగ్రెసు నుంచి కమ్యూనిస్టులకు మార్చుకున్నారు. 1965 పాక్-భారత యుద్ధం, ఆ సందర్భంలో కమ్యూనిస్టు రష్యా తాష్కెంట్‌లో నిర్వహించిన పాత్ర భారత ముస్లింల ఈ విధేయతల మార్పిడిని మరింత బలపరిచింది. కాశ్మీర్ సమస్యను గూర్చి రష్యా విధానంలో వచ్చిన మార్పు, అది పాకిస్తాన్‌కు అస్త్ర సహాయం చేయడం ద్వారా అటు కమ్యూనిస్టులకు, ఇటు ఇంకా పాకిస్తాన్ నుంచి మార్గదర్శకత్వానికి ఎదురుచూచే భారత ముస్లింలకూ స్పష్టమయిన సూచన లభించింది.

కమ్యూనిస్టులకూ పాక్ అనుకూల ముస్లింలకూ మధ్య ఏర్పడ్డ సంబంధం 1967లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలోనూ,1969లో జరిగిన మధ్యంతర ఎన్నికలలో స్పష్టంగా బయటపడింది. చైనా పాకిస్తాన్‌ల కూటమి, మరియు రష్యా – పాకిస్తాన్‌ల క్రొత్త సంబంధాలను నుంచి ఈ సంబంధం ఉత్పన్నమయింది. దీనికి సంబంధించి సమాచారం బాగా సేకరించిన భారతదేశీయంగా మంత్రిత్వశాఖలోని ఒక ఉన్నతోద్యోగి ఈ రచయితను 1968 సెప్టెంబరు మొదట్లోనే ఈ ముస్లిం కమ్యూనిస్టుల సంబంధం కేవలం కేరళ, పశ్చిమబెంగాలతో ఆగిపోతుందని కొనడం తప్పు అనీ, ఇది అఖిల భారత స్థాయిలో జరిగిన ఒప్పందమనీ, దీనికి మూలం అలీఘుర్ ముస్లిం విశ్వవిద్యాలయంలోని మేధావి వర్గమనీ హెచ్చరించినాడు. అయితే, ఈ సమాచారాన్ని ప్రభుత్వానికి ఎందుకందీయలేదు! అన్న ప్రశ్నకు ఆయన ఇచ్చిన సమాధానం చాలా ఆశా భంగకరంగా ఉన్నది. ఆయన సమాధానం ఇది : ఒక ప్రభుత్వోద్యోగిగా తాను చేయగలిగింది సమాచారాన్ని సేకరించి, తద్వారా తాను తీసుకొన్న నిర్ణయాలను ప్రభుత్వం ముందుంచడమే. ఇంతవరకే తన బాధ్యత, కానీ, ప్రభుత్వానికి తన పార్టీ ప్రయోజనాలు, తన అధికారాన్ని నిలబెట్టుకోవడమన్నదే అన్ని అంశాల్లో మార్గదర్శకమవుతున్నది. అందుకని వాస్తవాలనూ, వాటి పర్యవసానాన్ని గూర్చి, అది ఏ విధమయిన శ్రద్ధ కూడా చూపలేదు. ఆ కారణంగా, విదేశీయ శక్తుల ప్రోత్సాహాలతో, ఏర్పడ్డ ఈ దుష్టమయిన సంబంధం వల్ల దేశీయైక్యత విచ్ఛిన్నం కాకుండా ఉండేందుకు ఈ వాస్తవికతను సరిగా అర్థం చేసుకొని, తగిన ప్రయత్నాలు చేయడం జాతీయ ప్రజాస్వామిక పక్షాల వారి తప్పనిసరి బాధ్యత అని ఆయన తన సమాధానం ముగించినాడు.

ద్విజాతి సిద్ధాంతం ఆధారంగా దేశ విభజన జరిగిన, తర్వాత కాంగ్రెసు పాలకులు భారత రాజకీయ రంగంలో ప్రవేశపెట్టిన ఈ ప్రమాదకర మతతత్త్వ ధోరణి మిగిలిన మత, కుల వర్గాల వారికి కూడా సోకింది. వారికి కూడా తమ వర్గాల ఓట్ల శక్తి తెలియవచ్చింది. దానితో మతతత్త్వ రాజకీయాల తోటి ఆటలాడటం ప్రారంభించినారు. అస్సాం కొండ ప్రాంతంలో, నాగభూమిలో, బీహార్‌లోని జార్ఖండ్ ప్రాంతంలో, క్రైస్తవుల ఒత్తిడికి లోనైన, వర్గాలు ప్రవేశించడం, పంజాబ్ రాజకీయరంగంలో ఒక బలీయమయిన శక్తిగా అకాలీదళ్ పునఃప్రవేశం ప్రస్తుత స్థితిలో కొట్టవచ్చినట్లు కనిపించే ఉదాహరణలు.

1967, 1969 ఎన్నికలలో కలిగిన నష్టం నాందిగా కాంగ్రెసులో వచ్చిన చీలిక, దేశ రాజకీయ పరిస్థితులలో ఒకానొక అనిశ్చితత్వాన్ని కలిగించింది. తన అస్తిత్వాన్ని నిలుపుకోవడం కోసం అధికార కాంగ్రెసు పక్షానికి ఒక్కొక్క ఓటు అవసరమే అయింది. దీనికోసం మత కుల వర్గాలు– అవి ఎంత చిన్నవయినా సరే ఆ పక్షానికి ఎంతో విలువయినవిగా రూపొందినయి.

ఈ విధంగా దేశపు రాజకీయ వాతావరణాన్ని కలుషితం చేయడమే కాకుండా, 1947కు ముందు రోజులు గుర్తుకు వచ్చే విధంగా, ముస్లిం నాయకత్వంలోని ఒక వర్గపు మత దురహంకార ఉద్రేకాన్ని ఈ పక్షం పునరుద్ధరించింది. అధికార కాంగ్రెసుపక్షం మరియు కమ్యూనిస్టుల వల్ల లభించిన ప్రోత్సాహంతో పాకిస్తాన్ ఏజెంట్ల ప్రభావంలో పనిచేస్తున్న ముస్లింలీగ్, జమాయత్–ఇ–ఇస్లామీ, ఇత్తేహదుల్– ఉల్– ముస్లిమీన్– నాడు పాకిస్తాన్ కోసం జరిగిన పోరాటంలో ముందు నిలబడ్డ ఈ సంస్థలన్నీ పై వర్గపు మత దురహంకారానికి మరింతగా తోడ్పడ్డాయి. గత మూడు సంవత్సరాలుగా దేశంలో జరిగిన మతకలహాలకు మూలమయిన విధ్వంసకాండలు ముస్లింలలోని ఈ వర్గం వల్లనే ప్రారంభించబడినా యన్న అంశం భారత ప్రభుత్వ దేశీయాంగ మంత్రిత్వ శాఖ జరిపిన పరిశీలన వల్ల నిస్సందిగ్ధంగా ధ్రువపడింది. అయితే ఈ విధ్వంసన కాండలు, భుట్టో వంటి పాకిస్తాన్ నాయకులు ప్రతిపాదించినట్లు భారతదేశాన్ని మతతత్త్వ సిద్ధాంతాధారంగా, మళ్లీ విభజించవలెననే కోరికతో ముడిపడి ఉన్నయి. లండన్‌లోని భారత ముస్లిం అసోసియేషన్ వారు అక్కడి హైకమిషనర్‌కు సమర్పించిన విజ్ఞాపన పత్రం, అధిక జనాభా ప్రాతిపదిక మీద ముస్లిం జోన్స్, లేదా రాష్ట్రాలు రూపొందించవలెనని ముస్లిం పత్రికలు చేసిన సూచన. దేశంలో ఒక విచిత్రమయిన పరిస్థితిని కల్పించినయి. దీని గూర్చి భారత జాతీయవాదులు గాఢంగా ఆలోచించవలసిన ఆవశ్యకత ప్రస్తుతం ఏర్పడింది. ఈ పెరిగిపోతున్న మతతత్త్వాన్ని అరికట్టక పోయినట్లయితే, వేర్వేరు వర్గాలకు చెందినవారు, తమ వర్గ విధేయతకన్నా అతి ప్రధానమయిన దేశ విధేయతకు అత్యధిక ప్రాధాన్యమివ్వడం నేర్చుకొనకపోయినట్లయితే భారతదేశానికి భవిష్యత్తంటూ ఉండబోదు. అందుకని, ప్రస్తుత పరిస్థితుల్లో భారతీయాకరణ అత్యవసరం కావడానికి ఇది మరొక కారణం.

ఇంతకు ముందు చెప్పినట్లుగా రాజకీయ పక్షాలు, వాటికి చెందినవారు, దేశంలో వేర్పాటు ధోరణులను, విచ్ఛిన్నకర ధోరణులను పునరుద్ధరించడంలోనూ, వాటిని బలపరచడంలోనూ అందరికన్నా పెద్ద నేరస్థులు. ఈ దేశంలో వేర్వేరు భాషలు, కులాలు, మతాలు, వర్గాలు ఎంత వాస్తవమో, అనేక రాజకీయ పక్షాల ఉనికి గూడా అంతే వాస్తవం. ఈ దేశంలో ప్రజాస్వామిక పార్లమెంటరీ విధానం సరిగ్గా పనిచేయవలనంటే, కులాలను, వర్గాలను మనం వదులుకున్న గూడా, రాజకీయపక్షాలు మాత్రం ఉండవలసిందే. అయితే సమీకరించడం ద్వారా వీటిని తగ్గించవలసిన అవసరం మాత్రం ఉన్నది.

దురదృష్టవశాత్తు ఈ దేశంలో రాజకీయపక్షాలు గూడా క్రొత్త క్రొత్త కులాలుగా తయారయినయి. అవి కూడా సమాజాన్ని దోమకూడా చొర వీల్లేని గదులు గదులుగా విభజిస్తున్నయి. కుల, మత, వర్గాల వారి మాదిరిగానే తమ తమ సహాయకుల ఉద్రేకాలను రెచ్చగొడుతున్నాయి. జాతీయ ప్రయోజనాలను పక్ష ప్రయోజనాల కోసం బలి చేస్తున్నయి. ఈ విధంగా తయారయిన ఇవి క్రొత్తగా ఉదయించే పక్షాలకు ఆదర్శమ వుతున్నాయి. జాతీయ పక్షాలుగా చెప్పుకొనబడుతున్న పక్షాలు కూడా కుల మత ప్రాంతాలకు అధిక ప్రాధాన్యమిస్తున్న కారణంగా, ఈ క్రొత్త రాజకీయ పక్షాలు గూడా కుల మత ప్రాంతీయతత్వాలు ప్రాతిపదికగా రూపొందుతున్నాయి. ఇది సహజంగానే కలుగుతున్న ఫలితం. రాజకీయ పక్షాలలో, వాటి నాయకులలో, వారి ప్రవృత్తిలో జాతీయతా రాహిత్యం కారణంగా దేశీయ ప్రయోజనాలకన్నా వ్యక్తి, పక్ష ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యం కలగడం కూడా జాతీయైక్యతకు ఏర్పడ్డ మరొక ప్రమాదం. నేటికీ భారత జాతీయత యొక్క నిర్వచనం స్వరూపం విషయంలో భారత రాజకీయ పక్షాలు వాదులాడుతూ ఉండడమే, ఆ పక్షాలలో చాలా వాటిలో జాతీయతా రాహిత్యానికి స్పష్టమయిన ఉదాహరణ. జాతీయ జీవనంపై వాటి విభేదకతా ప్రభావ నిరోధావశ్యకత, భారతదేశం ఒక జాతిగా, దేశంగా తన అస్తిత్వాన్ని నిలుపుకునేందుకు భారతీయాకరణ తప్పనిసరి కావడానికి మరొక కారణం.

గాఢమయిన జాతీయ భావరాహిత్యం దినదినాభివృద్ధి పొందుతున్న కుల, మత, ప్రాంత, భాష, తత్త్వాలకు చెందిన విచ్ఛేదక శక్తులలో ప్రతిబింబించటం మాత్రమే కాదు, దేశ పాలన కారణంగా కలిగిన మానసిక దాస్యాన్ని తీవ్రతరం చేయడంలో కూడా తోడ్పడుతున్నది. ప్రధానంగా ప్రజల పేరిట ప్రభుత్వ యంత్రాంగంపై నియంత్రణ, అధికారం సాగించే మేధావి వర్గం, సమాజంలోని ఉన్నత తరగతుల వారి విషయంలో ఇది మరీ సత్యం. ఆధునికవాదం, ప్రగతివాదం, సామ్యవాదం, లౌకిక విధానవాదం మొదలయినవాటి పేరిట భారతీయమైన ప్రతి అంశం మేఘాచ్ఛాదితమవుతున్నది.

**(మిగతా వచ్చే సంచికలో ...)**

గ్రంథాంతరంగం 19

# వేమన సంపూర్ణ జీవిత చరిత్రము : బోధనలు

శ్రీ ఘట్టమరాజు, బెంగుళూరు, ఫోన్ : 9964082076

తెలుగు ప్రజల గుండెల్లో గూడు కట్టుకొని, నోళ్లలో నానుతూ ఎన్నెన్నో వేమన పద్యాలు తాటాకుల మీది కెక్కాయి. కరదు కాగితాల్లో చోటు చేసుకొన్నాయి. హృదయానికి హత్తుకొనే ఆ వేలాది వేమన పద్యాలకు సుభద్రత కలిగించిన ఆ మహానుభావులకు ఆ పావన చరితులకు శతకోటి వందనాలు అర్పించాలి కదా మనం? నిజమే మరి. మంచికాగితాలపై మెరుస్తూ, పామర పండితుల్ని మురిపిస్తూ, ఆలోచింపచేస్తూ, మొట్టమొదటిసారిగా 1829లో ముద్రింపబడిన 'వేమన పద్యములు' కు అక్షర రూపం కలిగించిన తెలుగు సాహిత్య భగీరథుడైన సి.పి. బ్రౌన్ సాహెబ్‌ను మరీమరీ తలుచుకోవాల్సిందే కదా!

అలాగే వేమన జీవితం గురించి, పద్యాల భావ, వస్తు, రచనల విశిష్టతను గురించి విమర్శనాత్మక గ్రంథాల్ని వెలువరించిన పండితాగ్రణుల్ని స్మరించుకోవడం మన కర్తవ్యం కదా? కాని వందేళ్ల కిందట వేమన జీవితం– కవిత్వం గురించి ప్రశస్తమైన పుస్తకాన్ని రాసిన మహాపండితుడైన వంగూరి సుబ్బారావును జ్ఞప్తికి తెచ్చుకోవడం పునీత కార్యమే కదా!



వంగూరి సుబ్బారావు (1886–1923) **'వేమన సంపూర్ణ జీవిత చరిత్రము : బోధనలు'** అనే పుస్తకాన్ని 1922లో రాశారు. ఈ గ్రంథం పిఠాపురంలోని ఆంధ్ర పరిశోధక మహామండలి ద్వారా వెలుగు చూసింది. ముద్రాపకులు సి.మునిసామి మొదలియార్ అండ్ సన్స్. శివకామి విలాస్ (ప్రెస్. నం–41, లింగ చెట్టి స్ట్రీట్, మద్రాసు). ప్రాచీనాంధ్ర కవులు తమ కావ్యాల్లో పూర్వ కవిస్తుతి చేసినట్లు, మన విమర్శకుల్లో చాలా మంది కవి చరిత్రలు, సాహిత్య చరిత్రలు రాసేటప్పుడు పూర్వ సూరుల్ని స్మరించక పోవడం విచారించదగ్గ విషయమే మరి. కాని వంగూరి సుబ్బారావు మాత్రం తమ గ్రంథం 'వేమన సంపూర్ణ జీవిత చరిత్రము బోధనలు'లో రెండవ అధ్యాయం 'వేమన చరిత్రము' లోని వేమన గురించి సుకృతులు రచించిన కొందరు విద్వాంసుల్ని పేర్కొని ప్రశంసించడం గమనార్హం.

వంగూరి సుబ్బారావు 1915లో జి.ఆర్.సుబ్రామయ్య పంతులు Some Mile Stones in Telugu Literature మాలికలో The Age of Vemana అనే గ్రంథాన్ని వెలువరించారని అన్నారు. శ్రీ పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి 1917లో 'శ్రీ వేమన యోగి జీవితము' అనే పుస్తకం రాసినట్లు ఉల్లేఖించారు. ఇంకా సి.పి. బ్రౌన్, రాయవరపు పూర్ణయాచారి, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, కె.వి. లక్ష్మణరావు మొదలైన విద్వత్ వతంసుల వేమన సాహిత్య సేవను కొనియాడారు. (వేమన సంపూర్ణ జీవిత చరిత్రము : బోధనలు, పేజీలు : 8–10) ఇంత ప్రామాణికులైన వంగూరి సుబ్బారావు రాసిన ఈ మహత్తర గ్రంథాన్ని చూసిన వాళ్లూ అరుదు. చూసీ, లాభాన్వితులై కూడా ఆ పుణ్యాత్ముని పేరు స్మరించని పెద్దమనుషులూ ఉన్నారు. శాంతమ్ పాపమ్!

వంగూరి సుబ్బారావు గారి 'వేమన' 216 పేజీల పుస్తకం. ఇందులో 18 అధ్యాయాలు ఈ కింది విధంగా వున్నాయి. 1. వేదాంతము – కవిత్వము, 2. వేమన చరిత్రము, 3. స్థల నిర్ణయము, 4. కాల నిర్ణయము, 5. కులము, 6. కుటుంబము, 7. వేమన కాలము నందలి స్థితి, 8. మతములు, గురువు, 9. వేమన్న భాష, 10. వేమన్న కవిత. 11. పద్య పతనము, 12. వేమన్న పోలిక కవులు, 13. వేమన్న నీతులు, 14. వేమన్న జీవిత విధానము, 15. వేమన్న శిష్యులు, 16. పద్య మకుటము, 17. వేమన్న రసవాదము, 18. చరమ దశ.

ఈ పుస్తకం ప్రారంభంలో వంగూరి వారి 'విన్నపం', మద్రాసు హైకోర్టు జడ్జి వేపా రామేశం గారి 'గ్రంథ పరిచయము' కూర్చబడ్డాయి. మరొక్క విశేషం. ఈ గ్రంథం చివర్లో వంగూరి వారి చారిత్రక నవల 'ప్రభాతము' ఆయన సంపాదకత్వంలో వెలువడ్డ 'ఆంధ్ర క్షత్రియులు' (వాదోపవాదములు) పుస్తకాల పరిచయాలున్నాయి. సుబ్బారావుగారి 'ఆంధ్ర వాఙ్మయ చరిత్రము' సంక్షిప్త పరిచయం, నవల 'లలిత కుమారి', దుర్లభాలైన 28 చిన్ని చిన్ని పుస్తకాల పట్టిక కూడా గమనించ తగ్గవే.

'వేమన' పుస్తకానికి **'గ్రంథ పరిచయము'** రాసిన వేపా రామేశం గారు ఈ గ్రంథంలో రచయిత వంగూరి సుబ్బారావు గారి **'సత్యము, దృఢమునగు రమ్యత, విషయాన్ని విభాగించి, విమర్శించిన సత్పద్ధతుల గమనిక యందలి పరిపూర్ణత'** ఈ రెండు సుగుణాల్ని పేర్కొన్నారు. అంతే కాకుండా ఆయన వంగూరి వారి అధ్యయన, అనుశీలనల్లోని గరిమను ఈ విధంగా స్తుతించారు– **"వేమన చరిత్ర కొఱకీ గ్రంథకర్త ప్రాచీన గ్రంథ సముదాయ సముద్రములను, వ్రాత పుస్తక పరంపరలను, సాగరములను మిక్కిలి కష్టముతో నీది తరించినట్లు గ్రంథమే వేనోళ్ల జాటుచున్నది. ఆ కష్టములో నీ గ్రంథకర్త పడిన శ్రమ, చూపిన జాగ్రత, పట్టుదల మొదలగు లక్షణము లత్యంతము శ్లాఘా పాత్రములై విరాజిల్లుచున్నవి."** (పేజి: 2)

గ్రంథకర్త 'పీఠిక'లో వెలిబుచ్చిన కొన్ని అభిప్రాయాలు చర్చించదగ్గవే. "కాని యీ మహాకవి చరిత్రము కవుల చరిత్రము నందు, కవి జీవితములందు గూడ గఱవైనది. మనవా రీతని యోగిగా బూజించినంత కవిగా బూజింపలేదా యని నా భయము." (పేజి: 1) కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ శ్రీరామమూర్తి గారు వేమన్నను కవిగా గుర్తించలేదన్న వ్యథ వంగూరి వారిని ఈ గ్రంథ రచనకు ప్రేరేపించినట్లు తెలుస్తుంది. రచయిత **"జాతి భేదము అక్కఱ లేదన్న యాంధ్రులలో మొదటివా డీతడని శ్రీ అనంతకృష్ణశర్మ గారు వ్రాసిరి. కాని బసవన్న మొదలగు సంస్కర్తలాంధ్రులే కావున నది సత్యము కాదు."** (పేజి:3) బసవేశ్వరుడు ఆంధ్రుడన్న వంగూరి వారి అభిమతం సత్యదూరం. రాళ్ళపల్లి వారి అభిప్రాయంతో ఏకీభవించని వంగూరి వారు శర్మగారి మరో అభిమతంతో పూర్తిగా ఏకీభవిస్తారు. **"నీతులు చెప్పుటలో లోకము నందలి చెడుగును గర్హించుటలో సత్యము, ధర్మము, ప్రేమము ప్రకటించుటలో వేమన్న పద్యములలో గావ్య మాలికలున్నవి. అందీతని కవితాశక్తి యప్రతిమానము, అద్వితీయము, తెలుగుభాష జీవము– పటుత్వము, ప్రాణశక్తి మాధుర్యము– సంగీతము ఈతనికి బట్టుపడినట్లు మరి యొకరికి బట్ట లేదు. దానికి గారణ మీతనికి సంస్కృత జ్ఞానమేమియు లేకపోవుట యను శర్మగారి మాట సత్యేతరము కాదు."** (పేజి: 3–4) వంగూరి సుబ్బారావుగారి ఈ వక్కాణం ఆయన గుణగ్రహణ పారీణతను, పరిశీలనా నైశిత్యాన్ని ప్రకటిస్తుంది.

వంగూరి సుబ్బారావుగారు ఎప్పుడూ మాటల్ని నాన్చేవారు కాదు. తాను చెప్పదల్చుకున్న విషయాన్ని స్ఫటిక స్పష్టంగానూ, ఢంకా బజాయించి చెప్తారు. వేమన ప్రతిభా విశేషాల్ని వారు ఇలా ఉ ద్ఘాటిస్తారు. **"కావున నాటకములలో గాళిదాసు శాకుంతలము వలె, మకుట సహిత చాటుకృతులలో వేమన్న పద్యము లగ్రగణ్యము లనవచ్చును. శతక వ్మాయమని యీ చాటుకృతుల మనము పిలిచినచో నీజాతి వాఙ్మయమున కీతడు సార్వభౌము డనవచ్చును."** (పీఠిక, పేజి: 5–6)

'వేమన' పుస్తకంలోని మొదటి అధ్యాయం–'వేదాంతము–కవిత్వము' **"వేదాంతి భౌతిక ప్రకృతి యందు విముఖుడై, విరాగము నొందినచో మోక్షకామి యగుట సులభమనుచున్నాడు. కవి సుఖముల కోర్చి జ్ఞానము నొంది, మోక్షమును బొందుటకు దగిన ప్రణయమూర్తిని సృష్టించుచున్నాడు. మార్గముల భేదమే కాని గమ్యస్థాన మొక్కటియే! కావున గవిత్వ వేదాంతముల ఫలితమును బట్టి యొక్కటియే యన వచ్చును."** (పేజి: 6) అంటూ వంగూరి వారు వేమన "రాగ వైరాగ్యముల సంధి" అని చెప్తారు. (పేజి: పైదే)

రెండవ అధ్యాయం– 'వేమన చరిత్రము (చరిత్రాధారములు)' గ్రంథకర్త కడప మండల నివాసి ఎవ్వరో రాసిన 'వేమన చరిత్ర' అనే ద్విపద కావ్యాన్ని 1845 నాటి తాళపత్ర ప్రతిని, బ్రౌన్ పూర్ణయాచారి, జి. ఆర్. సుబ్రామయ్య, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, వావిళ్లవారి 'వేమన పద్యములు' కు పీఠిక రాసిన రాళ్లపల్లి మొదలైన వారికి కృతజ్ఞతలు చెప్తూ ఈ అధ్యాయాన్ని ముగిస్తారు.

మూడవ అధ్యాయం– 'స్థల నిర్ణయము' పరిశోధకులు వేమన్న కొండవీడులో పుట్టి, గండికోట వగైరా ప్రాంతాల్లో తిరిగి అనంతపురం జిల్లా కటారుపల్లెలో ఇహలోక యాత్ర చాలించారన్న నిర్ణయాని కొచ్చారు.

నాలుగవ అధ్యాయమైన 'కాలనిర్ణయము'లో వంగూరివారు కొమర్రాజు, పంచాగ్నుల, పూర్ణయాచార్యుల్లాంటి పెద్దల అభిప్రాయాలతో ఏకీభవించి వేమన క్రీ.శ. 1412లో పుట్టి వుంటారని భావించారు. (పేజి: 44) ఈ మాట తన వూహ అంటూ, పరిశోధకులు ఇంకా అన్వేషణ జరపాల్సిన అవసరం వుందన్నారు. (పేజి: 45)

వేమన్న రెడ్డికులంలో పుట్టాడనటానికి చాలా సాక్ష్యాలున్నాయనీ, కాని ప్రభు (రాజ) వంశానికి చెందినవాడని నిరూపించడానికి ఆధారాలు చాలవని వంగూరివారు ఐదవ అధ్యాయమైన 'కులము'లో చెప్పారు. (పేజి: 52–53) ఆరవ అధ్యాయమైన 'కుటుంబము' లో సుబ్బారావు గారు వేమన్న తల్లిదండ్రుల, అన్నదమ్ముల గురించి చక్కగా చర్చించారు. క్రీ.శ. 1845 ప్రాంతంలో ఒక కడప నివాసి 'వేమన చరిత్రము' అనే ద్విపద కావ్య రాతప్రతని సిద్ధపరచగా, అది కాకినాడలోని ఆంధ్రసాహిత్య పరిషత్తు గ్రంథాలయంలో వుందనీ (నంబరు 744) దాని ప్రకారం వేమన్న తల్లి లక్ష్మాంబ, తండ్రి తుంగకేశవుడు, అన్న పాపన్న, ఇద్దరు తమ్ముళ్లు కేశవ నారాయణులని వంగూరి వారు పేర్కొన్నారు. వేమన్న కుటుంబం వారు మార్కాపురం (నేటి ప్రకాశం జిల్లా) చెన్నకేశవస్వామి భక్తులని రావుగారి అభిప్రాయం. 'వేమన చరిత్రము' లోని కుటుంబ స్థితి గతుల వర్ణన ఆధారంగా వేమన మార్కాపురం చెన్నకేశవాలయ ధర్మకర్తల వంశానికి చెందినవాడో, లేదా సమీపంలో వున్న ఏ చిన్న సంస్థానానికి సంబంధించిన అధిపతికి చెందిన కుటుంబీకుడో అయివుండొచ్చని వంగూరి వారి ఊహ (పేజి: 58–61). అంతేకాక వేమన్న రెడ్లలో పాకనాటి శాఖకు చెందిన వాడై వుండొచ్చని ఆయన వూహ. (పేజి: 68)

ఏడవ అధ్యాయం – 'వేమన కాలము నందలి స్థితి' ఇందులో వేమన కాలం నాటి రాజకీయ, మత, వాఙ్మయాల స్థితిగతులు పరిశీలించబడ్డాయి. సిరిసందలతో అలారారుచున్న కొండవీటి రెడ్డి ప్రభువు రాచకొండ రాజుకు, హైదరాబాద్ నవాబుకు, విజయనగర రాజుకు కడుపు మంటగా నుండెను. రాజమహేంద్రవరంను ఏలే రెడ్డిరాజుల వైభవం కూడా వేమన్న కళ్లెదుటే 20 ఏళ్ల అవధిలో అంతరించింది. రెడ్డి కులస్థుడైన వేమన్న ఇది సహించలేకపొయ్యాడు. వేమన్న పై ఈ రెండు రాజ్యాల పతన ప్రభావాన్ని వంగూరి సుబ్బారావు పంతులు ఇలా భావించారు. **"వేమన్న బాల్యము నందు బ్రాహ్మణుల నిరంకుశత్వము, రాజ్యముల వినశ్వరత్వము, తన కులము, వంశము ననుసరించి యుండిన మనో స్వాతంత్ర్యము, వీనిపై నాతని హృదయము నందు గలిగిన విప్లవము నాతని భవిష్యజ్జీవితమును మార్చి నడుపుట యందు ముఖ్యకారణము లైనవని చెప్పవచ్చును."** (పేజి: 72–73)

పంతులుగారు వేమన్న దృష్టి ప్రసారాన్ని ఇలా దర్శించారు. **"పండితుల బోధలు విన్నవాడు. నిరంకుశముగ బ్రవర్తించిన కవుల జూచినవాడు. ఆతని మనోరంగముల గొప్ప గాలివానలు లేచినవి. మహాదాతలగు రెడ్ల ధనము, ధాన్యము, అగ్రహారములు, దేవాలయ నిర్మాణములివి యెవ్వియు రెడ్డిరాజ్యమును రక్షింపలేదు. కావున బ్రాహ్మణుల మీదనే యాగ్రహము జనించినది. బ్రాహ్మణుల శాంతికపౌష్టిక కర్మలు నిష్ప్రయోజన మని యనుకొనెను."** (పేజి: 74) పై రెండు రెడ్డి రాజ్యాల పతనానికి ఆ రాజుల భోగలాలసత, అహంకారం, దూరదర్శిత్వ రాహిత్యం, దక్షతాలోపం మొదలైన కారణాలు వుండొచ్చని వేమన్న ఆలోచించక పోవడం గమనించదగ్గ విషయం.

ఎనిమిదవ అధ్యాయం – 'మతములు, గురువులు' వేమన్న కాలం కర్మకాండలు ప్రబలి, మూఢత్వం అతిశయించి, శైవ, వైష్ణవ మత ద్వేషాలు విజృంభించిన సమయం. వేమన సమకాలీన సాంఘిక, రాజకీయ, మత సంక్షోభాన్ని కార్యరూపంలో తీవ్రంగా ఎదురించిన వ్యక్తి కాదు. వేమన్నకు సంఘ సంస్కరణ పట్ల అకుంఠితమైన దీక్ష, అచంచలమైన పట్టుదల వున్నట్లు గట్టిగా చెప్పలేం. వంగూరి వారి నిశిత దృష్టి వేమన్న బోధనా వైఖరిని ఈ విధంగా చూసింది. **"ఆ చెప్పుట కూడ నాతడొక కార్యముగ బెట్టుకొన్నట్లు తోపదు. లీలగ, విలాసముగ, కేవల శారీరక జ్ఞప్తి– అనగా బాహ్యస్మరణ కలిగినప్పుడేవో రెండు కల్లబొల్లి పద్యములల్లువాడే కాని, యవి యాతడు గ్రహించిన జ్ఞాన సర్వస్వ మన జాలము ఆతడు చెప్పిన దాని కంటె నెక్కువ తెలిసిన వాడని నాయభిప్రాయము."** (పేజి: 8–88)

తొమ్మిదవ అధ్యాయం 'వేమన్న భాష'లో గ్రంథకర్త కవి భాష గురించి చక్కని పరిశీలన చేశారు. వేమన్న పద్యాల్లోని భాష సజీవమైనదీ, సహజమైనదని అంటూ అందువల్లనే ఆయన పద్యాల్లోని కొన్ని పంక్తులు నయమూ, నాజూకైన నుడికారాలై, సామెతలుగా



కూడా నిలిచిపొయ్యాయి. వంగూరి సుబ్బారావు గారు సహజమూ, సజీవమూ అయిన వేమన్న భాషను ఈ విధంగా మనసారా పొగిడారు– **"మొత్తము మీద వేమన్న నిరంకుశముగ దన భావ ప్రకటనమే చూచెను. చిన్న చిన్న మాటలతో బెద్దపెద్ద భావముల గష్టపడకుండ, క్లిష్టాన్వయములు లేకుండ, పండిత పామరజన వేద్యముగ జెప్పుచు బోయెనే కాని భాషాలక్షణముల కంతగా లెక్కగొన లేదని చెప్పవచ్చును. ఇంత యేల? భాషా విషయికముగ జూచిన నంత విషయము నంత సులభముగ నంత సొంపుగ జెప్పగలిగిన కవి మతియొకడు లేడు. ఇందాతని కాతడే సాటి."** (పేజి: 94–95) వేమన పద్యాల్లో ఛందో, యతి, ప్రాసల దోషాలుండుటకు కారణాల నిలా పేర్కొంటారు పంతులుగారు. వేమన సంస్కృత భాషా పండితుడు కాకపోవడం, అతని పద్యాలు కవి నోటి నుంచి ఆశు వుగా వెలువడటం, శిష్యుల, భక్తుల, ఇతర రాయసగాళ్ల రాతల్లో తెలిసో, తెలియకో తప్పులు దొర్లటం, పైగా కాలక్రమంలో రాయసగాళ్లు కాళిదాసు కవిత్వానికి తమ పైత్యం చేర్చిన చందాన వ్యవహరించడం అంటారు. (పేజి: 95–96)

పదవ అధ్యాయమైన 'వేమన్న కవిత' 29 పేజీల నిడివిగల వ్యాసం. పంతులు గారు **"వేమన్న వేదాంతి, కవి యీ రెండు శక్తులను గూడ జూపెనన వచ్చును. ఇట్లే భక్తి, జ్ఞానమూలల సంధియు నీతని యందు జూపనగును."** (పేజి: 102) అని అంటారు. వంగూరి వారు వేమన్నను వేదాంతకవి (Metaphysical poet) గా పరిగణిస్తూ, ఆంగ్ల వేదాంత కవుల కంటె వేమన్న భిన్నుడనీ, విలక్షణుడనీ వాక్రుచ్చారు.

**"వారు ప్రకృతిని గాని, మానవ జీవితమును గాని యనుసరింప లేదు. వేమన్న యట్లు కాదు. అతడు ప్రకృతిని విమర్శించెను. కొన్ని చోట్ల పెక్కుచోట్ల నాతని యుపమలలో బ్రకృతిపై నాతనికిగల పరమానురాగమును వెల్లడించెను. మనుష్య జీవిత రహస్యమును**

**సంపూర్ణముగ గ్రహించి, యాతడు మానవాదర్శమనుకొనిన దానికి వ్యతిరేకముగ గనబడిన దానిని గర్హించెను. ఆంగ్లేయ వేదాంత కవులు భౌతికమైన బాహ్య ప్రకృతి వర్ణనము కాని, మనో ప్రపంచ రంగముల గాని చిత్రింపలేదు."** (పేజి: 99-100) పంతులు గారు పాశ్చాత్య వేదాంత కవుల కంటే వేమన్న గురుతరుడని విశ్వసించడం ప్రశంసనీయం.

సుబ్బారావుగారు వేమన్న పద్యప్రతుల్లో చాలా వాటిలో ప్రారంభ పద్యంగా వున్న కింది దానిని చర్చించారు.

**"శివకవులకు నవకవులకు**
**శివభక్తికి దత్త్వమునకు జింతామణికిన్**
**శివలోక ప్రమథులకును**
**శివునకు గురువునకు శరణు సేయర వేమా."**

**"వేమన్న కవుల్ని శివకవులు, నవకవులు అని రెండు రకాలుగా విభజించారు. తనకంటే పూర్వులైన కవుల్ని వేమన శివకవులుగా భావించారని శైవులకు మరణించిన వారందఱును శివ స్వరూపులే! కావున పూర్వకవుల శివకవులనె నని నా యూహ, లేదా పూజ్యులైన కవులనియై యుండును."** (పేజి: 110-111) పూర్వకవుల్ని, మరణించిన కవులందర్నీ వేమన పూజ్యులనీ, శివ స్వరూపులనీ భావించి వుంటారనడం సమంజసమా? నన్నయ, తిక్కన, ఎర్రనలు వైదిక ధర్మప్రతిపాదకులు కదా. అలాంటప్పుడు వారు వేమన్నకు ఎలా పూజ్యపాదులవుతారు? శ్రీపతి పండితారాధ్యులు, యథావాక్కుల అన్నమయ్య, పాలకురికి సోమన్నల్ని శివకవులుగా దేశి సారస్వత విభూతి సంపన్నులుగా భావించి, సంభావించాడని తలిస్తే వేమన్నకు గౌరవప్రదమే కదా! వేమన్న కవిత్వంలోని ఉపమాలంకార ప్రయోగాలకు వంగూరివారు సమ్మోహితులయ్యారు. ఈ అలంకారాల ఔచిత్యాన్ని విశ్లేషించడం ద్వారా మనం వేమన్న కవితా ప్రాభవాన్ని చక్కగా అంచనా వేయగల మంటూ పంతులు గారిలా అంటారు- **"వేమన యుపయోగించిన యుపమల నన్నిటిం జదివి, విభజించి, విమర్శక బుద్ధితో జూచిన యెడల నాతని మనస్తత్త్వము, నీతివర్తనము, జీవిత విధానము ప్రకృతి పరిశీలనము, కవితా శక్తియు గూడ చాలా వఱకూహింపవచ్చును."** (పేజి: 119) వేమన్న ఉపమాలంకార ప్రయోగ వైశిష్ట్యాన్ని సునిశితంగా పరిశీలించిన వంగూరి సుబ్బారావుగారి గ్రహణశక్తి శ్లాఘనీయం.

వేమన్న పండితుడు కాకున్నా భగవద్గీత, హితోపదేశం, పంచతంత్రం, శైవమత గ్రంథాలు భారత, భాగవత, రామాయణాది గ్రంథాలు విని, వాటి సారాన్ని జీర్ణించుకుని, తన పద్యాల్లో రమణీయంగా వ్యక్తం చేశారని పంతులు గారభిప్రాయపడ్డారు. వేమన్న తన కవిత్వంలో వాడిన వేదాంత సూత్రాలు, పారిభాషిక పదాలు అతని పూర్వ గ్రంథ పరిచయాన్ని సూచిస్తాయని అంటారు వారు. (పేజి: 119-123)

వంగూరి వారు వేమన్న కవితా ప్రతిభను పరిపరి విధాలా వెల్లడించారు. వేమన్న రాసిన **"ప్రస్తుతంపు వేళ పద్యంబు చదివిన........"** అనే పద్యాన్ని అనుకరించి జగన్నాథ పండిత రాయలంతటి మనీషి **"అవసర పఠితావాణీ గుణ గణరహితాపివహతి పరమోదం..."** శ్లోకాన్ని రచించడం వేమన కావ్యగరిమను చాటుతుందన్నారు (పేజి: 123-124) వేమన్న పద్యాలు అనేకార్థాలనిస్తాయనీ, ఆయన పాటల్ని, చిత్రపదాల్ని కూడా రాశారనీ అన్నారు పంతులుగారు. అంతేకాక అంతరార్థాన్ని ఇచ్చే కూట పద్యాలపై ఒక అధ్యాయమే రాయొచ్చని కూడా తెలిపారు. (పేజి: 125)

పదకొండవ అధ్యాయం 'పద్య పఠనము' వంగూరి సుబ్బారావుగారు వేమన్న పద్యాల్ని లోతుగా అధ్యయనం చేసి ఈ అధ్యాయంలో 35 అంశాల్ని పరిశీలించారు. వేమన్న పద్యాల్లో జాతీయాలు, సామెతలు పుష్కలంగా, జీవనానుభవాన్ని వ్యక్తీకరించేలా వున్నాయంటారు వంగూరి వారు. యతి ప్రాసలు సహజంగా, సులభంగా వుండి కవి ఆశయాన్ని వ్యక్తం చేయడానికి దోహదం చేస్తాయన్నారు. వేమన్న శైవ, వైష్ణవ మతావలంబుల్లోని దురాచారాల్ని, మూఢనమ్మకాల్ని ఖండించాడే కాని మతాల్ని నిరసించలేదు. భక్తి, జ్ఞానాల్ని ఆయన ఆదరించారని చెప్పారు పంతులు గారు. విగ్రహారాధనను, తీర్థయాత్రల్ని, జపతపాల్ని ఖండించారు. పరుల ధనాన్ని అపహరించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. దేశకాల మత పరిస్థితుల్ని క్షుణ్ణంగా పరిశీలించి, తన అభిప్రాయాల్ని సూటిగా తెలిపారు.

పన్నెండవ అధ్యాయం- 'వేమన్న పోలిక కవులు.' ఇందులో వంగూరి వారు కన్నడకవి సర్వజ్ఞుడు, మరాఠీ కవి తుకారామ్, తమిళ కవయిత్రి అవ్వాయి (అవ్వయ్యార్ గ్రీకుకవి ల్యూషియన్, తమిళకవి అరుణ గిరి నారినాథుడు రాసిన కవిత్వానికి వేమన్న కవిత్వానికి గల సామ్య వైషమ్యాల్ని స్థూలంగా పరామర్శించారు.

'వేమన్న నీతులు' అనే 13వ అధ్యాయంలో సుబ్బారావు గారు వేమన్న కవితా ప్రతిభ అతడు జీవిత సత్యాల్ని సహజ, సుందర ఉపమలతో పోల్చి చెప్పడంలో వ్యక్తమవుతుందని సోదాహరణంగా వెల్లడించారు.

**"వేమన్నకు భావవైశాల్యము, ఉపమాన సంధానశక్తి, విమర్శన జ్ఞానము, సృష్టి తత్త్వ విజ్ఞానము, వచో సౌలభ్యము, సహజధార యిట్టి సద్గుణములు కలవని నిశ్శంకగా జెప్పవచ్చును."** (పేజి: 164) అని గ్రంథకర్త వేమన్న కావ్య కౌశలాన్ని ఉగ్గడించారు.

14వ అధ్యాయం- 'వేమన్న జీవిత విధానము.' వేమన లోక సంచారి అనీ, మనసు కలిగినప్పుడు జీవిత సారమున దగిన పద్యాల్ని

చెప్పేవాడని గ్రంథ రచయిత చెప్పారు. వేమన్న జీవించి వుండగానే ఆయన శిష్యులు ఆయన ఆశుపద్యాల్ని భక్తుల కోసం ఒక సంకలనంగా కూర్చి వుంటారని వంగూరి గారి అభిమతం. వేమన **"నిరంకుశ ప్రవర్తనము గలకవి. భగవంతుడే వేఱు లేడని, తానే బ్రహ్మమునని సంపూర్ణ విశ్వాసము గల సర్వాధికారిగా నాతడు జీవితమును గడిపె ననుట కేయభ్యంతర మును లేదు."** అని వంగూరి వారు బల్లగుద్ది చెప్పారు.

'వేమన శిష్యులు' అనబడే 15వ అధ్యాయం విశిష్టమైనది. వేమన పద్యాలు సర్వ సోదరత్వ భావాన్ని ప్రకటించడం వల్ల, అరటిపండు వొలిచి నోట్లో పెట్టినంత సులభంగా వుండటం వల్ల, హృదయానికి హత్తుకొని పోయేటంతటి ఆర్ద్రత వుండటం వల్ల ఆబాలగోపాలానికీ చేరువయ్యాయి.

వేమన సత్యసంధతను మెచ్చి, కవితా సౌరభాన్ని ఆఘ్రాణించి ఎడపాటి ఎఱ్ఱాప్రెగ్గడ, తురగా రామకవి, పింగళి ఎల్లనార్యుడు మొదలగు బ్రాహ్మణ కవులు ఆయన్ను పూర్వకవుల పీఠ మెక్కించి ప్రస్తుతించారు. వేమన్న జీవితాన్ని సుఖ సంతోషదాయకం చేసుకొనేందుకై ఏడు సూత్రాల్ని బోధించారని కొమఱ్ఱాజు లక్ష్మణరావు గారి మాటల్ని వంగూరి వారు ఉల్లేఖించారు. (పేజి: 181–182). వేమన బోధనలచే ప్రభావితమై రచింపబడ్డ 45 శతకాల్ని సుబ్బారావు గారు పేర్కొన్నారు. (పేజి: 190) ఈ శతక కర్తలు గూఢ వేదాంతాన్ని బోధించారని అన్నారు.

16 వ అధ్యాయం 'పద్యమకుటము' లో వంగూరి వారు 'విశ్వదాభిరామ వినురవేమ గురించి చర్చించారు. **"విశ్వమున కభీష్టము నిచ్చువాడాయని, సమస్తములిచ్చుటచే నభిరాముడని లోకములో సామాన్యముగా వాడుకలో నున్న యర్థములే నాకు దృష్టికరముగా నున్నవి."** (పేజి: 193–194) అన్నదే పంతులు గారి అభిప్రాయం.

17వ అధ్యాయం 'వేమన్న రసవాదము.' వేమన్న కాలంలోనూ, అంతకు ముందు కూడా హేమకారక విద్యపట్ల చాలా మందికి నమ్మక ముండినట్లూ, వేమన కూడా స్వర్ణ విద్యతో పరిచితుడై వుండినట్లు వంగూరి వారు అభిప్రాయపడ్డారు.


చివరి అధ్యాయం 'చరమదశ' వేమన దేశ సంచారం చేసి, ప్రజలకు నీతులు చెప్పి, కడపటి రోజుల్లో అనంతపురం జిల్లా కటారు పల్లెలో ప్రశాంత జీవనం గడిపారని పంతులు గారి అభిప్రాయం. వేమన్న 1412లో కొండవీడులో పుట్టి, 1480 లో కటారుపల్లెలో జీవన్ముక్తిని పొందారని వంగూరి సుబ్బారావుగారి అభిమతం.

వంగూరి సుబ్బారావు గారి 'వేమన' (1922) తర్వాతి పరిశోధకులకు, విమర్శకులకు కైదివ్వె లాంటిది. ఈ మహానుభావుడు



అంతకు ముందు వెలువడ్డ వేమనను గురించిన గ్రంథాల్ని లోతుగా చదివి, కొందరి అభిప్రాయాల్ని అంగీకరిస్తూ, మరి కొందరితో విభేదించారు. అయితే వాళ్లపట్ల గౌరవాదరాల్ని చూపారు. ఈనాటి చాలా మంది విమర్శకుల్లోనూ, రచయితల్లోనూ ఈ సౌజన్యం లోపించడం విచారకరం, వంగూరి వారి 'వేమన' ను విశ్వవిద్యాలయ పరిశోధకులు గమనించారో లేదో కాని రాళ్లపల్లి వారు మాత్రం లోతుగా చదివారని చెప్పొచ్చు. రాళ్ళపల్లి వారి 'వేమన' (1929) విషయ సూచిక వంగూరి వారి 'వేమన' విషయ సూచిక' క్లుప్త రూపమనే తోస్తుంది. సుబ్బారావుగారు వేమన గురించి సమృద్ధమైన విషయసేకరణ చేస్తే, అనంతకృష్ణులవారు ఆ సమృద్ధతకు లోతుపాతుల్ని, కళాత్మకతను సంతరించి పెట్టారని చెప్పొచ్చు. అంగీకారాన్ని కాని, అభిప్రాయ భేదాన్ని కాని తెలియచేయడంలో నయము, నాజూకు, స్పష్టతలు ఎలా ప్రదర్శించాలో నేటి తరం విమర్శకులకు ఈ రెండు సద్గ్రంథాలు సత్పథాన్ని చూపుతాయి. వంగూరి సుబ్బారావు గారి 'వేమన' పునర్ముద్రితమైతే వేమన కవిత్వ అధ్యయనం మరింత వైశాల్యాన్ని, గాంభీర్యాన్ని పుంజుకొనే అవకాశముందని ఆశించవచ్చు.

(ఈ పుస్తకం జిరాక్స్ ప్రతి పంపి తోడ్పడిన నెల్లూరు నివాసి టి. రమణయ్యగారికి కృతజ్ఞతలు.)



# పద్యమనోహరం - 37

## గన్నమరాజు గిరిజామనోహర్ బాబు

వరంగల్, ఫోన్ : 994 901 3448

**"ఈ చలిగాలిలో బయటకేగకురా పసితండ్రి! ఇంత ఈ కాచిన ఆవుపాలను చకాచక త్రాగి మనింటిలోనె, నీ తోచిన ఆటలాడు, మరి దుందుడుకుందన మిన్నినాళ్ళుగా సైచితి గాని, చూడు మిక సైచను సుంతయు నింక మీదటన్"**

ఈ ప్రపంచంలో మాతృత్వం అత్యంత పవిత్రమైందిగా అన్ని దిశల్లోని, దేశాల్లోనూ అంగీకరించిన ఏకైక సత్యం. మానవ సమాజాలున్న ప్రతిచోట అమ్మలోని కమ్మదనాన్ని ఆస్వాదించే ప్రాణులుండడం అత్యంత సహజమైన విషయం.

అందుకే భారతీయ పురాణేతిహాసాలు అమ్మ ప్రేమను గురించిన అనేక కథలను, ప్రేమ సందేశాన్ని అందిస్తూ వందలాది కథలు లోకానికి అందించాయి. మనము శ్రీకృష్ణ పరమాత్ముని కథ చెప్పే భాగవత పురాణాది గ్రంథాలు మరింత ఘనంగా స్వామి కథలను మాతృప్రేమకు వేదికగా చేసుకున్నాయి. ప్రాచీనులనుండి ఆధునికుల వరకూ కవియన్న ప్రతి వ్యక్తి ఎక్కడో, ఏదో ఒక సందర్భంలో శ్రీకృష్ణుని బాల్యాన్ని, తల్లి యశోదమ్మ అనురాగాన్నో వర్ణించకుండా వదల్లేదు. ఆ మార్గంలో సుప్రసిద్ధ ఛందశ్శాస్త్రవేత్త, విమర్శకులు కవి ఆచార్య కోవెల సంపత్కుమారా చార్యగారు కూడా తాము రచించిన "చింతయంతి" కావ్య సంపుటిలో "యశోద" అనే పేరుతో ఒక ప్రత్యేక ఖండికనే రచించి తల్లి ప్రేమను గురించి అద్భుతరీతిలో వర్ణించిన ఆ ఖండికను వెలిగించారు. మాతృప్రేమ లోని మాధుర్యాన్ని, హృదయ మార్దవాన్ని, అనురాగ బంధాన్ని అపురూపంగా అభివర్ణించారు.

'యశోద' ఖండికలో తొలిపద్యంలోనే బాలకృష్ణుని ప్రేమతో మందలిస్తూ తల్లి యశోద "నాయనా! పసితండ్రీ! కృష్ణా! ఈ చలిగాలిలో ఎందుకు నాయనా బయట తిరుగుతుంటావు. నేను కాచిన ఈ ఆవుపాలను తాగి ఇంట్లోనే ఆడుకోవచ్చు కదా! ఇంట్లోనే నీకు తోచిన పనులను ఎన్ని చేసినా సహిస్తూనే ఉన్నాను, ఇకముందు సహించను" అంటూ యశోదమ్మ మాటలు లోకంలోని తల్లులందరి హృదయాన్ని ఆవిష్కరిస్తూ ఉంది.

శ్రీకృష్ణుని బాల్యక్రీడలు లోకంలోని బాలుర తత్త్వాన్ని తెలిపే రీతిలో కవులు, ముఖ్యంగా బమ్మెర పోతన మహాకవి వర్ణించారు. ఈ పద్యంలోనూ ఆచార్యులవారు నందాంగనా డింభకుని అల్లరి చేష్టలను గురించి తల్లినోట పలికించాడు. ఏ తల్లైనా తమ పిల్లలు అల్లరికి దూరంగా ఉండాలని కోరుకుంటారు. కాని పిల్లలు చేసే అల్లరిని ఓపికతో భరిస్తూ, వారిని దిద్దే ప్రయత్నం చేస్తుంటారు. ఇక్కడ యశోద కూడా తన తనయునితో చేసిన దుందుడుకు పనులు చాలనీ, వాటిని కొంతకాలం ఓపికతో సహించానని, ఇకముందు సహించనని చెప్పడం గమనిస్తే తల్లి తన పిల్లల విషయంలో వాళ్ల అల్లరి గురించి ఎంతగా తల్లడిల్లుతుందో కూడా అర్థమవుతుంది. ఈ పద్యంలో కోవెలవారు యశోద నోట 'పసితండ్రి' అనే పదబంధాన్ని పలికించాడు. ఈ సంబోధన పద్యాన్ని వెలిగించే పదబంధం. ప్రతి తల్లీ తన పిల్లలను 'తండ్రీ!", "నాయనా!" అని సంబోధించడం లోక సహజం. ఇక్కడ ఈ సంబధన లోకం పోకడను ప్రతిబింబిస్తున్నట్టనిపిస్తుంది.


ఈ శీర్షికలోని అన్ని పద్యాలు స్వామి బాల్యపు లీలను తెలిపేవే. ఈ బాల్యచేష్టల్లోని దైవతత్త్వాన్ని ధ్వనింపజేస్తూ, ఆచార్య కోవెల సంపత్కుమారాచార్యగారు రచించిన "యశోద" ఖండికలోని చక్కని పద్యాన్ని చదివినప్పుడు తల్లిప్రేమను ప్రతి పాఠకుడు అనుభూతించి ఒక అనిర్వచనీయమైన ఆనందాన్ని అందుకోవడం తథ్యం.





# తెలంగాణ ఉద్యమం – ఉ.సా. సంఘీభావ వ్యాసాలు


**జె. శంకర్**, ఫోన్ : 80992 58678



'ప్రాంతాలు విడిపోవడం అనేది కేవలం భావన కాదు. దాని వెనుక ఉన్న ఆర్థిక అసమానత. ఈ అసమానతలు కొన్ని సామాజికవర్గాల అస్తిత్వాన్ని తెంచివేయడం దీర్ఘకాలికంగా జరుగుతున్నప్పుడు సామ్రాజ్యాల నుండి దేశాలు, దేశాల నుండి రాష్ట్రాలు, రాష్ట్రాల నుండి ప్రాంతాలు విడిపోవడం అస్తిత్వం కోసమే, తద్వారా తమ ప్రాంతంలోని వనరులపై తమకు స్వయం నిర్ణయాధికారం ఉండాలని చెప్పడమే, ప్రపంచం అంతా ఇది అని అనివార్య పరిస్థితి' అని ప్రాంతీయ అస్తిత్వ ప్రాధాన్యతను స్పష్టంగా తెలియజేస్తున్నారు.(నగరానికొచ్చిన నాగళ్ళు, 2007, 05)

భారతదేశ చరిత్రలో బ్రిటిష్ బానిస సంకెళ్ల నుండి, 1947 భారతదేశానికి స్వాతంత్ర్యం లభించినప్పటికిని, నిజాం రాజు భారత యూనియన్‌లో చేరక భారత ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చు కున్నాడు. కానీ హైద్రాబాద్ సంస్థానంలో అప్పటికే 1927న స్థాపించిన ఇత్తే హద్ – ఉల్ – ముస్లిమీన్ (రజాకార్) సంస్థ, జాగీర్దార్, పటేల్, పట్వారీ మరియు పెత్తందార్ల అరాచకాలు మితిమీరడంతో హైద్రాబాదు సంస్థానంలోని ప్రజలు నిజాం పరిపాలన నుండి విముక్తి కోసం ఉద్యమాన్ని మొదలు పెట్టడం జరిగింది. దీన్నే హైదరాబాద్ విమోచనోద్యమంగా పిలిచినప్పటికినీ, ఇది క్రమంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంగా మారి దొడ్డి కొమరయ్య, బందగీ, చాకలి ఐలమ్మ వంటి పోరాట యోధుల వీర మరణాలు, తెలంగాణ ప్రజల వీరోచిత పోరాటం మధ్యన 17 సెప్టెంబర్ 1947న కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సైనిక చర్యతో మొదలై, 1949 డిసెంబర్‌తో ముగిసినప్పటికిని, 1950 నుండి 1952 వరకు ప్రత్యేక సైనిక అధికారి పరిపాలనలో సాగి, 1952 మొట్ట మొదటి సార్వత్రిక ఎన్నికలలో బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా తెలంగాణ ప్రభుత్వం పడినప్పటికిని, ఆంధ్రాలో జరిగిన విశాలాంధ్ర ఉద్యమం ద్వారా ఏర్పడ్డ రాష్ట్రాల పునర్విభజన కమీషన్ ఆంధ్ర – తెలంగాణ రాష్ట్రాలను కలిపి ఉమ్మడి రాష్ట్రంగా ఏర్పాటు సరికాదని తెలిపినప్పటికిని, ఒకే జాతి, ఒకే భాష అనే కుట్రలో భాగంగా, విశాలాంధ్ర పేరుతో, పెద్దమనుషుల ఒప్పందం పేర, మిగులు బడ్జెట్ రాష్ట్రంగా ఉన్న తెలంగాణను, లోటు బడ్జెట్‌తో ఉన్న ఆంధ్రరాష్ట్రంతో కలిపి 1 నవంబర్ 1956 రోజున ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా అవతరణ చేసారు.

ఆంధ్రప్రదేశ్ అవతరణ మొదలు పెద్దమనుషుల ఒప్పందాన్ని పేరుకే పరిమితం చేసిన ఆంధ్రులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా, సాంస్కృతికంగా తెలంగాణ ప్రాంత వనరుల దోపిడికి అంతులేకుండా పోయింది. ఇంతకు ముందే నిజాం రాష్ట్రంలో ప్రధానిగా వున్న సాలార్జంగ్ 1888లో ప్రతిభ పేర ఇతర రాష్ట్రాల వారికి ఉద్యోగాలు కల్పించడం వల్ల ఇక్కడి స్థానిక ప్రజలకు ఉద్యోగాలు లేకపోవడం చేత, నిజాం రాజుకు ఇచ్చిన వినతుల వల్ల 1919 'ముల్కీ ఫర్మానా' తీసుకురావడం జరిగింది. కానీ అప్పటికే స్థానిక ప్రజల పట్ల వివక్ష జరిగి 1938లో ముస్లింలు ఒకసారి ఉద్యమం చేసినప్పటికి అది ఫలితాన్ని ఇవ్వలేకపోయింది. క్రమంగా తెలంగాణ ప్రాంత ఉద్యోగాల్ని, వ్యాపారాల్ని, కాంట్రాక్టులను దోపిడీ చేస్తున్న ఆంధ్ర పెట్టుబడిదారులపై 1952లో 'నాన్ ముల్కీ గో బ్యాక్', 'ఇడ్లీ సాంబార్ గో బ్యాక్' ఉద్యమంగా మారిన నేపథ్యం ఈ తెలంగాణ గడ్డకు అప్పటికే ఉంది. కాబట్టి ఆనాటి దోపిడీ ఈనాడు పెచ్చరిల్లడంతో 1969 నాటి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం పేరిట 369 మంది తెలంగాణ ప్రాంత బిడ్డల నిండు ప్రాణాలను బలి తీసుకుంది ఆనాటి ఆంధ్రా పాలక ప్రభుత్వం. ఇట్టి పరిస్థితుల్లో తెలంగాణ ప్రాంత ప్రజలను చల్లార్చడానికి అష్ట సూత్ర ఒప్పందం ఒకటి తెరమీదికి వచ్చినప్పటికి, పాలకులంతా ఆంధ్రా ప్రాంతం వారు అవ్వడం వల్ల అది అమలు కాలేకపోయింది. ఇదే క్రమంలో 1956కు ముందు ఉన్న ముల్కీ నిబంధనలు చెల్లనేరవు అనే తీర్పును ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇవ్వడం, దానిపై అప్పీల్‌కు వెళ్లిన ప్రభుత్వ వాదనను సమర్థించిన సుప్రీంకోర్టు ముల్కీ నిబంధనలను సమర్థిస్తూ తీర్పు ఇవ్వడంతో మొదలైన ప్రత్యేకాంధ్ర ఉద్యమం 5 సూత్రాల పథకంతో చల్లార్చబడినప్పటికిని, తెలంగాణ ప్రాంతానికి ఎన్ని రక్షణలు ఉన్నప్పటికి, ఆంధ్రా ప్రాంత నాయకుల దోపిడికి, అరాచకాలకు అంతులేకుండా పోయింది. జీ.వో నెం. 36 ఉల్లంఘన,




జీ.వో నెం. 610 ఉల్లంఘన, గిరిగ్లానీ కమిషన్ ద్వారా బట్టబయలైంది. ఇలాంటి దోపిడీని గమనిస్తున్న తెలంగాణ ప్రజలు, ఉద్యమ నాయకులు ఆరిపోతున్న దీపానికి ఆత్మత్యాగాలను చేస్తూ, ఊపిరులను ఊదుతూ జీవం పోస్తున్నారు. ఇలా ఆరిపోతున్న దీపానికి మరొకసారి మారోజు వీరన్న రూపంలో 1997 సూర్యాపేట డిక్లరేషన్ ద్వారా ఊపిరిని ఊదినప్పటికి, మారోజు వీరన్న మరణం తర్వాత రాజకీయ ఎజెండానే ప్రాతిపదికగా 2001 సంవత్సరాన తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఏర్పాటుతో కొంత చైతన్యం వచ్చినప్పటికి, తెలంగాణ ప్రజల అకుంఠిత దీక్ష, పోరాటల ఫలితంగా 2 జూన్ 2014 ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి, ఆనాటి ఉద్యమ సమయాన ఆంధ్రా రాయలసీమ ప్రజలు, కవులు, రచయితలు, కళాకారులు మొదలైన వారు వివిధ రూపాలలో ప్రకటించిన సంఘీభావం ప్రకటించినప్పటికిని, 'ఉద్యమాల ఉపాధ్యాయుడు' **ఉ ప్పుమావులూరి సాంబశివరావు**గారు తెలంగాణకు మద్దతు తెలుపుతూ వివిధ దినపత్రికలకు, మాస పత్రికలకు రాసిన వ్యాసాలను నా ఈ వ్యాసంలో విశదరీకరిస్తున్నాను.

6 శతాబ్దాల సుదీర్ఘకాలం నవాబుల, సుల్తానుల రాచరికపు పాలనలో తెలంగాణా ప్రజల భాషా, సంస్కృతులు దారుణంగా అణగద్రొక్కబడి, ప్రజలు వాటి పరిరక్షణ కోసం ఎన్నో త్యాగాలు చేశారు. ఈనాడు వలసాంధ్ర 'పాలకులు' కూడా తెలంగాణ ప్రజల సహజమైన అభివ్యక్తిని పలుకుబడిని ఘోరంగా ఈసడిస్తూ అవమానిస్తున్నారు. వారి ఆత్మాభిమానాన్ని దెబ్బతీస్తున్నారు. (తెలంగాణకి జైకొట్టే సామాజిక జై ఆంధ్ర, 2011, 24) అని తెలంగాణ ప్రాంతం అన్ని రంగాల్లో వివక్షకు, దోపిడీకి గురైందనే మాటకు ఈ వ్యాఖ్యలు నిదర్శనమిస్తాయి.

కోస్తా ఆంధ్రా పాలకులు తమ పంట చేల్లను తడపడానికి ఇక్కడి పసిపాపల నోళ్ల ముందటి గుక్కెడు మంచి నీళ్ళను సైతం దొంగిలించుకు పోతున్నారు. (పైదే, 24) ఇక్కడ రచయిత తెలంగాణ ప్రాంతంలోని నల్లగొండ ప్రజలు, పసిపిల్లలు, ఈడొచ్చిన బిడ్డలు ఫ్లోరోసిస్ వ్యాధి బారిన పడి, తమ నిండు వయసును కొల్పోతున్నారు అనే భావనను, వారి జీవిత స్థితిగతులను, తెలంగాణలోని వాస్తవ పరిస్థితులను తెలుపుతున్నారు.

'విశాలాంధ్ర బూటకం, అది పెత్తందార్ల నాటకం', 'సమైక్యాంధ్ర బూటకం అది స్వార్థపరుల నాటకం' అని నినదిస్తూ, తెలంగాణాకు వ్యతిరేకంగా బయట జరిగే దుష్టశక్తుల ప్రయత్నాలకు అడ్డుకట్ట వేసేందుకు ఉద్యమ శక్తులు ఏకం కావాలని ఉ.సా. పిలుపునిచ్చారు. (పైదే, 2011, 111) మెజారిటీ ప్రజల ఆకాంక్షలకు తలవంచని పరిపాలకులను ప్రజలు ఉద్యమాల ద్వారా మెడలు వంచక తప్పదు అని చెబుతూ, 1972 ప్రత్యేకాంధ్ర ఉద్యమం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మద్దతుగా వచ్చినప్పటికి అది సీమాంధ్ర పాలకులు కుట్రపూరితంగా, సమైక్యాంధ్ర ఉద్యమాన్ని రెచ్చగొట్టి రెండు రాష్ట్రాలు ఏర్పాటు కాకుండా అడ్డుకున్నరని, ఇప్పుడు అట్లా కాకుండా 'తెలంగాణకు జైకొట్టు! ప్రత్యేకాంధ్రకు నడుము కట్టు' ఈ వ్యాసం ద్వారా ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలంగాణ ఉద్యమానికి సంఘీభావాన్ని తెలిపినారు.

ఆంధ్రప్రదేశ్ అవతరణ వేడుకలు రద్దు చేయాలని ఓ.యూ విద్యార్థులు, జేఏసిలు సచివాలయ ముట్టడికి పిలుపు నిచ్చారు. ఇట్టి ఉద్యమానికి మద్దతుగా "ఈ నేపథ్యంలో అంబేద్కర్ ఆలోచనా స్ఫూర్తితో సీమాంధ్రలో బడుగు వర్గాల బహుజనులు గుంటూరులో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని" చిన్న రాష్ట్రాల ఆవశ్యకత దినోత్సవంగా జరుపుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి **'అన్నదమ్ముల్లా విడిపోదాం! విడివిడిగా కలివిడిగా ఉందాం!'** తెలంగాణ సీమాంధ్ర రాష్ట్రాల్లో విడివిడిగా హైకోర్టుల్ని, హైకోర్టు బెంచీలను ఏర్పాటు చేసుకుందాం!, **"చిన్న రాష్ట్రాల ఏర్పాటు చిన్న కులాలకు తోడ్పాటు'** అని పిలుపునిచ్చారు. (ప్రత్యేకాంధ్రాలో ప్రజా రాజ్యం, 2010, 45) అని మహాజన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తెలంగాణ ఆవశ్యకతను, చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు, తెలంగాణ – ఆంధ్రా ప్రజల సోదర భావాన్ని **'చిన్న రాష్ట్రాల ఆవశ్యకత దినోత్సవం', 'చిన్న రాష్ట్రాల ఏర్పాటు, బడుగువర్గాలకు తోడ్పాటు'** అనే వ్యాసం ద్వారా తెలంగాణ ప్రజల ఉద్యమానికి మద్దతునిచ్చారు.

మలి దశ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ అమరుడు మారోజు వీరన్న 'సూర్యాపేట డిక్లరేషన్' ద్వారా మొదలు పెట్టినప్పటికిని, 2001 తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఆవిర్భావం తర్వాత ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో తెలంగాణ ప్రజలు భాగస్వాములై, తెలంగాణ ఉ ద్యమాన్ని భుజాన వేసుకొని ఉద్యమిస్తున్న సందర్భంలో ఉద్యమ పార్టీ అని చెప్పుకునే రాజకీయ పార్టీ 'తెలంగాణ రాష్ట్ర సమితి', రాష్ట్ర ప్రజల్ని మోసం చేసి, సాధించుకున్న తెలంగాణాలో మళ్ళీ ఈ దొరల పార్టీయే రాజ్యమేలితే అని, తెలంగాణ ప్రజల పరిస్థితిని అంచనా వేసిన సామాజిక ఉద్యమ కారులు భౌగోళిక, సామాజిక, ప్రజాస్వామ్య తెలంగాణ ఏర్పాటు కావాలని కోరుకుంటూ, 26 మే 2005 బాపట్ల, ఒంగోలు అదే క్రమంలో 1నవంబర్ 2006న ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం హైద్రాబాద్‌లో జరిగిన 'తెలంగాణ మహా జన సమితి'

సదస్సు **'తెలంగాణ రాష్ట్రాన్ని సాధిద్దాం! తెలంగాణలో మహాజన రాజ్యాన్ని స్థాపిద్దాం!'** అని పిలుపునిచ్చింది. (పైదే, 53) రాజకీయ పార్టీల ఎత్తుగడల్ని, నక్క బుద్ధుల్ని గమనించిన సామాజికవేత్త, రచయిత ఉ.సా. గారు ముందే అంచనా వేసి, మాకు దొరల తెలంగాణ కాదు, దోపిడీదారుల తెలంగాణ కాదు, భౌగోళిక, సామాజిక, ప్రజాస్వామ్య తెలంగాణ కావాలని ఈ వ్యాసం ద్వారా తెలంగాణ ప్రజలకు సంఘీభావాన్ని తెలిపారు.

ప్రకటించబడ్డ తెలంగాణ రాష్ట్రాన్ని, అడ్డుకోవడానికి ఆంధ్రా వలస పాలకులు చేయని ఎత్తుగడలు లేవు. అందులో భాగంగానే కమిటీలతో కాలయాపన చేయడానికి, తెలంగాణ ఉద్యమాన్ని నీరు గార్చడానికై వేసిన కమిటీయే 'శ్రీకృష్ణ కమిటీ'. ఈ కమిటీకి ఆంధ్రా, రాయలసీమ నాయకులు ఇచ్చిన రిపోర్టులను, అందులోని అంశాలను గమనిస్తే **'ఉత్తరాంధ్ర ప్రజాహక్కుల పోరాట వేదిక'** తరఫున **'సామాజిక కళింగసీమ'** 'ప్రత్యేక రాష్ట్రం లేదా ప్రత్యేక అభివృద్ధి మండలిని కోరుతూ మరొక మెమొరాండం ఇవ్వడం జరిగింది.' (పైదే, 64) అని ఉ.సా. గారు శ్రీకృష్ణ (కమిటీ) సామాజిక (కుంభ)కోణం అనే వ్యాసం ద్వారా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును, సామాజిక తెలంగాణను, బహుజన తెలంగాణాను అడ్డుకోవాలన్న తీరును, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేసిన ఎత్తుగడలను ఎండగడుతూ, కుండబద్దలు కొట్టినట్లు చెబుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు తన మద్దతును తెలియజేశాడు.

తెలంగాణ బహుముఖీన ప్రాశస్త్యాన్ని సీమాంధ్ర కవులు ఎంతో ఆప్యాయంగా కొనియాడుతున్నారు. తెలంగాణను కన్నతల్లిగా ఆరాధిస్తూ, ప్రజల వీరోచిత పోరాటాన్ని తనివితీరా గానం చేస్తున్నారు. 'జిలుగు వెలుగులు తెలుగు జాబిల్లి' గా, ప్రజా పోరులో పునీతమైన పుడమి'గా, 'సామ్యవాదానికి గుండెకాయ'గా, 'వేలాది అమరత్వాలను పెనవేసుకున్న యోధ' గా, 'చరిత్రలో పోరు కేతనాల విత్తనాలు నాటుకుని, త్యాగాల పంటలన్ని సంచులకెత్తిన వీర మాగాణం' గా, ఉద్యమాల్ని ప్రసవిస్తూ రాష్ట్ర సాధన కోసం తపిస్తున్న పచ్చి బాలెంతరాలు' గా అభివర్ణించారు. (పైదే, 41) 'అన్నదమ్ముల్లా విడిపోదాం.... ఆత్మీయుల్లా కలిసుందాం !' అనే వ్యాసంలో ఉ. సా గారు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును సమర్థిస్తూ, ఆంధ్రా ప్రాంత కవులు తమ కవిత్వం ద్వారా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కోరుతున్న విషయాన్ని ఈ వ్యాసంలో వివరించారు. ఇట్టి మహోజ్జ్వల పోరాటానికి తమ వంతు బాధ్యతగా మేమున్నాం అంటూ ఆంధ్రా ప్రాంత కవులు కూడా తమ తమ వ్యాసాల ద్వారా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి తమ వంతు సంఘీభావాన్ని తెలుపుతూ **'అన్నదమ్ముల్లా విడిపోదాం... ఆత్మీయుల్లా కలిసుందాం!'** అనే నినాదాన్ని ఇస్తున్నారు.



**'అన్నదమ్ముల్లా విడిపోదాం! విడివిడిగా కలివిడిగా కావడి కుండల్లా కలిసుందాం!'** అనే నినాదంతో తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలు ఏర్పడి, రెండు రాష్ట్రాలలో సామాజిక ప్రాతిపదికన ఫలితాలు దక్కాలి. కానీ భూస్వామ్య, పెట్టుబడిదారి వ్యవస్థను కూలదోసి, సామాజిక తెలంగాణ, బహుజన తెలంగాణ ఏర్పాటు చేయాలని ఉత్సుకతతో తెలంగాణ ఏర్పాటుకు సీమాంధ్ర కవులు మద్దతు ఇచ్చిన తీరును ఇక్కడ గమనించవచ్చు.

తెలంగాణ ఆంధ్ర ప్రాంతాల సామాజిక సమస్యల పట్ల అవగాహన కలిగిన సీమాంధ్ర రచయిత "చిన్న రాష్ట్రాల ఏర్పాటు, చిన్న కులాలకు తోడ్పాటు" అనే నినాదంతో ముందుకొస్తున్నారు. ఎందుకంటే 1956 నవంబర్ 1కి ముందు రెండు రాష్ట్రాలు ఎలా ఉన్నాయో అలానే ఉండాలని 'తెలంగాణకు జైకొట్టే, జై సమైక్యాంధ్ర నినాదంతో పాటు, ప్రత్యేక ఆంధ్రాలో సామాజిక ప్రజారాజ్యం' ఏర్పడాలనే ఆశయంతో ముందుకు వెళ్తూ, తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలు వేరు వేరు ప్రగతిని సాధించాలని, తెలంగాణ ఉద్యమానికి సీమాంధ్రకవులు తమ సంఘీభావాన్ని తెలియజేస్తున్నారు.

**ఆధార గ్రంథాలు :**

1. ఉ. సా (సంపా) ప్రత్యేక ఆంధ్రాలో ప్రజారాజ్యం, 2010, అంకుశ్ డిజైన్స్ & ప్రింటర్స్, నల్లకుంట, హైదరాబాద్, 44.

2. ఉ. సా (సంపా) తెలంగాణకి జైకొట్టే సామాజిక జై ఆంధ్ర, 2011, అంకుశ్ డిజైన్స్ & ప్రింటర్స్, నల్లకుంట, హైదరాబాద్, 44.

3. ఎల్లారెడ్డి కర్ర, సలాం తెలంగాణ, 2005, తెలంగాణ సాహితీ 2 – 5449, అదాలత్ వెనుక, సుబేదారి, హన్మకొండ 506001.

3. విద్యాసాగర్. ఏ, నగరానికొచ్చిన నాగళ్లు, 2007, వాసు ఆఫ్ సెట్ ప్రింటర్స్, విజయవాడ.

# ఉపవాసమే విందు భోజనం

ఉపవాసం అనగానే అందరూ రోజూ తినే ఆహారం కాకుండా ఇతర ఉపాహారాలపై దృష్టి పెట్టే కాలం వచ్చింది. శబ్దార్థాన్ని మనం ఎప్పుడో మరచిపోయాం. ఉపాహారాలు కావడం వల్ల రుచికోసం మామూలు కన్నా ఎక్కువగా కూడా భోజనం చేస్తూ ఉన్నాం. అసలు ఉపవాసానికి, ఉపాహారానికి సంబంధం ఏమిటి? భోజనం ఎందుకు చేయకూడదో అర్థం కాని స్థితికి చేరుకున్నాం. అసలు ఉపవాసం ఎప్పుడు ఉండాలి? ఎవరు ఉండాలి? ఎలా ఉండాలో కూడా తెలియకుండా అందరూ ఉపవాస వ్రతాలలో ఉంటున్నారు. కాలగమనంలో ఇది ఆలోచించాల్సిన అంశం. దీనిపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం కూడా ఉంది.

ఉప శబ్దానికి సమీపం అనీ, వస ధాతువుకు ఉండుట అనీ అర్థం. “ఉపవాసం” సమీపంలో ఉండడం అనేది స్పష్టమైన అర్థం. భగవంతునికి అత్యంత సమీపంలో ఉండడానికి నిర్ణయించుకోవడం ఉపవాసం. భగవంతుడు అన్ని చోట్లా అన్ని వేళలా ఉన్నప్పటికీ, మన మనస్సు మాత్రం ఆ భగవంతుని గుర్తించకుండా, కేవలం లోకాన్ని, ప్రాపంచిక వ్యవహారాలను మాత్రమే గుర్తు చేసుకుంటూ ఉంటుంది. మన మనస్సు నిరంతరం దేని సమీపంలో ఉంటుందో దాని ప్రభావాన్ని మనం పొందుతూనే ఉంటాం. కోరికలు, బాధలు, సంసార సంబంధమైన ఒత్తిడులు, ఉద్యోగాదులు, బాధ్యతలు అంటూ... వీటి చుట్టే మనస్సు ఎక్కువగా సంచరిస్తూ ఉంటే ఉన్న శక్తి పూర్తిగా పోతుంది. ఇబ్బందులు క్రమంగా పెరుగుతూనే ఉంటాయి.

మన మనస్సు మన శక్తికన్నా ఉన్నతమైన శక్తి దగ్గర ఉంటే మనకు శక్తి ప్రసారం కలుగుతూనే ఉంటుంది. హాయిగా సంతృప్తిగా ఉంటుంది. మన మనస్సు మన శక్తికన్నా తక్కువ శక్తి ఉన్న అంశాలపై దృష్టిని కేంద్రీకరిస్తే మన శక్తిని మనం కోల్పోతూనే ఉంటాం. మళ్ళీ మళ్ళీ శక్తిని పెంచుకోవాల్సిన, పొందాల్సిన అవసరాలు కలుగుతుంటాయి. ఆ ప్రయత్నం జరుగక పోతే క్రమంగా బలహీనమై, ఇబ్బందులను కొని తెచ్చుకోవడం అవుతుంది. ఈ లోకానికి వచ్చిన ప్రయోజనం పూర్తిగాక, కర్మలు నిర్వహించలేక రోజు రోజుకూ కర్మలను పెంచుకునే జీవితం అవుతుంది.

మనస్సును మన కన్నా ఉన్నత శక్తి దగ్గర నిరంతరం పెట్టే ప్రయత్నమే ఉపవాసం. ఈ దీక్షలో ఉంటే ఇతరాంశాలపై దృష్టి కేంద్రీకరించకుండా, కేవలం భగవంతునిపై దృష్టి పెడుతూ ఉంటారు. ఫోన్ ఛార్జింగ్ పెట్టుకుంటున్నట్లే. ఛార్జింగ్ కన్నా ఎక్కువగా ఫోన్‌ను వినియోగిస్తే మళ్ళీ మళ్ళీ ఛార్జింగ్ పెట్టక తప్పదు కదా! అదేవిధంగా మన మనస్సును మన ఇష్టదైవంపైన, దైవనామంపైన కేంద్రీకరించి నిరంతరం సాధన చేస్తూ ఉంటే మనకు అపరిమితమైన శక్తి కలుగుతుంది. ఈ ప్రక్రియే ఉపవాసం.

ఆహారం, జలం, ప్రాణవాయువులను మనం ఘన ద్రవ వాయు రూపాల్లో ఆహారంగా స్వీకరిస్తూ ఉంటాం. ఆహారాన్ని తయారు చేసుకొని తక్కువ సార్లు తింటాం. జలాన్ని కొంత ఎక్కువ సార్లు సేవిస్తాం. వాయువును నిరంతరం స్వీకరిస్తూ ఉంటాం. ఈ వాయు ప్రక్రియ మన ప్రమేయం లేకుండానే జరుగుతుంది. మన ఇంద్రియాలు ఇంతకన్నా ఎక్కువగా ప్రమేయం లేకుండానే లోక వ్యవహారాలకు సంబంధించిన ఎన్నో అంశాలను స్వీకరిస్తూ ఉంటాయి. దాని వల్ల కలిగేవే ఆలోచనలు. వాటికి ఒక అంతు ఉండదు. వాయువుకన్నా వేగంగా ఆలోచనల ఆహారం వెళ్తుంది. ఘన, ద్రవ, వాయు ఆహార పదార్థాల్లో లోపాల వల్ల శరీరం పాడు అవుతున్నట్లే, వ్యర్థమైన ఈ ఆలోచనల వల్ల ఇంకా ఎక్కువగా పాడు అవుతుంది. ఇటువంటి ఆలోచనలను మనం తగ్గించి, క్రమంగా శక్తి వద్దనే మనసును కేంద్రీకరించడం వల్ల మిగిలిన పదార్థాలను స్వీకరించే అవసరం చాలా వరకు తగ్గిపోతుంది. అదే ఉపవాసం! కేవలం సాధకులకు తాత్కాలికంగా పండ్లు, పాల వంటివి కొద్దిగా స్వీకరించడానికి మాత్రమే, వారి ఆరోగ్యాదుల రీత్యా అవకాశమివ్వడం జరిగింది. ఈ భావనే ఈ కాలంలో దుర్వినియోగం అయి, అపార్థాలు చోటు చేసుకున్నాయి.

మనసును శక్తి వద్ద కేంద్రీకరించే ప్రయత్నం చేస్తున్న క్రమంలో, ఆహారం బాగా స్వీకరిస్తే నిద్రాదులు రావడం వల్ల దైవ సన్నిధిలో ఉండలేక పోతుంది. ఆలోచనల్లో మార్పులు వచ్చి, స్థిరత్వం కోల్పోతూ, శారీరక సుఖాలపై మనస్సు దృష్టి పెడుతుంది. అందుకే సాధారణంగా మనం నిత్యం చేసే భోజనాదులు తగ్గించుకుంటూ, ప్రయత్న పూర్వకంగా మనస్సును దైవ సన్నిధిలో కూర్చోబెట్టే ప్రయత్నం చేయడమే ఉపవాసం. విశ్వశక్తి మన మనస్సు ద్వారా శరీరంలో క్రమంగా నిండిపోతుంటే క్రమంగా సాధారణ భోజన అవసరం తగ్గిపోతూ వస్తుంది. కాల క్రమంలో విశ్వశక్తి మాత్రమే జీవశక్తిగా పరిణమిస్తుంది. అందుకే ఆ ప్రయత్నమే ఉపవాసం. అటువంటి ఉపవాసమే మనకు విందుభోజనం.

# కుందుర్తి కవిత్వం – సూక్తి నిధిత్వం

**డా. అట్టెం దత్తయ్య**, ఫోన్ : 9494 71 5445

జీవితాన్నంతా వచన కవిత్వంకోసం, వచనకవిత్వానంతా సామాన్య మానవుడికోసం అంకితం చేసిన కవి కుందుర్తి. కొన్ని కవితా సంప్రదాయాల్ని, సిద్ధాంతాల్ని తనకు తానుగా ఏర్పచుకుని వాటి అనుసరణతోనే రచనలు చేసినవారు. వీరి కవిత్వంలో సంప్రదాయ ముద్ర, అభ్యుదయవాద ప్రభావం, అనుభూతివాద ప్రస్తరణ, మానవతావాద విస్తరణ, ధ్వని, వ్యంగ్యం, సూక్తినిధిత్వం వంటి అంశాలు పుష్కలంగా కనిపిస్తాయి.

'సూక్తి' ప్రస్తావన తెలుగు సాహిత్యంలో నన్నయనాటి నుండే ఉంది. "నానారుచిరార్థ సూక్తినిధి..." అంటూ భారతావతారికలో నన్నయ భారతం సూక్తులకు నిధి వంటిదన్నాడు. అంతేకాదు అనేక విధాలైన, రుచిరాలైన అర్థాలను ప్రకటించే సూక్తులకు కావ్యం నిధి కావాలని అర్థం చేసుకోవాలి. నన్నెచోడుడు కుమారసంభవ కావ్యావతారికలో **"నక్షరములు సూక్తులార్యులకుఁగర్ణ రసాయన లీలఁగ్రాలగన్" (1-35), "మృదురీతి సూక్తులింపొదవింప..." (1-36)** అంటూ సూక్తి లక్షణాలను వ్యక్తపరిచాడు.

**"సూక్తులన సుభాషితములనియే గాక సామెతలు, నానుడులు, జాతీయములు (పదగతములు, వాక్యగతములు) నీతిబోధకములు మున్నగునవని కూడ విశాలమైన యర్థమును గ్రహించవచ్చును"** ( దివాకర్ల. నన్నయ భారతము. పు.46) అని దివాకర్ల అభిప్రాయ పడినట్లు కొన్ని సూక్తులు సామెతలుగాను, నానుడులుగా, జాతీయాలుగా స్థిరపడిపోతాయి. ఇలాంటి సూక్తివాక్యాన్ని రాయగల శక్తి ఎంతో జీవితానుభవం ఉంటే తప్ప సాధ్యం కాదు. **"సూక్తి యనగ అనుభవ పరిపాకములో గ్రహించిన జీవన సత్యములకు చెందిన లోకోక్తులనియు గ్రహించుట మేలు"** (ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి. సారమతి నన్నయ. పుట.113) అందరి కవితా వాక్యాలు సూక్తులు కానేరవు. అవి సర్వకాలీన, సమకాలీనాలై ఉండాలి. వ్యక్తిగతాలైన వాక్యాలు, సంఘటనాత్మకమైన వాక్యాలు సూక్తులుగా స్థిరపడడానికి అవకాశం లేదు. ఈ సూక్తులను గురించి కొందరు సాహితీకారులు వారి వారి అభిప్రాయాలను ఇలా వ్యక్తపరిచారు. **"సూక్తి యనగ మంచి మాటలనియు యర్థము"** (సముద్రాల నాగయ్య. సాహితీ సుధాలహరి.పు.23). **"సూక్తి యనగ మంచి మాట. అది మానవుని మంచితనమునకు చక్కని రాచబాట. రుచిరమైన యర్థముతో కూడిన సూక్తులు, మధురములైన యౌషధముల వంటివి. అవి గ్రహింపబడునపుడు గాని సేవించిన పిమ్మట గాని యెట్టి వికారమును బుట్టింపక మానసారోగ్యమును బరిరక్షించి మానవునకు సౌమనస్యమును సంధానించును..."** (శలాక రఘునాథ శర్మ. భారత ధ్వని దర్శనము.పు.256). **"సూక్తి యనగా రుచిరమైన చమత్కారయుక్తమైన కూర్పు అని గ్రహింతము. ఈ చమత్కారము ఒక్కొక్క పదమునందు పదబంధము నందు, సమాసమునందు కారకమునందు వాక్యమునందు బహుభంగుల చూడవచ్చును"** (ఖండవల్లి లక్ష్మీరంజనం. లక్ష్మీరంజన వ్యాసావళి. పు.4.) **"సూక్తి యనగ పరిష్కృతమైన వాక్కు"** (ధూళిపాల శ్రీరామ మూర్తి. నన్నయభట్టు కావ్యసిద్ధాంతము. భారతి, మే,59. పు.77. **"అర్థవంతమైన ప్రతిశబ్దము ఉక్తియే. అది యొక ధర్మమును గాని, నీతిని గాని, సత్యసన్నిహితమగు నొక విశిష్ట విషయమును గాని, తత్త్వభావోచితమగు ఔపదేశిక ప్రతిపత్తితో నిర్వచించునెడల సూక్తియగును"** (యస్వీ జోగారావు. బాణభట్టారకుని సూక్తి వైచిత్రి. భారతి మార్చి 62. పు.62) ఈ వాక్యాలు




ఆధారంగా సూక్తుల స్వరూప స్వభావాలతోపాటు, లక్షణాలను, నిర్మాణాన్ని, ఉపయోగాలను, వాడుక విధానాన్ని తెలుసుకునే అవకాశం ఉంది. ఈ పండిత పరిశోధకులు సూక్తులకు గొప్ప స్థానాన్ని ఇచ్చారు. సూక్తి అంటే **'మంచిమాట'**అని, **'పరిష్కృతమైన వాక్కు'** అని, **'రుచిరమైన చమత్కార యుక్తమైన కూర్పని'** కొనియాడారు. అంతేకాదు అర్థవంతమైన ప్రతి శబ్దము సూక్తి అన్నారు. కాని ఆ సూక్తిలో ధర్మం, నీతి, సత్యం, ఉపదేశం అనే వాటిలో ఏదైనా ఉండాలంటారు. ఇందులో ఏ ఒక్కటున్న ఆ సూక్తి ఔషధం వంటిదంటున్నారు. సుభాషితాలు మానవులకు ఏ విధంగా తోడ్పడుతాయి అని ప్రశ్నించుకున్నపుడు వీరి మాటలను మననం చేసుకోవాలి. **"బలహీనులకు బలము, భీరువునకు ధీరత్వమును, దుఃఖితునకు సంతోషమును, లోభికి ద్యాగమును, దేశద్రోహికి దేశాభిమానమును, స్వార్థపరునకు బరోపకార బుద్ధి యును, ద్వేషబుద్ధికి ప్రేమయును, విరోధుల కన్యోన్యమైత్రియును గలిగించునవె సూక్తులు"** (సూక్తిరత్నాకరము – పెనుమెత్స సత్యనారాయణరాజు) అంటారు.

విస్తృత కవిత్వాన్ని సృజించిన కుందుర్తి కవిత్వంలో సూక్తి ప్రాయమైన వాక్యాలు కోకొల్లలు. అవి లోక స్థితిగతుల్ని ఒకటి, రెండు పాదాలలో చక్కని సూక్తులుగా పేర్కొన్నాడు. ఆదర్శభావజాలం, వచనకవితా అకుంఠిత సామర్థ్యం వల్ల వారి వాక్యాలు సంక్షిప్తంగా, సూక్తులుగా పరిఢవిల్లాయని అనుకోవచ్చు.

కుందుర్తి దృష్టిలో వచనకవిత్వం అంటే ప్రజల కవిత్వం. ప్రజల వాడుకలో ఉన్న భాషను, అర్థాల్ని, అలంకారాల్ని గ్రహించి తెలుగు పలుకుబళ్ళ సొగసులతో నుడికారపు సొంపులతో తన వచన కవిత్వాన్ని నిర్మించుకొన్నాడు. కుందుర్తి వచన కవిత్వం శబ్దాడంబరాన్ని, అలంకార భారాల్ని, సుదీర్ఘ వర్ణనల్ని తిరస్కరించి, సహజమైన, సరళమైన, సుందరమైన శైలిలో ప్రజల స్థాయిలో సాగింది. **"ప్రతి కవితావాక్యాన్ని శిల్పనిష్ఠతో హృదయంగమంచేసి, ఆధునిక కవిత్వంలో రసస్ఫూర్తికి మారుపేరు గావించిన కవి కుందుర్తే"** (సోమసుందర్, ఆధునిక కవితా రసస్ఫూర్తి శ్రీకుందుర్తి, కుందుర్తి సన్మాన సంచిక.పు.15) అంటూ ఎందరో గొప్పవారితో మంచి కితాబును అందుకున్నవారు కుందుర్తి.

మానవ జీవితాన్ని, మనుషుల ప్రపంచాన్ని బాగా చదివిన కవిగా కుందుర్తి జీవితం గురించి స్ఫూర్తిప్రదమైన పాదాలు వారి కవిత్వంలో ఎక్కువసార్లు కనిపిస్తున్నాయి. ప్రపంచంలో జీవితంకంటే మించిన భాగ్యం లేదు. జీవితం మిక్కిలి పావనమైంది. చైతన్యయుతమైంది. మధురమైంది. ఉత్తమప్రాప్తికి హేతుభూతమైంది. జీవితం ప్రవృత్తి జనకం. అనగా ఊరక ఉండునది గాక కర్మప్రేరకమైంది.

**"నిజానికి మరి బ్రతుకేమిటి ఆట కాక?**
**దినదినగండంగా పాడే అపశ్రుతుల పాట కాక?"**
(ఇది నా జెండా.32)

**"మనిషే శాశ్వతం కాదుగదా మరి**
**సమస్యలు శాశ్వతమా**
**వస్తుంటాయి పోతుంటాయి"** (ఇది నా జెండా.పు.44)

ఆడిన ప్రతివ్యక్తి గెలవచ్చు ఓడవచ్చు. పాడిన ప్రతి గాయని, గాయకుడికి శ్రుతి కలువచ్చు కలువకపోవచ్చు. విజయాన్ని కాంక్షించి, ఆనందాన్ని ఆకాంక్షించి ఆడుతాం పాడుతాం. కాని దాని ప్రతిఫలం మన చేతుల్లో లేదు. జీవితం కూడా అలాంటిదే అంటున్నాడు కవి. మనిషికి సమస్యలు కూడా గెలుపోటములవంటివే. వస్తుంటాయి పోతుంటాయి. కొన్నింటిని మనిషి సమస్యగా భావిస్తాడు. కొన్నింటిని భావించడు. దానినే పట్టుకుని పదే పదే ఆలోచించేవారికి ఆ సమస్య మరింత పెద్దగ కనిపిస్తుంది. పై పంక్తులను అనుభవిస్తేనో, ఎదుర్కుంటేనో తప్ప రాయలేము.

**"నాలుగు రాళ్ళు చేతిలో పడితే**
**నాగం అంటారు లోకాన్ని**
**నాలుగు రోజుల వ్యవధానమైతే**
**నరకమంటారు లోకాన్ని..."** (కుం.కృ.పు.277)

పైస చుట్టే ప్రపంచం అంతా తిరుగుతుంది. పైసతోనే మనిషి ఆలోచనల్లో కూడా మార్పులు వస్తాయి. మనిషి అల్పసంతోషి, అల్ప విరాగి. చేతిలో పైసలుంటే మనిషికి స్వర్గంగా కనిపించే ఈ లోకం పైసలు లేనినాడు నరకంగా కనిపిస్తుంది. అంటే మనిషి ఆలోచన అవసరాలకు అనుగుణంగా ఆలోచిస్తుంటాడు.

**"జీవితం చెరసాల**
**బ్రతుకు బంధిఖానా"** (కుం.కృ.పు.159)

**"నేడు బ్రతుకు గాఢ నిద్రలో కలిగిన పీడ కల"** (కుం.కృ.పు.223) జీవితాన్ని ఎంతగా అంచన వేసుకున్న వారికి అంతగా అవగతం అవుతుంది. సంసార వ్యామోహంలో మునిగిన ప్రతిజీవి జీవితం చెరసాలె. ఈ రెండింటిలో ఏదో ఒకటి లేని ప్రాణి ఎందుకుంటుంది. అయినప్పటికి ప్రతివ్యక్తికి చివరలో మాత్రం జీవితం చాలా చిన్నది అని చెప్పుకోవల్సిందే. మరణం ఎప్పుడో పసిగట్టలేని మనిషి జీవితం పీడకల వంటిదేగా.

**"రోజులు గడిచినకొద్ది జీవితం**
**వేపాకు నమిలినట్లుండాలి"** (కుం.కృ.పు.506) జీవితం ప్రారంభమైన స్థాయి నుండి పైకే ఎదగాలి గాని కిందికి కాదు. అనుభవం నుండి పాఠాలు నేర్చుకోవాలి కాని వైఫల్యాలు కాదు. ఉన్నతంగా ఎదగడానికి ప్రతీకగా వాడిన వాక్యమే వేపాకు నమిలినట్లుండాలనేది. వేపాకు తినగానే చేదుగా అనిపిస్తుంది. కాని తినడం అలవాటు పడితే తీయగా ఉంటుంది. జీవితంలో కూడా సర్దుబాటు, ఓపిక వంటిది వుండాలని తెలియజేస్తుంది ఈ వాక్యం.

ఎంతటివారైనా కాలాన్ని నమ్మాల్సిందే. కాలం కనుసైగలో కాలు కదపాల్సిందే. కాలాన్ని అధిగమించి అడుగేసిన, ఏ ప్రాణి మనుగడ సాగించలేదు. కుందుర్తి కూడా చాలా కవితల్లో కాల ప్రస్తావన చేసిన తీరును చూడవచ్చు.

**ఉదయాస్తమయాల వంటి**
**జనన మరణ సంధ్యల చివళ్ళకు**
**అంటుకుని పరిమితమైనట్లు**
**కంటికి కనిపిస్తుంది కాలం! "** (కుం.కృ.పు.372)

కవికైనా, శాస్త్రవేత్తకైనా కాలం ఒకటే. అలల వంటి ఈ కాలం ప్రతి జీవితాన్ని ఒక్కసారైనా అతలాకుతలం చేస్తుంది. ఎవరికి తెలియని, దొరకని అమూర్త అంశం ఈ కాలం. ప్రతి శ్రమ వెనుక ఒక విజయం అందిస్తుంది కాలం. అది రహస్యపు అంశం. అందుకే...

**"సుఖ దుఃఖ చక్రాల సుందర రథమెక్కి**
**జీవితపు చీకటి చివరి సందులలోకి**
**వెలుగు రవ్వలు విసిరి వేస్తూ విహరిస్తుంది కాలం!"**
(కుం.కృ.పు.374) అంటాడు కవి.

**"మనుషుల్లేని యింట్లో వెలుగుతున్న దీపంలా**
**అన్నింటిలో అవిశ్వాసంతో**
**ఖర్చైపోయిందా కాలం"** (కుం.కృ.పు.479)

మనిషికి తనమీద, తను చేస్తున్న పనులమీద విశ్వాసం చాలా తక్కువ. ఎదుటివారి మీదే నమ్మకం. తనను తాను నమ్ముకున్న వ్యక్తి తన శక్తి సామర్థ్యాలతో దేనికోసమైనా ప్రయత్నిస్తాడు. విశ్వాసం లేనితనంతోనే కాలాన్ని చాలా వరకు వృధా చేసుకుంటాడు. వృధా అనకుండా ఇక్కడ 'ఖర్చైపోయింది' అంటారు. ఖర్చుకావడం అంటే తన చేతిలో ఉన్నదానిని పోగొట్టుకోవడం అని గమనించవచ్చు.

**"కాలం జీవనదిలా పరుగెడుతుంది**
**మనిషి బ్రతుకు కడివెడు నీళ్ళు"** (కుం.కృ.పు.465) అంటారు మరోచోట. ఇలాంటి కాల సంబంధ పంక్తులను కుందుర్తి కవిత్వంలో కోకొల్లలుగా చూడవచ్చు.

కుందుర్తి కవిత్వంలో ప్రేరణ నింపే పదాలను కూడా గమనించ వచ్చు. కవిత్వ ఉద్యమాన్ని చురుగ్గా నడిపించి ఎందరినో కవిత్వం వైపు మరల్చి, తీర్చిదిద్దిన కుందుర్తి ప్రేరణాత్మకమైన వాక్యాలు రాసాడు.


**"మత్తుగా ఆలోచించడం మొదలిడితే**
**మనకు త్రోవ కనిపించదు**
**ఎత్తుగా ఆలోచించడం నేర్చుకుంటే**
**ఏదీ పెద్ద సమస్య కాదు "** (కుం.కృ.పు.177)

ఎవరి ఆలోచన ఉన్నతస్థాయిలో ఉంటే వారు ఉన్నతంగా ఎదుగగలరు. మత్తుగా ఆలోచించే వారు ఎత్తుగా ఎదగడం కష్టం. మత్తుగా ఉన్నవారు బద్ధకంగా ఉంటాడు. బద్ధకంగా ఉన్నవాడు ఏ పనిని సకాలంలో చేయలేడు. సకాలంలో పనిని పూర్తిచేసుకోలేని వారికి ప్రతిదీ సమస్యగానే కనిపిస్తుంది. మత్తు వదిలిన మనిషికి సమస్య అనేదే లేదు.

**"ఆశయాల అరమైలు పరుగుపందెంలో**
**వ్యవధిని తగ్గించిన వాడే వీరుడు**
**చీకటి సర్కస్‌లో బాధల తాళ్ళమీద**
**గొడుగు నడక నడిచిన వాడే ధీరుడు"** (కుం.కృ.పు.98)

జీవితాన్ని చీకటి సర్కస్‌తో పోల్చుతున్నారు. సర్కస్ అంటే అన్ని విన్యాసాలు చేయడమే. మనోధైర్యంతో ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని అలరింపచేయడమే సాహసికుల పని. వారే ధీరులు. ఆశయాన్ని నెరవేర్చుకోవడానికి వ్యవధిని తగ్గించుకోవడం అంటే ఒక పథకం ప్రకారం వెళ్ళడం.

**"మనకాలం అలాంటిది;**
**అనుమానాలు మెండు**
**ఎవడూ ఎవణ్ణీ నమ్మడు**
**కంట్లో చల్లుతాడని భయపడి, కొట్టువాడు**
**ఇంకో కులానికి కారం అమ్మడు"** (కుం.కృ.పు. 231)



నేటి కాలం మనుషుల మనస్తత్వాన్ని ఆవిష్కరించే వాక్యాలు ఇవి. కుల రాజకీయాలలో కూరుకుపోతున్న ఈ సమాజం ఏ వంకతో ఎవరిని ఎంత వేధిస్తాడో అర్థం కాని రోజులివి.

కుందుర్తి మనుషులను లోతుగా చదివినవారు. అందుకే..

**"ఒక చేత గండ్ర గొడ్డలి**
**మరో చేత పుష్పం**
**మనిషి రూపే విచిత్రం"** (కుం.కృ.పు.575)

సమాజంలో ఎన్ని విచిత్రమైన మనుషులంటారని చెప్పడానికి ఈ వాక్యాలు సరిపోతాయి. ఎంతటి రణరంగాన్ని, రక్తపాతాలను సృష్టించే మనుషులున్నారో అంతటి శాంతిపూరిత వాతావరణాన్ని కల్పించిన వారు కూడా ఉన్నారు. మనిషి ఒక్కటే కాని మనస్తత్వాలు విచిత్రం.

**"మాటలు చెప్పే పద్ధతిలోనే మార్పు వచ్చింది బాగా**
**మనిషి మనసు మాత్రం యథాప్రకారం కోతిలాగా!"** (ఇది నా జెండ.పు.9) నీతులు చెప్పేవారు అధికమయ్యారు. అనుసరణ మాత్రం వారి దగ్గర కూడా కనిపించదు. అందుకేనేమో కుందుర్తి మనిషిని కోతితో పోలుస్తున్నాడు. లోకం కూడా మాయలమారి మనుషులనే నమ్ముతుంది. కల్లబొల్లి మాటలతో కబుర్లు చెప్పుతూ మోసపూరితమైన ఆలోచనతో ఇతరుల శ్రమను దోచేవారే అధికమౌతున్నారు. సమాజం అలాంటి వారినే ...



వచన కవితా పితామహుడు-కుందుర్తి

**"ఒక అవకాశవాదపు గొడుక్కింద**
**వందమంది యిరుక్కొంటారు"** (కుం.కృ.పు.504)

అవకాశం ఏ మాత్రం కనిపించిన చాలు. తప్పించుకోవడానికి తప్పుచేయడానికి అది మనిషికి స్వభావంగా మారింది.

**"లోకాన్ని ప్రళయ భీతి మార్గాలు పట్టించినా**
**అధర్మం విజయాన్ని చూరగొనలేదు"** (కుం.కృ.పు.93)

ఏ సిద్ధాంతాన్ని నమ్ముకున్న ధర్మాన్ని నమ్ముకోనివారు ఉండరు. ధర్మమే జయిస్తుంది. ఈ విషయాన్ని కుందుర్తి రెండు పంక్తుల్లో వివరించారు.

కవిత్వానికై తపించిన కుందుర్తి కవిత్వం ఎలా ఉండాలి. ఎవరి కోసం రాయాలి. దాని గొప్పతనం ఏమిటి అనే విషయాలు చాలా సందర్భాలలో కవితా వాక్యాలలో చెప్పారు.

**"పుట్టని ఒక భవిష్యత్తులోకి**
**పుట్టెడు వూహాల చేతులు చాచి**
**అక్కడి అందాలు చందాలు**
**ఆవిష్కరించటం కవిత"** (కుం.కృ.470)

దూరదృష్టి, ఊహ, అనంతమైన భావనాశక్తి కవి స్వంతం. కవి భావన పుట్టిన తర్వాత భవిష్యత్తు పుడుతుంది.

**"నిజమైన జనధర్మం పలికే నోరు**
**లోకంలో కవిది ఒక్కటే**
**నిజమైన జనధర్మం పలికే తీరు**
**లోకంలో కవిత ఒక్కటే"** (కుం.కృ.పు.400)

కవిత్వం అంటే నిజమైన జనధర్మం పలకాలి అంటున్నారు. భజన పరులైన కవులను వదిలేస్తే, అధికశాతం కవులు ఈ నిబంధనకు కట్టుబడే ఉంటారు.

బాల్యం మధురమైన అనుభూతి. అందరు అనుభవించి, ఆస్వాదించింది. మళ్ళీ తిరిగివస్తే బాగుండు అని కోరుకుని జ్ఞాపకాలు. అటువంటి పసివాడు ఇంట్లో ఉండాలనే ఆరాట పడుతుంటాం. ఆ పసివాడిని బంగారంతో పోల్చు పలికిన వాక్యాలు.

**"పసివాడు యింటిల్లిపాదికీ**
**కొనకుండా దొరికిన కనకం"** (కుం.కృ.పు.429)

తెప్పలుగ చెరువు నిండిన కప్పలు పదివేలు చేరు గదరా సుమతీ! అన్నట్లు చుట్టాలను మరో కొత్త పోలికతో ఆవిష్కరించారు.

**"వచ్చిపోయె చుట్టాలు**
**ప్రవాహాల నీటి మట్టాలు"** (కుం.కృ.పు.226)

రాజకీయ వ్యవస్థమీద ప్రతి మనిషి విసిగిపోయాడు. అబద్ధాలు అంటేనే నాయకులు. మాటలకు చేతలకు పోలిక అందనివారు. అందుకే కుందుర్తి వారి మాటలు జీర్ణంకాక జ్వరం వస్తుంది అంటున్నారు.

**"నాయకుల వాగ్దానాలు జీర్ణం కాక**
**జాతికి జ్వరం వస్తుంది"** (కుం.కృ.పు.280)

**"పోయే ప్రభుత్వాలు సాగించే వేట**
**కాబోయే ప్రభుత్వాల వాగ్దానాల మూట**
**ఇది ఉషస్సులో ముగిసే తోలుబొమ్మలాట"** (కుం.కృ.పు.250)

పోయే ప్రభుత్వాల వేట అంటే దోపిడి. వాగ్దానాల మూట అంటే హామీలు. అసలు ప్రభుత్వాలు ఒక తోలుబొమ్మలాట.

**"మన బంగారం మంచిదైతే**
**ఏ నగైనా చేయించొచ్చు"** (కుం.కృ.పు.319)

ప్రతిమనిషి అన్వయించుకోవల్సిన వాక్యం. జడత్వం వదలకుండా వ్యవస్థలను, సంస్థలను, నాయకులను, పాలకులను తిట్టుకుంటూ కూర్చుంటే మార్పురాదు. ఈ విషయాన్నే కుందుర్తి..

**"జడతకు చైతన్యం రాంది**
**జనతకు విముక్తి లేదు"** (కుం.కృ.పు.280)

**"కాలం ఒకవేళ ఆగినా / కవిత్వం ఆగదుకదా!"**
(కుం.కృ.పు.469)

అని విశ్వసించి కవిత్వంలో ఒక సంచలనాన్ని సృష్టించినవాడు కుందుర్తి. వారి కవిత్వంలో వైవిధ్యపూరితమైన అంశాలు చోటు చేసుకున్నప్పటికి కొన్ని వాక్యాలు పాఠకులకు హత్తుకునేలా ఉన్నాయి. అవి సూక్తులుగా అన్ని రకాలవారిని తలపిస్తాయి. ఈ వాక్యాలు అజరామరంగా తెలుగు ప్రజల్లో నిలిచిపోతాయి.

(డిసెంబర్ 12న కుందుర్తి శతజయంతి)

# ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా – గిరిజన జాతరలు, పండుగలు

**మునేశ్వర్ చంద్రకాంత్,** పరిశోధక విద్యార్థి, శ్రీశైలం, ఫోన్ : 9989538243

కుటుంబ వ్యవస్థ, విలువలకు ప్రాధాన్యత ఇవ్వడం భారతీయ సంస్కృతి ప్రత్యేక లక్షణం. గిరిజన సాంస్కృతిక వైభవం గురించి ఎంతమంది ఎన్నిసార్లు రాసినా ఇంకా రాయవలసింది చాలా ఉందనిపిస్తూ ఉంటుంది. అట్లాగే ఎంతోమంది ఎన్నో పరిశోధనలు చేసినా ప్రతిసారి కొత్తకోణం కనిపిస్తుంది. గిరిజన సంస్కృతి ఎంతో పురాతనమయినది, విస్తృతమైనది కూడా. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటేనే ఆదివాసీలకు పెట్టింది పేరు. వివిధ తెగల రూపంలో జీవిస్తున్న వారి ప్రత్యేకతలు అన్నీ ఇన్నీ కావు. వారి సంస్కృతి సంప్రదాయాలూ అందరికీ ఆశ్చర్యం కలిగించేవే. కొండా కోనల్లో జీవనం.. నిండైన అమాయకత్వం.. రాజకీయాలు తెలియని మనస్తత్వం.. ప్రతి నెలా పండుగలు.. పండుగలకు అనుగుణంగా ప్రత్యేక పూజలు.. అందుకు తగ్గట్టుగా వేషధారణ.. ఇదీ ఆదివాసీ గిరిజనుల ప్రత్యేకత. మానవ జీవితం ముఖ్యంగా ప్రకృతిపై ఆధారపడి వుంటుంది. ప్రకృతిలో వచ్చే మార్పులకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకోవడం పండుగల ఏర్పాటులో ముఖ్యమైన ఉద్దేశం. నోములు, వ్రతాలు, ఉత్సవాలు, పర్వాలు, పండుగలు అంటూ వాటికి మనం పేర్లు పెట్టుకుంటున్నాం. ఈ దేశంలో సంవత్సరం మొత్తం ఏదో రూపంలో ఏదో ఒక పర్వం నిర్వహిస్తూనే వుంటారు. ఈ విలువలను పరిరక్షించడంలో, ప్రోత్సహించడంలో పండుగలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. పండుగలు జరుపడంలో స్త్రీలదే ప్రముఖ పాత్ర అయినా ఆబాల వృద్ధులూ పాల్గొంటుంటారు.

### ప్రకృతే వారి ఆరాధ్యదైవం

భూమి.. ఆకాశం.. నీరు.. నిప్పు.. చెట్టు ఇవే వారి ఆరాధ్య దైవాలు. అడవి, సెలయేర్ల పరివాహకాలే వారి నివాసయోగ్యాలు. చల్లంగా చూడమ్మా అంటూ మూడేళ్లకోమారు జరుపుకొనే కొలుపులు పుడమి తల్లి కరుణకోసం ఏడాదికోమారు జరుపుకొనే భూమి పండుగలు .. స్వేదం చిందిస్తూ చేసిన సేద్యం చేతికందాలంటూ వరుణుడి కటాక్షం కోరుతూ చేసే జాతర.. చివరకు చేతికందిన పంట తినాలన్నా ఊరంతా ఒకటై చేసే పచ్చల పండుగ ... ఇలా ఒక్కటేంటి ప్రతి పనికి ముందు వారు తమ ఆరాధ్య దైవాలను కొలవనిదే ఏ పనీ ముట్టరు. అనాదిగా ప్రకృతినే నేస్తంగా చేసుకుని స్వచ్ఛమైన జీవనం గడుపుతున్న గిరిజనం వారి సమాజంలోని సంప్రదాయాలను కొనసాగించలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. దారి లేని అడవుల్లో ఆనందం ఉంది.



### భారతదేశంలో గిరిజన జనాభా

మన దేశంలోని మొత్తం జనాభాలో గిరిజనులు 8.6% ఉన్నారు. భారతదేశంలో సుమారు 10 కోట్ల మంది గిరిజనులు నివసిస్తున్నారు. పురాతన కాలంలో, గిరిజనులను అట్విక మరియు వాన్యాసి అని కూడా పిలుస్తారు.తెలంగాణ రాష్ట్రంలోని మొత్తం గిరిజనుల సంఖ్య సుమారు 35 లక్షలు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా 2011 జనాభా లెక్కల ప్రకారం సుమారు 4 లక్షల 95 వేల 794 మంది ఆదివాసీ గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. అయితే లంబాడా (బంజార)లను ప్రభుత్వం 1977 సంవత్సరంలో గిరిజనులుగా గుర్తించడంతో ఆనాటి నుంచి వీరు గిరిజనులుగా గుర్తింపు పొందారు. గోండులు, కొలాంలు, మన్నెవార్, తోటి, ప్రధాన్లు, నాయకపోడ్, ఆంద్, కోయా.. ఇతర జాతులను ఆదివాసీలుగా వ్యవహరిస్తుండగా వీరిలో కొలాం, మన్నెవార్, తోటి తెగలను పీటీజీ (ఆదిమ గిరిజన తెగలు)గా వ్యవహరిస్తారు. గిరిజన సాంప్రదాయ పెద్దల ఆధ్వర్యంలో జరిగే ఈ జాతరలలో గిరిజనులు, గిరిజనేతరులు కలిసి సుమారుగా కొన్ని లక్షలమంది పాల్గొంటారు. జిల్లాలో 9 జాతులకు చెందిన గిరిజన తెగల వారు నివసిస్తున్నారు. వీరిలో అధిక శాతం గోండులు ఆ తర్వాత లంబాడీలు, కొలామీలు, కోయలు, పర్ధాన్లు, అంద్‌లు, తోటీలు, చెంచులు, భిల్లులు నివసిస్తున్నారు. ఈ జిల్లాలో 17 శాతం గిరిజనులు జీవించగా మొత్తం 4,95,794 మంది గిరిజనులు ఉన్నారు. వీరిలో లక్షా 63 వేల మంది గోండులు, లక్షా 12 వేల మంది లంబాడీలు, 38 వేలమంది కోలాంలు, 30 వేల మంది కోయలు, 26 వేల మంది పర్ధాన్‌లు, 30 వేల మంది అందాలు, రెండు వేల 2 వందల మంది తోటిలు, 100 మందికి పైగా చెంచులు, భిల్లులు నివసిస్తున్నట్లు రికార్డులు చెబుతున్నాయి.

### ప్రపంచ గిరిజన దినోత్సవం

9 ఆగస్టు 1982న, గిరిజనుల ప్రయోజనార్థం ఐక్యరాజ్యసమితి ప్రతి సంవత్సరం ఆగస్టు 9 ని ప్రపంచ గిరిజన దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించారు. గిరిజన అనే పదం యొక్క చరిత్ర ఆది మరియు వాసి అనే రెండు పదాలతో రూపొందించబడింది. దీని అర్థం స్థానిక భారత రాజ్యాంగంలో ఆదివాసులను 'షెడ్యూల్డ్ తెగలు' అని పిలుస్తారు. బోడో, భిల్, ఒరాన్, పర్ధన్, ఖాసి, సహారియా, సంతల్, మీనా, జాట్, గోండ్, ముండా, ఖాడియా, హెూ, బిర్హోర్, పార్ధి, ఆంధ్ర, మల్హార్ కోలి, తకనాకర్, తోకరే కోలి మరియు మహాదేవ్ కోలి మొదలైన అన్ని తెగలు. గిరిజనుల యొక్క ప్రత్యేక విషయం ఏమిటంటే వారు ప్రధానంగా జంతువులు, నదులు, పొలాలు మరియు పర్వతాలు వంటి సహజ వస్తువులను ఆరాధిస్తారు. ఇది హిందూ మతంలో అంతర్భాగం అయినప్పటికీ. అన్ని పండుగలు దీనిని జరుపుకుంటాయి.

### గిరిజన పండుగలు

సంప్రదాయాలు లేకుండా ప్రయోగాలు లేవు. జనసమూహంలో నిలిచి ఉన్న నమ్మకాలు, సంప్రదాయాలు క్రియారూపాన్ని దాల్చగా పండుగలేర్పడ్డాయి ఆదివాసీ గిరిజనులు సంవత్సర కాలంలో నిర్వహించుకునే పండుగలు ప్రత్యేకంగా ఉంటాయి. చైత్రమాసం(ఏప్రిల్)లో చెంచు భీమన్న మెర్మి పండుగతో వ్యవసాయ పనులు ప్రారంభిస్తారు. వైశాఖ(మే)లో పెర్సాపెన్ పూజలు చేస్తారు. జ్యేష్ట మాసం(జూన్)లో విదిరి మొహుతుక్ పండుగతో ఆకి దేవర వద్ద జొన్నలతో నైవేద్యం సమర్పిస్తారు. ఆషాఢం(జులై)లో ఆకిపెన్ పండుగతో పంట చేలల్లో కలుపుతీత పనులు ప్రారంభించడంతో పాటు పంటల దిగుబడులు పెరగాలని పచ్చదనం సంతరించుకున్న అడవితల్లి చల్లంగా చూడాలని వేడుకుంటారు.

శ్రావణం(ఆగస్టు)లో బంజారాలు తీజ్ పండుగ, ఆదివాసీలు శ్రావణమాసం చివరలో పొలాల పండుగ, జాగేయ్ మాతరీ జాగేయ్ పండుగలు నిర్వహిస్తారు. భాద్రపదం(సెప్టెంబర్)లో పెత్రమాస(పెద్దల పండుగ), ఆశ్వీయుజ(అక్టోబర్)లో దండారీ, మృగశిర(డిసెంబర్)లో కొత్త పంటలు ఇంటికి వచ్చే సందర్భంగా సెట్టి పండుగ జరుపుకుంటారు. ఇవేకాకుండా కాలాన్ని బట్టి దురాడి, మరుగోళ్ల ఉత్సవం, దాటుడి పండుగలతో పాటు దసరా, దీపావళి, ఉగాది, హెూలీ తదితర పండుగలను ఘనంగా చేస్తారు.

### సీతల్ (సీత్లా) పండుగ

దీనిని బలుల పండుగగా పిలుస్తారు. ఈ పండుగను ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో జరుపుకుంటారు. ఒకరోజు ముందుగా నానబెట్టిన జొన్నలు, పప్పుధాన్యాలు కలిపి తయారు చేసిన ఘుగ్రి (గుగ్గిళ్ళను) కన్నెపిల్లలకు (సీత్లా)కు సమర్పిస్తారు. సకాలంలో వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని కోరుకున్నారు. ఆడపిల్లలు సంతోషంగా వుండి వివాహాలు జరగాలని, పశుపక్ష్యాదులు ఆరోగ్యంగా ఉండాలని గ్రామ దేవతలను పూజిస్తారు.

### తీజ్ పండుగ

బంజారా యువతులు తండావాసుల సహకారంతో చేసుకునే పండుగ తీజ్. బంజారా కవులు వర్షాకాలంలో జరుపుకుంటారు. ఈ పండుగను తొమ్మిది రోజులు జరుపుకుంటారు. తీజ్ మొక్కలను గౌరవప్రదంగా అలంకరించే కార్యక్రమం తీజ్తోడారో అంటారు. నార బుట్టల్లో నవధాన్యాల మొలకలతో యువతులు ప్రదర్శనగా వెళ్లి ప్రత్యేక పూజల అనంతరం బావుల్లో, చెరువుల్లో నిమజ్జనం చేస్తారు.

### ఆకిపెన్

గోండుల యొక్క గ్రామ దేవతను ఆకిపెన్ అంటారు గోండుల గ్రామ దేవత అయిన ఆకిపెన్‌కు వీరు మొదటగా పండిన పండ్లు, కాయలు, మొదటిగా పూసిన పూలను సమర్పిస్తారు. గోండు మాండలికంలో ఈ పండుగను నావోంగ్ అంటారు.

### పెర్సపేన్

ఈ పండుగను ప్రతి సంవత్సరం ఏప్రిల్-మే నెలలో మరియు డిసెంబర్-జనవరి నెలల్లో జరుపుకుంటారు.

### పెద్ద దేవుడు

తెలంగాణలోని గిరిజనులు వైశాఖమాసంలో గ్రామ సంక్షేమం కోసం పెద్ద దేవుడు గౌరవార్థం ఈ పండుగను జరుపుకుంటారు. భూమిలో త్రిభుజాకార ఆకృతిలో ఒక రాయిని పాతిపెట్టి దేవునిగా కొలుస్తారు. పరిగి పిట్టను ఈ సందర్భంగా బలిస్తారు. ఈ పండుగను పొలాలను సాగు చేయడానికి ముందు మే లేదా జూన్ మొదటి వారంలో మంచి వర్షాలు రావాలని కోరుకుంటూ జరుపుకుంటారు

### వీటింగ్ పండుగ

వీటింగ్ పండుగనే ఇటుకల పండుగ అంటారు. వ్యవసాయం పనులు ప్రారంభించాలన్నా, కొత్తగా జంతువులను వేటాడేందుకు షికారులో పాల్గొనాలన్నా ఈ పండుగను నిర్వహించవలసిందే. మే నెలలో ఏదైనా శుక్రవారం రోజున ప్రారంభించి ఐదు రోజులపాటు వేడుకగా జరుపుతారు. పండుగలో గూడెం ప్రజలందరూ భాగస్వాములవుతారు. మొదటిరోజు వ్యవసాయ పనిముట్లు శుభ్రం చేసి అలంకరిస్తారు. వాటిని ఇంటిముందుంచి నాగలి పూజ చేస్తారు. దీనినే ఆయుధపూజగా భావిస్తారు. తరువాత పప్పుభోగం నైవేద్యంగా సమర్పిస్తారు. ఐదుగురు పిల్లలను దేవతలుగా భావించి వారికి భోగం పంచిపెట్టిన తరువాతనే ఇంట్లోవాళ్లు తింటారు. ఇదే రోజు మధ్యాహ్నం కొందరు మగవారు అడవికి పోయి రెండు కర్రలు కొట్టుకువస్తారు. ఊరులో లేదా ఊరు బయట విశాలమైన ప్రదేశంలో ఉన్న చెట్టుకు ఈ కర్రలతో ఊయల కడతారు. దీనికి ప్రతిఫలంగా ఆడవారు చౌడు పిండితో చేసిన అప్పలు, కుడుములు పెట్టి ఊయల కట్టినవారి కాళ్లకు మొక్కి ఊయల ఊగటం ప్రారంభిస్తారు.

### గిరిజన గూడాల్లో దండారీ పండగ

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజేన్సీలో నివసించే ఆదివాసీలు.. తమ సంస్కృతి సంప్రదాయాలతో పండగలు జరుపుకుంటారు. ఆదివాసీలు ఆశ్వయుజం నెలలో పౌర్ణమి తర్వాత వచ్చే మంచి రోజు నాడు ఇండ్లు, వాకిలి అలికి అలంకరిస్తారు. ఊరి పటేల్ ఇంటి ముందు ఈ దండారీ వేడుకలను నిర్వహిస్తారు. ముండ అనే పెద్ద కర్ర స్తంభంచుట్టూ గుండ్రంగా చేసే నృత్యాలతో దండారి ఉత్సవాలు మొదలవుతాయి.

గోండులు దీపావళి సందర్భంగా జరుపుకునే దండారీ పండుగ అతి ప్రధానమైనది. అకాడి నుంచి మొదలై దీపావళి తరువాత రెండు రోజులకు బొడుగ పండుగతో దండారీ ఉత్సవాలు ముగిస్తారు. దండారీ ఉత్సవాల్లో భాగంగా గోండులు ఆషాఢ మాసం లేదా దసరా తర్వాతి రోజుల్లో అకాడిపెన్ దేవతకు పూజలు నిర్వహించి దండారీ ఉత్సవాలు ప్రారంభిస్తారు. దండారీలో ఆటపాటలకు ఉపయోగించే పర్రా, వెట్టె, తుడుం, డప్పు, పెప్రి తదితర సంగీత పరికరాలను, నెమలి ఈకలతో కుంచెం కట్టిన గుస్సాడీ కిరీటాలను, ఇతర వస్తు సామగ్రిని గూడెం గ్రామ పటేల్ ఇంటి ముందు పేర్చి సంప్రదాయ రీతిలో పూజలు జరుపుతారు. ఈ నృత్యాల్లో గుస్సాడీ, చచ్చొయి-చాహొయి, థింసా, గుమ్మెలాట ప్రధానమైనవి. గుస్సాడీ అలంకరణ చేసుకునే వారు అత్యంత నియమ నిష్టలతో ఉంటారు.

### బంజారాల బతుకమ్మ తీజ్

లంబాడీలు (బంజారాలు) నిర్వహించే ఉత్సవాల్లో తీజ్ అతి ముఖ్యమైనది. రాఖీపౌర్ణమి నుంచి శ్రీకృష్ణాష్టమి వరకు గిరిజన తండాల్లో పెళ్లి కాని యువతులు నిర్వహించే తీజ్‌ను బంజారాల బతుకమ్మ పండుగ అనవచ్చు. రాఖీపౌర్ణమి రోజు నుంచి శ్రీకృష్ణాష్టమి వరకు తీజ్ ఉత్సవాలను పెళ్లికాని యువతులు, చిన్నారులు తొమ్మిది రోజులపాటు జరుపుకుంటారు. ముందుగా తండాల్లో పెద్దలు ప్రతీ ఇంటి నుంచి గోధుమలు సేకరిస్తారు. చిన్నచిన్న వెదురు బుట్టలు కొనుగోలు చేస్తారు. యువతులు తండాలకు సమీపంలో చీమల పుట్టమన్ను (మకొడ ధూడ్) తీసుకువచ్చి వెదురు బుట్టల్లో నింపుతారు. రాఖీపౌర్ణమి రోజున ఆ బుట్టల్లో ప్రత్యేక పూజలతో గోధుమలు చల్లుతారు. రోజూ పూజలు నిర్వహిస్తారు. తొమ్మిదో రోజు నీటి వనరుల్లో నిమజ్జనం చేస్తారు. పూర్వ కాలంలో తీవ్ర కరువు కాటకాలు వచ్చినప్పుడు గిరిజన పెద్దలు(నాయక్)లు తమ ఆరాధ్య దైవమైన జగదాంబ మాతను వేడుకోగా ఏటా శ్రావణమాసంలో తీజ్ ఉత్సవాలు నిర్వహించాలని సూచించిందని చెప్తారు. కాగా, తీజ్ అంటే పచ్చదనం అని అర్థం.

### జంగుబాయి జాతర

ఆదిలాబాద్ జిల్లాలోని కోటపరండోలిలో ఏటా జంగుబాయి జాతర జరుగుతుంది. గోండులు, వారితో కలిసి ఉండే గిరిజనులు,



గిరిజనే తరులు వేలాదిగా పాల్గొనే ఈ జాతరలో మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న కారణంగా మరాఠీ ప్రాంత గోండులు కూడా వేలాదిగా పాల్గొని కుల సాంప్రదాయక సభలు జరుపుతారు. స్థానికంగా పారే ఒక సెలయేరుకు ఇరు ప్రక్కల భక్తులు గుడారాలు వేసుకొని సాంప్రదాయం ప్రకారం నిద్రలు చేస్తారు. ఆదివాసీల ఆరాధ్య దైవమైన జంగూబాయి దేవతకు ప్రతిరూపమైన పెద్దపులిని పూజిస్తారు. గోండులంతా మాఘ శుద్ధ పౌర్ణమి మాసం రాగానే నెల రోజుల పాటు జంగూబాయి మాలలు వేస్తారు. జంగూమాతకు టెంకాయలు మొక్కులుగా సమర్పిస్తారు. అక్కడి గుట్టలోని గుహలో ఉండే పెద్దపులికి జంగో లింగో అంటూ జేకొడుతూ దర్శనం చేసుకుంటారు.

### అడవి బిడ్డల జాతరలు

ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో నిర్వహించే వివిధ జాతర ఉత్సవాలు వారి సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలే ప్రధానంగా సాగుతాయి. ఆదివాసీలకు నాగోబా జాతర అత్యంత పవిత్రమైనది. నాగోబాతో పాటు ఖాందేవ్, బుడుందేవ్, మహాదేవ్, జంగుబాయి ఇలా.. ప్రతీ జాతర వారికి ప్రత్యేకమైనదే.

### నాగోబా జాతర

ఆధునిక ప్రపంచం ఎన్ని హంగులు అద్దుకున్న ఈ జాతరలో మాత్రం పురాతన గిరిజన సంస్కృతి సంప్రదాయాలన్నీ కండ్లకు కట్టినట్టు చూపించి 15 రోజులపాటు జరిగే భారతదేశ అతిపెద్ద గిరిజనుల పండగ నాగోబా జాతర. అది ప్రకృతిని కొలిచే పండగ, ఆదివాసీల ఆత్మీయులకు అది వేడుక, అడవితల్లి ఒడిలో చెట్ల నీడలలో సేద తీరే ఓ గిరిజన పండగ. ఆదివాసుల ఆత్మీయ పలకరింపులకు, ఆచార్య వ్యవహారాలకు నిలువెత్తు నిదర్శనం. ప్రకృతిని పూజించి పర్యావరణాన్ని కాపాడి భవిష్యత్ తరాలకు సందేశం ఇచ్చే జాతర. ఆధునిక ప్రపంచం ఎన్ని హంగులు అద్దుకున్న ఈ జాతరలో మాత్రం పురాతన గిరిజన సంస్కృతి సంప్రదాయాలన్నీ కండ్లకు కట్టినట్టు చూపించి 15 రోజుల పాటు జరిగే భారతదేశ అతిపెద్ద గిరిజనుల పండగ నాగోబా జాతర. ఆదివాసీల ఆరాధ్య దైవం నాగోబా. ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ గ్రామంలో కొలువై ఉంది. ఏటా పుష్య మాసంలో

అమావాస్య అర్థరాత్రి మెస్రం వంశీయులు పవిత్ర గంగజలాలతో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో జాతర ప్రారంభిస్తారు. గోండులు, పర్ధానుల్లో మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో జరిగే ఈ జాతరలో వేలాది మంది గోండులు, పర్ధాన్‌లు, తోటీలు, నాయకపోళ్ళు, కోలాములు, ఇతర గిరిజనేతర ప్రజలు పాల్గొంటారు. సాంప్రదాయక సభలు, దర్బారు నిర్వహిస్తారు. కొత్త కోడళ్ల భేటీ ప్రత్యేకం. దర్బారులో ఉన్నతాధికారులు ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించి వారి సమస్యలు పరిష్కరించటానికి ప్రయత్నిస్తామని మాటిస్తారు.

**ఖాందేవ్ జాతర**

నాగోబా జాతర ప్రారంభానికి ముందు నార్నూర్ మండల కేంద్రంలో ఖాందేవ్ జాతర జరుగుతుంది. పుష్య పౌర్ణమికి ఖాందేవ్‌ను తొడసం వంశీయులు కొలువడం ద్వారా జాతర ప్రారంభమవుతుంది. 15 రోజులపాటు జరుగుతుంది. పూర్వ కాలంలో తోడసం వంశస్థుడైన ఖమ్ము పటేల్‌కు రాత్రివేళ కలలో ఖాందేవుడు ప్రత్యక్షమై గ్రామమంత సుఖ సంతోషాలతో ఉండాలంటే నీ వ్యవసాయ భూమిలో నేను కొలువయ్యాయని తనను కొలవాలని పేర్కొన్నాడని.. నాటి నుంచి ఏటా పుష్యపౌర్ణమితో ఖాందేవును తొడసం వంశీయులు కొలుస్తున్నారు. ఈ జాతర ముగింపుతో ఇక్కడికి వచ్చిన ఆదివాసీలు నాగోబా జాతర కేస్లాపూర్‌కు తరలివెళ్తారు.

**గాంధారి మైసమ్మ జాతర**

మంచిర్యాల దగ్గర గాంధారి ఖిల్లాలో స్థానిక నాయకపోడ్ గిరిజనుల ఆధ్వర్యంలో ఏటా జరిగే మైసమ్మ జాతరలో గిరిజనేతరులు కూడా వేల సంఖ్యలో పాల్గొంటారు. గిరిజన సంక్షేమ శాఖ ఈ జాతర నిర్వహణకై 5 లక్షల రూపాయలు విడుదల చేసింది. ఈ జాతరలో పాల్గొని ఖిల్లా ప్రధాన ద్వారం దగ్గర మైసమ్మకు పూజలు నిర్వహించిన దేవాదాయ శాఖామాత్యులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మౌలిక వసతుల కల్పనకై రూ.50 లక్షలు తమ ప్రభుత్వం విడుదల చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**బుడుందేవ్ జాతర**

నాగోబా జాతర ముగింపు మరుసటి రోజు ఉట్నూర్ మండలం శ్యాంపూర్‌లో బుడుందేవ్ జాతరను మెస్రం వంశీయులు ప్రత్యేక పూజలతో ప్రారంభిస్తారు. పదిరోజుల పాటు నిర్వహిస్తారు. పూర్వ కాలంలో గౌరాపూర్ అనే గ్రామంలో ఉన్న ఆవుల మందలో ఉన్న ఆంబోతు (ఎద్దు) పశువుల మంద నుంచి తప్పించుకొని శ్యాంపూర్ ప్రాంతంలో ఉన్న పంట చేలల్లో పడి పంట నాశనం చేయడంతో ఆగ్రహించిన కొత్వాల్‌లు వారి వద్ద ఉన్న ఆయుధంతో ఆంబోతును సంహరించారని మృతి చెందిన ఆంబోతును దూర ప్రాంతంలో పారేయడానికి వెళ్తుండగా అక్కడే బండరాయిగా మారి బుడుందేవ్‌గా అవతరించిందని పూర్వీకుల కథనం.

**మహాదేవ్ జాతర**

శ్యాంపూర్‌లో బుడుందూవ్ జాతర ముగింపుతో సిర్పూర్(యు) మండల కేంద్రంలో మహాదేవ్ జాతర ప్రారంభమవుతోంది. ఆత్రం వంశీయులు ప్రత్యేక పూజలతో మహాదేవ్‌ను కొలిచి ప్రారంభించే జాతర పదిహేను రోజులపాటు సాగుతుంది. అంతేకాకుండా మండలంలోని లింగాపూర్‌లో జగదాంబ జాతరను బంజారాలు అత్యంత నియమ నిష్టలతో నిర్వహిస్తారు.

**జంగుబాయి జాతర**

శార్దూల వాహిని దుర్గమాత ప్రతి రూపమే జంగుబాయి అని ఆదివాసీల నమ్మకం. ఏటా పుష్య మాసంలో నెల రోజుల పాటు ఆదివాసీలు అత్యంత నియమనిష్ఠలతో జంగుబాయిని కొలుస్తారు. ఆంధ్ర, మహారాష్ట్ర సరిహద్దు కెరమెరి మండలం పరందోళి గ్రామం సమీపంలో గల శంకర్‌లొద్ది అటవీ ప్రాంతంలో జంగుబాయి కొలువై ఉన్న ఈ ప్రదేశమంతా పదుల సంఖ్యలో దేవతలున్నాయని పూర్వకాలం నుంచి ప్రచారంలో ఉంది. జంగుబాయి దేవతను ఆదివాసీలోని ఆరు తెగలకు చెందిన వంశస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించి పూజలు చేస్తారు. నెల రోజుల పాటు జరిగే ఈ పూజలకు జిల్లా, ఏజెన్సీ నుంచే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి భారీగా ఆదివాసీలు, ఇతరులు తరలివెళ్తారు.

**ముగింపు**

గిరిజనుల పండుగలన్నీ దాదాపు కొండలను, కాలువలను, చెట్లను ప్రసన్నం చేసుకోవడానికి ఉద్దేశించినవే. ప్రకృతికి, మనిషికి, మిగిలిన జీవాలకు ఉన్న సంబంధాన్ని, ఆ బంధంలోని ఔన్నత్యాన్ని గిరిజనులు చేసుకునే పండుగలు చాటి చెబుతాయి. ఈ పండుగలను 'కొత్తలు'గా పిలుస్తుంటారు. పప్పు, ధాన్యాలకు పప్పు కొత్తలు, తిండి గింజలు పండితే సామ కొత్తలు, కొర్ర కొత్తలు ఇలా ఏ పంట పండినా ఆ కొత్తలు జరుపుకోవడం, ఆ వృక్షజాతులు, వ్యవసాయ జాతులపై తమ కృతజ్ఞతను చాటుకోవడమే. కాబట్టి ప్రభుత్వం వారి సంస్కృతిని కాపాడటానికి గిరిజన ప్రాంతాల్లో ఆలయాలు నిర్మించాలి. నృత్యాలు, సంగీతంతో అనేక గిరిజన పండుగలు సంవత్సరం మొత్తం జరుగుతుంటాయి. చాలా గ్రామాల్లో నేడు ఆ పండుగలు కానరావడం లేదు. ఇలా గిరిజన సంస్కృతి పలు విధాలుగా ధ్వంసమవుతోంది. కాబట్టి ప్రభుత్వం కృషి చేసి నిధులు కేటాయిస్తే, తమ సంస్కృతి పట్ల అభిమానంతో కాపాడుకుంటారు.



ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 2 45 హైదరాబాద్ డిసెంబర్ : 2022

# సాహిత్యంలో శ్రీశైల క్షేత్ర ప్రస్తావన – ఒక పరిశీలన

డా. జి. తిరుమల వాసుదేవ రావు, అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ పీజీ కళాశాల,పుత్తూరు. ఫోన్ : 9441287342

**సంక్షిప్త పరిచయం :** చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఆధ్యాత్మిక ప్రదేశాలలో శ్రీశైల క్షేత్రం దక్షిణ భారతాన ముందు వరుసలో నిలుస్తుంది. శ్రీశైల క్షేత్రం ద్వాదశ జ్యోతిర్లింగ కేంద్రంగానూ మరియు అష్టాదశ మహాశక్తి పీఠంగానూ భక్తులచేత పూజలందుకుంటున్నది. నల్లమల కొండల నుండి తిరుపతి శేషాచలం కొండల వరకు పుణ్యక్షేత్రాలు ఒక శ్రేణిగా ఏర్పడ్డాయి. మత్స్య పురాణంలో శ్రీశైల ప్రాంతాన్ని "మాధవి" అను పేరు గల మాతృదేవత స్థానంగా పేర్కొన్నారు. ఈ క్షేత్రం గురించిన ప్రస్తావన అనేక తెలుగు, సంస్కృత, తమిళ భాషల సాహిత్యంలో లభ్యమవుతున్నది.

**ముఖ్యాంశాలు :** శ్రీశైల క్షేత్రం, శ్రీ పర్వతం, శివ–శక్తి పీఠాలు, భ్రమరాంబాష్టకం, మాతృదేవత, రాజతరంగిణి, పండితారాధ్య చరిత్ర, హిందూ, బౌద్ధ మత సాహిత్యం.

శ్రీశైలంలో అమ్మవారు భ్రమరాంబ దేవిగాను, స్వామివారు మల్లికార్జునుడిగాను వెలసి ఉన్నారు. నల్లమల కొండలలో వెలిసిన శ్రీశైల క్షేత్రం పవిత్రతను ప్రాముఖ్యతను హిందూ, బౌద్ధ మత సాహిత్యం స్పష్టం చేశాయి. "శ్రీశైల శిఖరం దృష్ట్వా పునర్జన్మ నవిద్యతే" శ్రీశైల క్షేత్ర శిఖర దర్శనం చేత జన్మ రాహిత్యం లభిస్తుంది అని భక్తులు నమ్ముతారు. శివ–శక్తి పీఠాలు భారతదేశంలో మూడు ఉన్నాయి అవి శ్రీశైలం, వారణాసి, ఉజ్జయిని. ప్రాధాన్యత క్రమంలో ఈ శైవ క్షేత్రాల సరసన శ్రీశైల క్షేత్రం చేరి ఉంది.

తూర్పు కనుమలలోని ఒక భాగం కర్నూలులోని నల్లమల కొండల నుండి తిరుపతి శేషాచలం కొండల వరకు ఒక శ్రేణిగా ఏర్పడ్డాయి. ఈ శ్రేణిని పురాణాలు ఒక మహాసర్పం ఆకృతితో పోల్చాయి. ఈ మహాసర్పం నోటి భాగంలో శ్రీకాళహస్తి దేవాలయం, పడగ పైన తిరుమల దేవాలయం, వీపు భాగంలో అహోబిలం దేవాలయం, తోక భాగంలో శ్రీశైల క్షేత్రాలు ఏర్పడినాయని పురాణాలు భావిస్తాయి.

శ్రీగిరి, శ్రీ పర్వతం, సిరిగిరి, దక్షిణ కైలాసం మొదలైన పేర్లతో పిలవబడుతున్న ఈ క్షేత్రం గురించిన ప్రస్తావన అనేక తెలుగు, సంస్కృతం, తమిళం భాషల సాహిత్యంలో లభ్యమవుతున్నది. భాషా పండితుల పరిశీలన ప్రకారం శ్రీ పర్వతం అన్న సంస్కృత పదానికి నల్ల– పవిత్రమైన, మలై –కొండ అన్న ద్రావిడ పదం మూలాల నుంచి గ్రహించినట్లు భావిస్తున్నారు.

"మహాభారతం"లో అర్జునుడు జరిపిన తీర్థయాత్రలలో శ్రీశైలం ప్రాంతాన్ని దేశంలోని పవిత్ర స్థలాలలో ఒకటిగా గుర్తిస్తారు. "మత్స్య పురాణం" లో శ్రీశైల ప్రాంతాన్ని "మాధవి" అన్న మాతృదేవతా స్థానం గా పేర్కొన్నారు. "అగ్ని పురాణం" ప్రకారం శివుడు మరియు



పార్వతి సదా ఇష్టపడి నివసించే ప్రాంతంగా శ్రీశైలం వర్ణించబడింది. "స్కాంద పురాణం"లో శ్రీశైల ఖండం అనే ప్రత్యేక అధ్యయనం ఉంది. ఇందులో శివుడు పార్వతీదేవికి ఈ ప్రదేశం యొక్క గొప్పతనాన్ని వివరించాడు. "వాయు పురాణం" ప్రకారం శ్రాద్ధ కార్యక్రమ నిర్వహణలో శ్రీశైల ప్రాంతం ప్రత్యేకత గురించి ప్రస్తావిస్తుంది.

హర్ష చక్రవర్తి ఆస్థానంలో గల కవి బాణభట్టు రచించిన "కాదంబరి" గ్రంథంలో శ్రీ పర్వత క్షేత్రాన్ని గురించిన ప్రస్తావనలను మనం గమనించవచ్చు. తాంత్రిక పూజలకు ఇది ప్రముఖ సిద్ధ కేంద్రంగా పేర్కొన్నాడు. చైనా బౌద్ధ మత యాత్రికుడు హ్యూయాన్ సాంగ్ రచనలలో ఈ ప్రాంతాన్ని "శ్రీపర్వతం" అన్న పేరుతో ప్రస్తావించారు. కథాసరిత్సాగరంలో ఒక కాశ్మీరి వ్యక్తి శివుని ప్రార్థిస్తూ శ్రీశైలంలో ఘోర తపస్సు ఆచరించారని, ఒక కథలోని కథనంలో ప్రస్తావించబడింది. బాసుడు తాను రచించిన "స్వప్నవాసవదత్త"లో ఈ పర్వతాన్ని మల్లికార్జునుడి నిలయంగా వర్ణించాడు.

అదేవిధంగా భవభూతి తన "మాలతీమాధవం" లో అఘోరఘంట అన్న శ్రీశైలం కాపాలిక సిద్ధుని గురించి ప్రస్తావన ఉంది. హర్ష చక్రవర్తి రచించిన "రత్నావళి" గ్రంథంలో కథానాయకుడికి జలస్తంభన విద్యను శ్రీశైలానికి చెందిన శ్రీకంఠ దాసు అను సిద్ధుడు బోధించాడని చెప్పబడింది. "రసరత్నాకరం" అన్న గ్రంథంలో శ్రీశైలంలో రసవాద ప్రయోగాలు చేయడానికి ఒక ప్రయోగశాల నిర్మించబడి ఉంది అని చెప్పబడింది

అద్వైత సిద్ధాంతకర్త ఆదిశంకరాచార్యుడు దేశసంచారంలో భాగంగా శ్రీశైల క్షేత్రాన్ని దర్శించి, "శివానందలహరి" అన్న తన గ్రంథంలో "భ్రమరాంబాష్టకం" అన్న పవిత్ర శ్లోకాలను రచించాడు. సోమదేవసూరి "కథాసరిత్సాగరం" శ్రీశైల క్షేత్రాన్ని దర్శించి, దేవుడి దర్శనం కొరకు తీవ్ర తపస్సు చేస్తున్న సన్యాసి గురించి

ప్రస్తావించింది. భారతీయ చరిత్రకారుడు కల్హణుడు "కాశ్మీర రాజతరంగిణి" అన్న గ్రంథంలో కాశ్మీర రాజు ప్రవర సేనుడు కాశ్మీరం నుండి ఈ పర్వతానికి తీర్థయాత్రలు జరిపినట్లు ప్రస్తావించాడు. "ఆంధ్ర మహాభారతం"లో నన్నయ్య ఈ ప్రాంత ప్రాధాన్యతను పేర్కొన్నాడు.

పల్లవ మహేంద్ర వర్మ ( క్రీ .శ 600 630) "మత్త విలాస ప్రహసనం" అన్న వ్యంగ్యరచనలో శ్రీశైల ప్రాంత సంచారకులైన కాపాలిక శైవుల గురించి వివరించాడు. నన్నెచోడుడు తన "కుమార సంభవంలో" తన గురువైన జంగమ మల్లయ్య గారిని కీర్తించే సందర్భంలో శ్రీశైలంలోని మల్లికార్జున భగవంతుడి గురించి ప్రస్తావించాడు. మల్లికార్జునపండితుడు రచించిన "సుత్తి లోక పంచకం" లో శ్రీశైల మల్లికార్జున దేవుడిని శ్రీగిరి వల్లభగా పిలిచాడు. పాల్కురికి సోమనాథుడు తన "బసవపురాణం"లో, "పండితారాధ్య చరిత్ర"లోనూ శ్రీశైల క్షేత్రం గురించి విస్తృతంగా ప్రస్తావించాడు.

కవిసార్వభౌముడుగా కీర్తించబడిన శ్రీనాథుడు క్రీ .శ 1440 ప్రాంతంలో శ్రీశైల క్షేత్రానికి తీర్థ యాత్రలకు వెళ్లి "శ్రీశైల మాహాత్మ్యం" అన్న గ్రంథాన్ని రచించాడు. విన్నకోట పెద్దన తన "కావ్యాలంకార చూడామణి"లో శ్రీశైలము, ద్రాక్షారామము, కాళేశ్వరంలను తెలుగు దేశం యొక్క సరిహద్దులుగా నిర్ధారించాడు. ఎర్రాప్రగడ కవి "హరివంశం"లో శ్రీశైల మల్లికార్జున స్వామి భక్తుడగు "ఘోడ రాయగంగ" అన్న సిద్ధాంతి గురించి ప్రస్తావించాడు.

శ్రీగిరి కవి "శ్రీ గిరీశం" అన్న మకుటంతో మల్లికార్జున దేవుడిపై శతకం రచించాడు. తెనాలి శ్రీగిరి కవి స్కాంద పురాణంలోని శ్రీ శైల ఖండములో గల తెలుగు పద్యాలు అనువదించాడు. సర్ప భూషణ శివయోగి తన రచన అయిన "కైవల్య కల్పవల్లి"లో శ్రీశైలం గురించి భౌగోళిక పరమైన వివరణలను ఇచ్చారు. తెలుగు భాషలో తొలి యాత్ర చరిత్ర "కాశీయాత్ర చరిత్ర"ను రచించిన ఏనుగుల వీరాస్వామి తన రచనలో శ్రీశైలంను దర్శించి అక్కడి పరిస్థితులను ప్రయాణ మార్గాలను వివరించాడు.

శ్రీశైలం గురించి అనేక కన్నడ రచనలలో కూడా ప్రస్తావించ బడింది. కర్ణాటక ప్రాంతానికి చెందిన అక్కమహాదేవి, అల్లమప్రభు మరియు సిద్ధ రామన్న వంటి ప్రముఖులు వారి తాత్త్విక రచనలలో శ్రీశైలం గురించి ప్రముఖంగా ప్రస్తావించారు. చామరసు అన్న కన్నడ కవి రచించిన "ప్రభులింగలీల" అన్న రచనలో శ్రీశైల క్షేత్రం గురించి మరియు దాని చరిత్ర గురించి వివరించారు. పిడపర్తి సోమనాథ కవి "ప్రభులింగ లీల" కావ్యాన్ని కన్నడ భాష నుండి తెలుగు భాషలోకి అనువదించాడు. తమిళ ప్రాంతానికి చెందిన శైవ మత గురువులైన ముగ్గురు నయనార్లు శ్రీశైల క్షేత్రాన్ని దర్శించాడు. మల్లికార్జున స్వామిని కీర్తించారు. అప్పర్, తిరుజ్ఞాన సంబంధర్, మరియు సుందరమూర్తి వీరిని మువ్వారం అని పిలుస్తారు. వారి తేవారం (దేవ హారము) కీర్తనలలో ఈ క్షేత్రాన్ని ప్రస్తుతించారు. వీరి రచనలలో ఈ ప్రాంతాన్ని "శ్రీ పరుపతం" అని పేర్కొన్నారు. కలైకళంజియం గ్రంథంలో దీనిని మల్లిపురం అని పిలిచారు.

ఈ శ్రీశైల క్షేత్ర ఆధ్యాత్మిక ప్రాధాన్యతతో పాటు సమీపంలోని పరిసరాలలో గల ప్రకృతి సౌందర్యం, జల విద్యుత్ శక్తి ఉత్పాతక ప్రాజెక్టు విశేషంగా ప్రకృతి సందర్శకులను ఆకర్షించి అలరిస్తున్నది.

**ముగింపు :** ఆధ్యాత్మిక మరియు చారిత్రక ప్రాధాన్యతలు గల శ్రీశైలం తన ప్రభావాన్ని సాహిత్య రంగంపై కూడా చూపించింది అనేక భారతీయ భాషలలో వివిధ కాలాలలో శ్రీశైలం గురించిన ప్రస్తావనలు అనేక గ్రంథ రచనలలో మనం గమనించగలం. ఈ విధమైన రచనలు శ్రీశైల క్షేత్ర ప్రభావం సామాజిక రంగంపై ఎంతవరకు ఉన్నదో తెలుపుతుంది.

'యజుర్వేదం"లోని శ్రీ రుద్ర శ్లోకాలలో శివుడి గొప్పతనాన్ని క్రింది విధంగా కీర్తించారు.

**"ఒక బిందువు నుండి ప్రతిచోటకు ప్రతిచోట నుండి ఒక బిందువును చూడగలిగిన నీకు నా ప్రణామాలు. అనంతము నుండి బిందువుకు బిందువు నుండి అనంతానికి విస్తరించిన వాడా నీకు నా ప్రణామాలు".**

**ఆధార గ్రంథాలు :**

1. నారాయణ అయ్యర్, దక్షిణ భారతదేశంలో శైవిజం యొక్క మూలం మరియు ప్రారంభ చరిత్ర, మద్రాస్, 1911.
2. ఎన్. రమేషన్, టెంపుల్స్ అండ్ లెజెండ్స్ ఆఫ్ ఆంధ్ర, భారతీయ విద్యాభవన్, బొంబాయి, 1988.
3. వి. కామేశ్వరరావు, రాయలసీమలోని విజయనగర దేవాలయాలను ఎంపిక చేసుకోండి, పురావస్తు సిరీస్ నం.47, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, హైదరాబాద్, 1976.
4. మద్రాసు ప్రెసిడెన్సీలో కర్నూలు జిల్లా మాన్యువల్, ది గవర్నమెంట్ ప్రెస్, మద్రాస్, 1886.
5. ఏనుగుల వీరాస్వామి, కాశీయాత్ర చరిత్ర, మద్రాసు, 1838.
6. ఎం. రామారావు, తిరుమల తిరుపతి మరియు తిరుచానూరు ఆలయాలు, తిరుమల తిరుపతి దేవస్థానాలు, తిరుపతి, 2013.
7. శ్రీశైలం టెంపుల్ కైపియట్ వాల్యూం :1, పి. సీతాపతి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాదు 1981.
8. కొడాలి లక్ష్మీనారాయణ, చారిత్రక శ్రీశైలం, భరత్ ప్రెస్. తెనాలి, 1967.

## కె. విశ్వనాథ్ చలన చిత్రాలు – సామాజిక అవలోకనం – 28

# శుభ సంకల్పం

**టి. లక్ష్మీనారాయణ,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9704829254



"కె.విశ్వనాథ్ చలన చిత్రాలు– సామాజిక అవలోకనం" నందు ఈ మాసం చర్చించబోయే చిత్రం "శుభసంకల్పం". ఈ చిత్రం నందు మొట్ట మొదటిసారిగా కె.విశ్వనాథ్ నటుడిగా తనలోని కొత్త కోణాన్ని ప్రేక్షకలోకానికి పరిచయం చేశారు. కమల్ హాసన్– కె.విశ్వనాథ్ ల కలయికలో రూపొందిన మూడవ చిత్రం ఇది. ఇక ఈ చిత్రానికి గాయకుడిగా ప్రసిద్ధిగాంచిన ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం నిర్మాతగా వ్యవహరించడం మరొక విశేషం.

**చిత్ర కథ :** దాసు (కమల్ హాసన్) చేపలు పట్టి జీవనం సాగించే బెస్త కులానికి చెందిన యువకుడు. చిన్నప్పట్నుంచీ అతడు బామ్మ లక్ష్మమ్మ (నిర్మల) పెంపకంలో పెరిగి పెద్దవాడవుతాడు. దాసు నివసించే గూడెంలోని ప్రజలందరికీ చేపలే జీవనాధారం. ఆ గూడెంలోని జనానికి పెద్దమనిషి రాయుడు (కె.విశ్వనాథ్). రాయుడంటే ప్రజలకు ఎనలేని గౌరవాభిమానాలు. రాయుడు సీ ఫుడ్స్ కంపెనీకి, రాయుడుకి నమ్మిన బంటు దాసు. అతడు నిరక్షరాస్యుడైనప్పటికీ జ్ఞాపకశక్తి మెండు. ఎంత పెద్ద లెక్కలైనా అతడి నాలిక మీద తేలిపోవల్సిందే. రాయుడు మనుమరాలు సంధ్య (ప్రియారామన్). విదేశాల్లో చదువు పూర్తి చేసుకుని వచ్చిన అమ్మాయి. సంధ్య వున్నప్పటికీ రాయుడు తన కంపెనీ వ్యవహారాల్లో దాసుకు మంచి ప్రాధాన్యం ఇస్తూ వుంటాడు. సంధ్యకు దాసు పై మంచి అభిప్రాయం వుంటుంది. రాయుడు దత్త కుమారుడు దత్తులు (దత్తాత్రేయ). అతడు తాగుడు, జూదానికి బానిసై అప్పులు చేస్తూ జల్సాగా బతుకుతుంటాడు. తండ్రి రాయుడు పరువును అధోగతి పాలుచేస్తున్నాననే ఆలోచన లేకుండా అతడి ఆస్తులను అనుభవిస్తూ వుంటాడు. రాయుడి స్నేహితుడు, అతడికి బాగా దగ్గరైన శ్రేయోభిలాషి కేశవరావు (గొల్లపూడి మారుతీరావు). రాయుడు చేసే ప్రతి పనిలో చేదోడువాదోడుగా వుంటూ అతడి వ్యాపార లావాదేవీలను చూస్తుంటాడు.

ఒకసారి రాయుడు ఇంటికి కోటయ్య కూతురు గంగ (ఆమని) పని నిమిత్తం వస్తుంది. ఆ సమయంలో దాసుకు గంగతో పరిచయ మేర్పడ్తుంది. గంగ అమాయకమైన నగు మోముతో, చామన చాయ వర్ణంతో మాట, పాట, పనితో అందరినీ ఆకట్టుకునే గుణరూపాలు కలది. పరిచయమైన కొన్నాళ్ళకే దాసు – గంగల మనసులు కలుస్తాయి. రాయుడు కుమారుడు దత్తులు తనకున్న చెడు వ్యసనాల కారణంగా చేసే అప్పులను కళ్యాణ్ రావు (కోట శ్రీనివాసరావు) దగ్గర తీసుకుంటూ వుంటాడు. కళ్యాణ్ రావు కూడా అతడికి మందు, మత్తు, మగువలను ఎరగా వేసి అతడి నుండి అందిన మేర లాభం పొందే కుట్ర చేస్తాడు. అంతేకాక కళ్యాణ్‌రావు తన వద్ద వున్న రౌడీల అండదండలతో సెటిల్మెంట్స్ చేస్తూ వుంటాడు. దాసు బామ్మ అతడికి పెళ్లి సంబంధాలు చూస్తూ వుంటుంది. అంతలో రాయుడు, బామ్మకు దాసు– గంగల ప్రేమ విషయం తెలిసి వాళ్ళిద్దరికీ వివాహం చేస్తారు. వారి అన్యోన్య దాంపత్యం ఫలించి వారికి కుమారుడు జన్మిస్తాడు. మరోవైపు ప్రజలందరి సహకారంతో రాయుడు సీ ఫుడ్స్ కంపెనీ లాభాల్లో సాగుతుంది. అందువల్ల రాయుడు ప్రజలందరికీ తన కంపెనీలో షేర్లు ఇవ్వాలనే ఒక ఆదర్శ ఆలోచనకు పూనుకుంటాడు. రాయుడు తన షష్టిపూర్తి నాడు ప్రజలకు ఇళ్ళు కట్టించి వారికోసమై పాఠశాల, ఆస్పత్రులు ప్రారంభించి జీవనాధారం కోసమై ప్రతి ఒక్కరికీ ఒక కొత్త పడవను ఇవ్వాలనే తన సంకల్పాన్ని దాసుతో చెప్తాడు.

అన్నీ సవ్యంగా సాగితే విధి, దైవానికి విలువెక్కడుంటుందన్నట్లుగా దత్తులు ద్వారా వారికి చిక్కులొస్తాయి 'అది కళ్యాణ్ రావు దత్తులుకు ఇచ్చిన అప్పుల రూపంలో'. కళ్యాణ్ రావుకు అప్పులు చెల్లించడానికై దత్తులు తన తండ్రి డబ్బులు దాచిన ఖజానా పెట్టెలో నుండి డబ్బులు తీసుకోబోతుండగా దాసు వచ్చి అడ్డుపడతాడు. ఆ విషయం తెలిసి రాయుడు ఆ పెట్టెను దాసుకు ఇచ్చి దానిని భద్రం చేసే బాధ్యతను అప్పజెప్తాడు. దాసు తన ఇంట్లో దాస్తూ ఆ పెట్టెలోని డబ్బు ప్రాధాన్యతను భార్య గంగ, బామ్మలతో చెప్తాడు. ఈ విషయం తెలిసి కళ్యాణ్ రావు దత్తులుకు అతడి తండ్రి ఆస్తులు వ్యాపారాలకు ఇంట్లో పనోడైన దాసే కాబోయే వారసుడని ఒక విషపు ఆలోచన నూరిపోస్తాడు. అది భరించలేని దత్తులు తన పరివారాన్ని వెంట పెట్టుకొని దాసు చేపల వేటకు వెళ్లిన సమయంలో అతడి ఇంటికి




వెళ్తాడు. ఖజానా పెట్టెను తీసుకొని పోతుండగా అడ్డగించిన లక్ష్మమ్మ పై దాడి చేస్తాడు. ఆ పెట్టె దత్తులు చేతికి అందకుండా చేసేందుకు గంగ దాన్ని పడవలో పెట్టుకొని వెళ్తుండగా పడవ మునిగిపోతుంది. మరోవైపు చేపల వేటలో వున్న దాసు బృందానికి వలలో గంగ దొరుకుతుంది. ఆమెను తీసుకుని తీరానికి వెళ్ళిన దాసుకు బామ్మ మరణ విషయం తెలుస్తుంది. అదే సమయానికి అక్కడకు చేరుకున్న రాయుడు జరిగిన విషయం తెలిసి గుండెపోటుకు గురై ఆసుపత్రిలో చేరతాడు. ఒకవైపు బామ్మ మరణం, మరోవైపు భార్య గంగ, ఆరాధించే రాయుడు గారు ఇద్దరూ ఆసుపత్రి పాలవడంతో దాసు జీవితం పెద్ద కుదుపుకు గురవుతుంది.

దాసు దుర్భరమైన పరిస్థితులు ఎదుర్కోవడానికి కారణమైన దత్తులులో ఏ మాత్రం పశ్చాత్తాపం వుండకపోగా కళ్యాణ్ రావుకు కట్టాల్సిన అప్పును గూర్చి చింతిస్తాడు. ఆసుపత్రిలో కోలుకుంటున్న రాయుడు, మనుమరాలు సంధ్య ద్వారా గంగ పట్టణంలో ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటుందని తెలుసుకుంటాడు. ఒకరోజు దాసు రాయుడుగారిని చూడడానికి వచ్చినప్పుడు రాయుడు సంధ్యతో గంగను గురించి ఆరా తీస్తూ తాను ఇచ్చిన ఖజానా పెట్టె వల్లనే ఇదంతా జరిగిందని, గంగకు ఏదైనా జరిగితే నేను భరించలేను అని చెప్పే విషయాన్ని వింటాడు. రాయుడు గారిని కలిసి దాసు తన భార్య పట్టణంలో ఆసుపత్రిలో కోలుకుంటోంది అయ్యగారు! అంటూ అబద్దం చెప్తాడు. అది విని రాయుడు సంతోషిస్తాడు. కాని గంగ అప్పటికే చికిత్స పొందుతూ మరణిస్తుంది. దాసు ఏ పరిస్థితుల్లోనూ గంగ మరణ విషయం అయ్యగారికి తెలీకూడదంటూ డాక్టర్లకు, సంధ్యకు చెప్తాడు.

అప్పుల ఊబిలో పూర్తిగా మునిగిపోయిన దత్తులు దుర్మార్గుడైన కళ్యాణ్ రావు నుండి తప్పించుకునే అవకాశం లేదని గ్రహిస్తాడు. అతడి నుండి తప్పించుకోవడానికై తన తండ్రి పరివారంలో తననూ ఒకడిగా గుర్తించడానికి ఆ ఊర్లో పనిచేసే పోస్టుమెన్ (సాక్షి రంగారావు) కూతురు ను వివాహం చేసుకుంటాడు. మానసిక పరిణతి లేని ఆ అమ్మాయిని పెళ్లి చేసుకొని దత్తులు దాసుతో పాటు అందరినీ క్షమాపణ కోరతాడు. అతడి పశ్చాత్తాపాన్ని అర్థం చేసుకున్న దాసు కళ్యాణ్ రావుకు దేహశుద్ధి చేసి అపాయాన్ని తప్పిస్తాడు. రాయుడు పూర్తిగా కోలుకున్నప్పటికీ గంగను చూడాలంటూ పదేపదే అడగడమే కాక తన షష్టిపూర్తి దినోత్సవం రోజున గంగను ఆసుపత్రి నుండి తీసుకురావల్సిందే అంటూ దాసుతో మాట తీసుకుంటాడు. రాయుడు షష్టిపూర్తి మహోత్సవాన్ని ఘనంగా జరపడానికి గూడెం ప్రజలందరూ తలో పని చేస్తూ వుంటారు. రాయుడు తన స్నేహితుడు కేశవతో పాటు కూర్చొని గంగా సమేతంగా రావాల్సిన దాసు కోసం ఎదురు చూస్తుంటాడు. కాని దాసు రాయుడు గారి మనుమరాలు సంధ్యను మాత్రమే వెంటబెట్టుకొని ఆ ప్రాంగణానికి వస్తాడు.

దాసు తో పాటు పీటలపై కూర్చునే గంగ ఏదని అందరూ ఆశ్చర్యంలో వుండగా దాసు తనతో పాటు తెచ్చిన గంగ అస్థికలున్న కలశాన్ని పక్కనే పెడతాడు. ఆ సమయంలో అక్కడే వున్న పోస్టుమెన్ కూతురు తన పరిణతి లేని మనస్తత్వంతో దాసు అస్తికలు తెచ్చాడంటే గంగ చనిపోయినట్లుంది అనడంతో ఆ ప్రాంగణమంతా దుఃఖ సంద్రమవుతుంది. అసలే అస్వస్థతగా వున్న మీ ప్రాణాలకు నిజం చెబితే ఏ అనర్థం జరుగుతుందో అనే భయంతో అబద్ధం చెప్పానని రాయుడుగారికి చెప్తాడు. గంగ పోయిందన్న బాధను దిగమింగి నిజాన్ని గుండెలోనే మోస్తూ దాసు అనుభవించిన బాధను అర్థం చేసుకుంటాడు రాయుడు.

ఆరు సంవత్సరాల తిరిగేసరికి దాసు రాయుడు సీ ఫుడ్స్ కంపెనీకి మేనేజర్‌గా దాసు వ్యవహరిస్తుంటాడు. తాతయ్యను చూడడానికి దాసు ఆరేళ్ల కొడుకైన చిన్నాతో వచ్చిన సంధ్య విదేశాలకు వెళ్ళడానికి తిరుగు ప్రయాణం అవుతుంది. దాసు సంధ్యతో మీరు మళ్ళీ వచ్చేసారి ఖచ్చితంగా మీ భర్తను తీసుకురావాలని చెప్తాడు. సరేనంటూ! సంధ్య విమానాశ్రయానికి బయల్దేరుతుంది. ఆమె వెళ్ళాక దాసుతో రాయుడు సంధ్య వివాహం చేసుకోలేదనే నిజాన్ని చెప్తాడు. నిన్ను ప్రేమిస్తూ నీ రూపాన్ని గుండెల్లో నిలుపుకుని ఒంటరిగా జీవిస్తుందని చెప్తాడు. కాని దాసు గంగ జ్ఞాపకాలను గుండెల్లో దాచుకుని బతుకుతుంటాడు. మేనేజర్ అయినా తన వృత్తిని వీడని దాసు చేపల వేటకు వెళు తుండగా అతడి కొడుకు చిన్న కూడా వేటకు వెంటనడుస్తాడు. దాసు, చిన్నా ఇద్దరు కలిసి సముద్ర తీరం వద్ద ఆకాశంలో సంధ్య వెళ్తున్న విమానానికి బై చెప్పడంతో చిత్రం ముగుస్తుంది.

**చిత్ర విశేషాలు :**

చిత్ర కథ రాయుడు, దాసు, గంగ, సంధ్య పాత్రల చుట్టూ కొనసాగుతూ మనుషుల మధ్య సంబంధాలను మూడు కోణాల్లో వ్యక్తపరుస్తుంది. మొదటిది : రాయుడు– దాసుల మధ్య ఏ రక్త సంబంధం లేకపోయినా దాసుకు రాయుడుగారంటే ఎనలేని భక్తి (రాజభక్తి), గౌరవం. అలాగే రాయుడుకు దాసంటే కొడుకుకి మించిన ప్రేమ. అందుచేతనే దాసుకు గంగతో వివాహం చెయ్యడమే కాక, గంగ ఆసుపత్రిలో వున్నదని తెలిసినప్పుడు ఆ పరిస్థితి ఏర్పడడానికి

కారణం తను దాసుకు ఇచ్చిన ఖజానా పెట్టెనే అని విచారిస్తాడు. రెండవది : దాసు- గంగల మనసులు కలిసి వివాహమైన తర్వాత వారి మధ్య దాంపత్యంలో విరబూసే కోపతాపాలు, సరస సల్లాపాలు వెరసి చక్కటి అనుబంధం ఆవిష్కృతమవుతుంది. అన్యోన్య దాంపత్య జీవనానికి పేదరికం అడ్డుకాదని కష్టసుఖాలను పంచుకోవడంలో మధురానుభూతి వుంటుందనే విషయం అవగతం అవుతుంది. ఇక మూడవది : సంధ్యకు దాసు పై వున్న ప్రేమ. చిత్ర సమాప్తం అద్భుతమైన ప్రేమకథకు రూపాన్నిస్తూ ముగుస్తుంది. గంగ మరణం తర్వాత దాసు- గంగల పసిబాబును తీసుకుని విదేశాలకు వెళ్తుంది సంధ్య. ఆరు సంవత్సరాల తర్వాత తాత రాయుడు వద్దకు చిన్నాతో (పసిబాబు) కలిసి వస్తుంది. అప్పటికి రాయుడు సీ ఫుడ్స్ కంపెనీకి దాసు మేనేజర్‌గా వున్ననూ తన సాధారణ జీవనాన్ని మాత్రం కొనసాగిస్తూ వుంటాడు. దాసు వ్యక్తిత్వం అంత గొప్పది కాబట్టే సంధ్య వివాహం చేసుకోకుండా దాసును హృదయంలో నిలుపుకుని జీవిస్తుంటుంది. ఆమె తాత రాయుడుకు ఆ విషయం తెలిసినా సంధ్య ప్రేమ విషయం దాసుకు తెలియకుండా జాగ్రత్త పడతాడు. కారణం దాసు గంగను మరిచిపోలేని స్థితిలో వుండడం. సంధ్య వివాహం చేసుకోకుండా ఒంటరిగా వుండడానికి వివరణను ఇస్తూ తన తాత రాయుడుతో **"దాసు తన జీవితంలో లేని ఎప్పటికీ రాలేని గంగను హృదయంలో నిలుపుకుని జీవితాంతం బతకగల్గినప్పుడు, మన ముందే, మనతోనే వుండే దాసును హృదయంలో నిలుపుకుని నేను జీవితం మొత్తం బతకడం నాకు పెద్ద కష్టమేం కాదని"** చెప్తుంది. చిత్ర సమాప్తం కూడా దాసు గంగ జ్ఞాపకాలను మోస్తూ కొడుకుతో కలిసి కడలి తీరాన్ని గంగ ఒడిగా భావించి జీవిస్తున్నట్లుగా ముగించడం ప్రేక్షకుడి హృదయాల్లో బరువును నింపుతుంది.

రాయుడు పాత్రలో కె.విశ్వనాథ్ మొదటిసారిగా నటించినా పాత్ర తీవీకి తగిన రీతిలో చక్కని ఆహార్యంతో నటించారు. రాయుడు పాత్రలో వుండాల్సిన పెద్దరికాన్ని నటిస్తూనే, వ్యాపారవేత్తలు తమ వ్యాపారాల్లో వారి వద్ద పనిచేసే ప్రజలకు భాగ్యస్వామ్యాన్ని కల్పిస్తే ఎలా వుంటుంది? అనే ఒక ఆదర్శవంతమైన ఆలోచనకు నాంది పలికారు. సమసమాజ స్థాపనే ధ్యేయంగా పనిచేసే వామపక్ష భావజాలానికి దగ్గరైన ఆలోచనను రాయుడు పాత్ర ద్వారా తెలియపర్చారు. చిత్రంలో కథానాయకుడిగా నటించిన కమల్ హాసన్ దాసు పాత్రలో చేపలు పట్టి జీవించే అతి సామాన్యమైన పాత్రను పోషించడంలో సగటు మనిషిని గుర్తుకు చేస్తాడు. గంగ మరణం తర్వాత ఆమె మరణ విషయం రాయుడుకు తెలియనీయకుండా జాగ్రత్తపడుతూ ఆమె వియోగ బాధను అభినయించిన తీరు అద్భుతం. బెస్త కులానికి చెందిన వాళ్ళ జీవన విధానం ఎలా వుంటుందో తెలియపర్చేలా సాగే మైమ్ అనుకరణ ఘట్టంలో కమల్ హాసన్ నటన, హావభావాలు మరో స్థాయిలో వుంటాయి. ఆయన




గతంలో "వసంత కోకిల" చిత్రంలో ఇలాంటి ఘట్టంతో కూడిన సన్నివేశంలో నటించారు. అది కోతులు ఆడిస్తూ జీవించే మనిషి కోతిని ఆడించే విధానాన్ని అనుకరిస్తూ కోతిలా నటించే సన్నివేశం. ఏదేమైనా దాసు పాత్రలో ఆయన చేపలు పట్టి బతికే సగటు మనిషిలా జీవించారనడంలో సందేహం లేదు.

చిత్రంలో మరొక ప్రధాన పాత్ర గంగ(ఆమని). ఆ పాత్ర నిడివి చాలా తక్కువే అయినా ప్రేక్షకుల హృదయాలను కదిలించే రీతిలో పాత్ర చిత్రణ, నటన వుంటుంది. అమాయకత్వం, తెగింపుల కలబోతగా నిలిచే పాత్రలో ఆమని నటన చిత్రానికి ప్రధానికి బలం. ఈ చిత్రంలో ఆమె నటనకుగానూ నంది అవార్డు కూడా లభించింది. దాసు- గంగల ప్రేమ సన్నివేశాల్లో వారి నటన చాలా సహజంగా వుంటుంది. గంగతోపాటు మరొక పాత్ర సంధ్య(ప్రియా రామన్). రాయుడు మనుమరాలిగా విదేశాల నుండి వచ్చిన అమ్మాయి చలాకీతనం, అల్లరితనంతో కూడిన వ్యక్తిత్వం కలది. చిత్ర పతాక సన్నివేశానికి ఆ పాత్రలో వచ్చే మార్పు పరిణతితో కూడినదై భావోద్వేగాలను నియంత్రించుకుంటూ పరిస్థితులను అర్థం చేసుకుని ముందుకు సాగే స్వభావం గల అమ్మాయిగా కన్పిస్తుంది. వీరితో పాటు కేశవ పాత్రలో గొల్లపూడి మారుతీరావు నటన రాయుడు స్నేహితుడిగా పరస్పరం గౌరవ, సహకారాలతో కొనసాగే మైత్రీ భావాన్ని చూపుతుంది. కష్టనష్టాల్లో స్నేహితుడికి బాసటగా నిలిచే తత్వాన్ని తెలియజేస్తుంది. పోస్టుమెన్ పాత్రలో సాక్షి రంగారావు పాత్ర ప్రజలకు వచ్చే ఉత్తరాలను వాటి ప్రాధాన్యతను అనుసరించి అందజేయడం అనేది అతడికి మనుషులపై వుండే మానవత్వ దృక్పథాన్ని, జాలిని వ్యక్తపరుస్తుంది.

కె.విశ్వనాథ్ చిత్రాలు సంగీతం, సాహిత్యం, నృత్యాలకు పెట్టింది

# కొట్టివేతలు

కొత్తగా ఏదో వ్రాయాలని
అతను తపన పడుతున్నాడు
ఒక వాక్యం
రెండో వాక్యం
రచన కొనసాగుతుంది.
ఇంకా పుట పూర్తవలేదు.
ఒకసారి చదువుకున్నాడు
భావన సిరాలో ఒలకలేదు
బహుశా కవిసమయం కావచ్చు!
గాలి మార్పు కోసం
బయటకి వెళ్ళాడు
ఇంతలో...
నాలుగో పంక్తి బాగుందని
ఆరో పంక్తి అలిగింది
ఏడో పంక్తి ఎగురుతుందని
అంత మిడిసిపాటు ఎందుకని
రెండు, మూడు పంక్తులు
వ్యంగ్యంగా మూలిగాయి.
అయిదో పంక్తి అడ్డంగా ఉంది
మమ్మల్ని చేరనీయదు అని
ఎనిమిది, తొమ్మిది పంక్తులు
జంటగా అరిచాయి.
పట్టుమని పది వాక్యాలు లేవు
ఎవరి వాదం వారిదే!
"ఎన్ని కొట్టివేతల తరువాత
నేను బయట పడ్డానో
మీకేం తెలుసు?!"
అని మొదటి పంక్తి పలికింది.

**కుడికాల వంశీధర్**
ఫోన్ : 988 520 1600

పేరు. ఆ పేరును స్థిరపరచడంలో "శుభసంకల్పం" చిత్రం కూడా తన ప్రభావాన్ని చూపింది. ఈ చిత్రానికి సంగీతం ఎం.ఎం.కీరవాణి అందించారు. ఈ చిత్రానికి గానూ సంగీత విభాగానికి ఫిలింఫేర్ అవార్డు లభించింది. అంతేకాక అయిదు నంది అవార్డులు వివిధ విభాగాల్లో లభించాయి. చిత్రానికి సాహిత్యం వేటూరి సుందరరామ మూర్తి, సిరివెన్నెల, వెన్నెలకంటి అందించారు. చినుకులన్నీ కలిసి చిత్రకావేరీ/ చివరికా కావేరి కడలిదేవేరి అంటూ సాగే పాట చిత్రీకరణ ప్రేక్షకుడిని విషాదంలోకి నెట్టివేస్తుంది. సిరివెన్నెల సీతారామశాస్త్రి రాసిన నీలాల కన్నుల్లో సంద్రమే/ నింగినీలమంతా సంద్రమే పాట హైలెస్సో హైలెస్సా అంటూ జానపద రీతిలో మొదలవుతుంది. వేటూరి రాసిన సీతమ్మ అందాలు– రామయ్య గోత్రాలు పాట చిరస్థాయిగా ప్రేక్షకలోకంలో నిలిచింది. అంతేకాక సాగర సంగమం చిత్రంలోని నరుడి బ్రతుకు నటన/ ఈశ్వరుడి తలపు ఘటన పాటను ప్రధాన సన్నివేశంలో వేటూరి కలం చేత 'ఆదివిష్ణు పాదమంటి/ ఆకశాన ముగ్గు పెట్టి/ జంగమయ్య జంట కట్టి/ కాశిలోన కాలుపెట్టి/ కడలి గుడికి కదిలి పోయె గంగా,,' అంటూ మరోసారి చిత్ర కథకు అనుగుణంగా విరబూసేలా చేశారు. ఇలాంటి అద్భుతమైన పాటలన్నీ వెరసి "శుభసంకల్పం" చిత్రం ఉత్తమ సంగీత, సాహిత్యాలకు వేదికైందని చెప్పొచ్చు. ఇక ఈ చిత్రానికి సంభాషణలు గొల్లపూడి మారుతీరావు అందించారు. దాసును మనసులో నిలుపుకొని వివాహం చేసుకోకుండా అతడి జ్ఞాపకాలతో జీవిస్తున్న సంధ్యను గురించి రాయుడు గారు దాసుతో చెప్పే మాట **"కులం కన్నా గుణానికి, తరం కన్నా అంతరానికి పెద్ద పీటవేసింది నా మనుమరాలు"** అంటూ సాగే సంభాషణ సంధ్య ప్రేమలోని గొప్పదనాన్ని చెప్తుంది.

కె.విశ్వనాథ్ కథల్లో ఎక్కువ మొత్తంలో మంచి పాత్రలకు ప్రాధాన్యతను ఇచ్చి ఏ ఒక్క చెడ్డ పాత్రో చేసే చెడు సంఘటనల వల్ల పాత్రల మధ్య సంఘర్షణ, భావోద్వేగాలు ఉత్పన్నమయ్యేలా చేసి సగటు మనిషి జీవితంలోని ఆటుపోట్లను గుర్తుకు చేస్తూ వాటిని ఎదుర్కోవడానికి "శుభసంకల్పం" తో ముందుకు సాగడమే గొప్ప మార్గంగా ఈ చిత్రం ద్వారా సూచించారు.

చలన చిత్రం : శుభసంకల్పం
విడుదల : ఏప్రిల్ 28, 1995
తారాగణం : కమల్ హాసన్, ఆమని, కె.విశ్వనాథ్, ప్రియా రామన్, గొల్లపూడి మారుతీరావు, కోట శ్రీనివాసరావు, నిర్మల, సాక్షి రంగారావు తదితరులు
సంగీతం : ఎం.ఎం.కీరవాణి
సాహిత్యం : వేటూరి, సిరివెన్నెల, వెన్నెలకంటి
నిర్మాణ సంస్థ : శ్రీ కోదండపాణి ఫిల్మ్ సర్క్యూట్స్
నిర్మాత : ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం
కథ, స్క్రీన్ప్లే, దర్శకత్వం : కె. విశ్వనాథ్

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 2 (51) హైదరాబాద్ డిసెంబర్ : 2022

# అందెశ్రీది పాటంత జీవితం

**ఎం. విప్లవ కుమార్** ఫోన్ : 95152 25658



Ande Sri

ఈ నేల అద్భుతమైన గనులు, మణులు, మాణిక్యాలు, ఎన్నో సహజ వనరులను తన గర్భంలో నిక్షిప్తం చేసుకుని ఉంటుంది. అడవులు, నదీనదాలు, ఎడారులు, కొండలు, గుట్టలు, అగ్ని పర్వతాలను తన ఎదమీద రక్షణగా నిలుపుకుంటుంది. అలాంటి అగ్నిపర్వతాలలో ఒక నడిచే అగ్నిపర్వతం అందెశ్రీ. సమస్త లోకాన్ని సహజ సైనికుడై చుట్టి వస్తూ, కవిత్వ కవాతు చేస్తున్నవాడు. అమ్మవాక్కును ఆకాశవాణిలా కాకుండా భూలోక బాణిలా వినిపిస్తూ మోగుతున్నవాడు. అగ్నిపర్వతం చూడ్డానికి బుద్ధిగా, ఒద్దికగా కనిపించినా, కాలక్రమ ధ్వంసాన్ని, కాలగర్భిత హింసను భరించి, భరించి కడకు సహించలేక ప్రచండ ప్రళయాగ్నులై బద్ధలౌతుంది. సరిగ్గా అందెశ్రీ పాట కవిత్వం కూడా అంతే. స్వల్ప కాలానికో, అల్ప కారణానికో లెక్కగట్టి కాదు. పాలకపక్షం కానీ, ప్రతిపక్షం కానీ, ఆధిపత్యం కానీ మానవాళిపై, సమస్త భూమండలంపై చేస్తున్న దుర్మార్గాలను చూసి తట్టుకోలేదు. అవి పరాకాష్టకు చేరినపుడు తనలోని ఆగ్రహమనే వేడితో ఆ నిలువెత్తు అగ్నిపర్వతం బద్దలై, ఉష్ణమండల ప్రవాహ లావా ఉబికివస్తుంది. అక్షర ప్రళయాగ్ని అయి ఎగిసిపడుతుంది. ఆ అన్యాయంపై పాటల పాదాలతో ఓ దగ్ధనిర్మిత జడివాన వర్షిస్తుంది. తన కంఠం ఫెడేల్మని మోగే ఉరుముల శబ్దమై గర్జిస్తుంది. అలా వేడి వేడి లావా నేలపై పరుచుకున్నట్టు, అనారోగ్య పీడితున్ని ఉపశమనపరుస్తూ ఔషధం గొంతులోపలికి దిగినట్టు, అందెశ్రీ పాట **"జన జాతరలో మనగీతం జయకేతనమై ఎగరాలి / ఝుంఝూ మారుత జన నినాదమై జేగంటలు మోగించాలి / ఒకటే జననం ఓహొూహొూ.. ఒకటే మరణం ఆహాహా.. / జీవితమంతా ఓహొూహొూ.. జనమే మననం ఆహాహా../ కష్టాల్ నష్టాల్ ఎన్నెదురైనా కార్యదీక్షలో తెలంగాణ/ జై బోలో తెలంగాణ"** అంటూ మెల్లగా మన నరనరాల్లోకి, జవజీవాల్లోకి తన అక్షరాల ఆకుపసరును ఒంచి పదునెక్కించడం మనమంతా కళ్ళారా చూశాం. తనువారా అనుభవించాం. కడదాకా జ్వలించాం.

తెలంగాణ ఎర్రని మాగాణంలో ఎక్కడజూసినా గద్దర్, గోరటి వెంకన్న, జయరాజుల్లాంటి వాళ్ళకు కొదవలేదు. అయితే వీరందరూ చదువుకుని ప్రత్యక్ష పోరుబాటలోంచి వచ్చినవాళ్ళు. కానీ అందెశ్రీ అలా కాదు. వారందరిలోకెల్ల వైవిధ్యమైనవాడు. అయినా తనమీద వేరే ఏ ప్రభావాలున్నా విప్లవోద్యమ ప్రభావం కూడా బలంగానే ఉంటుంది. తనే చెప్పుకున్నట్లు సుద్దాల హనుమంతు పాట **"పల్లెటూరి పిల్లగాడ పసులగాసే మొనగాడ/ పాలు మరిచి ఎన్నాళ్ళైందో/ ఓ పాలబుగ్గల జీతగాడ కొలువు కుదిరి ఎన్నాళ్ళైందో"** పాటంతా ఆయన జీవితమే. కనుక ఈ పాట ఆయనను కమ్మేసింది. అంతకు ముందెన్నడూ ప్రజా ఉద్యమాల్లో పాల్గొనకపోయినా, పాలబుగ్గల జీతగాడుగా ఉన్న కాలంనుంచే ఆయన మెదడును ప్రజా ఉద్యమగాలి ఆవహించింది. ఆ రీతిగా తనకు తెలియకుండానే ఉద్యమాలను చదువుకున్నడు, ఆకళింపు చేసుకున్నడు. అంతే తప్ప ఏనాడు కన్నప్రేమకు, కలం ప్రేమకు నోచుకున్నోడు కాదు. కాబట్టే ఆ బాధలు మరిచిపోవడానికి పద్యం శరణుజొచ్చినాడు అందెశ్రీ. అలాంటి అక్షరం ముక్కరాని, ఏనాడు బడి మొఖం చూడని సామాన్యుడు ఇవాళ అందరి బాధలు తీర్చేందుకు పాట ఆయుధాన్ని భుజాని కెత్తుకొని ధైర్యంగా కైతల కవాతు చేస్తున్నాడు. అందరికీ నేనున్నా అంటూ బలమిచ్చి, ఉత్తేజం నింపడం నిజంగా గర్వకారణం. ఆ వైవిధ్య ఆగమనం వల్లనే కావచ్చు, భిన్నంగా రాయడంకోసం, పాటకు కొత్త జీవం అద్దడం కోసం కావచ్చు అప్పటిదాక రాస్తున్న వారిని ఎరువుగా, ప్రజలను పందిరిగా చేసుకొని, ప్రజా పాటను పరాకాష్టగా నిలబెట్టడం కోసం తపిస్తున్నవాడు అందెశ్రీ. బహుశః పోతన పుట్టిన నేలమీద పుట్టినవాడవడం చేత కావచ్చు, అందెశ్రీ రాజ్యాలకు, రాజులకు, రాజ్య ప్రాకారాలకు పాటను తాకట్టు పెట్టనని శపథం తీసుకున్నవాడు. నేటి పాటల పరాయీకరణ యుగంలో అందెశ్రీ ప్రజలకు తప్ప దేనికీ, ఎవరికీ తలవంచనని ప్రకటించడం అత్యంత సాహసమే కాదూ, సమరపు ధైర్యం కూడా. ఇలాంటి మచ్చు తునకలను చూసే కాబోలు **"ఇక్కడి మనుషులు మనుషులుగానే జీవిస్తున్నారు"** అంటాడు ప్రసిద్ధ చరిత్రకారుడు జయధీర్ తిరుమలరావు. అంతే కాదు ప్రతి ఇంటిలో పటంగట్టి గోడలకు తగిలించాల్సిన ఎన్నో పాటలు రాశాడు అందెశ్రీ. **"కొమ్మ చెక్కితే బొమ్మరా కొలిసిమొక్కితె అమ్మరా/ ఆదికే ఇది పాదురా**

**కాదంటె ఏది లేదురా"** అని ప్రకృతీ తత్వాన్ని, మానవజాతి తొలి జీవన గమనాన్ని, మాతృస్వామిక వ్యవస్థ గొప్పతనాన్ని వివరిస్తాడు. జానపదుల జీవిక, గ్రామ దేవతల భూమికకు చిత్రిక పడతాడు. ఈ ప్రపంచీకరణ యుగంలో మారుతున్న, యాంత్రికమై, మాయమై పోతున్న, మనిషిని వెతుకుతూ విలపిస్తాడు. భక్తి పేరుతో జరుగుతున్న బహుళ వ్యాపారాన్ని, ఆధ్యాత్మికత పేరుతో చేస్తున్న మతోన్మాద దుర్మార్గాలను ఖండిస్తాడు. అందుకే **"మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు/ మచ్చుకైనా లేదు చూడూ మానవత్వం వున్నవాడూ/ నూటికో కోటికో ఒక్కడే ఒక్కడు/ యాడవున్నాడో కాని కంటికీ కనరాడు"** అంటూ భక్తి, ముక్తి, రక్తిల అంతర్ వ్యాపార స్వభావాన్ని ఎండగడతాడు. ఆధ్యాత్మికత అంటే బుద్ధుడిలా ఉండటమే తప్ప ఇప్పుడు చూస్తున్న కుప్పిగంతులు, క్షుద్ర విద్యలు కావని బుగులుపడతాడు. **"కుక్కనక్కల దైవరూపాలుగా కొలిసి/ పంది నందిని జూస్తే పడి మొక్కుతుంటాడు/ చీమలకు చక్కెర పాములకు పాలోసీ/ జీవకారుణ్యమే జీవితము అంటాడు/ తోడబుట్టిన వాళ్ల ఊరవతలికి నెట్టి/ కులమంటు ఇల మీద కలహాల గిరిగీసి"** అంటూ ఈ పాటలో జంతువులను మొక్కడం కాదు మనుషులను మనుషులుగా చూడటం నేర్చుకోవాలని కోరుతుంటాడు. ఆవుల కోసం మనుషులను చంపుతున్న నేటి మతస్వామ్యం రాజ్యమేలుతున్న ఈ కాలంలో అందెశ్రీ పాట అత్యయిక అవసరం అనిపిస్తుంది. జీవితాన్ని చిత్రించేప్పుడు కళ నిరంతర జీవధార అవుతుంది. ఆవిధంగా అందెశ్రీ తన పాట ద్వారా జీవితాలను చిత్రించే పనిలో నిమగ్నమై జీవధారగా సాగుతున్నాడు. ఆ క్రమంలో తన జీవితంలోకీ, గడిచిన చరిత్రలోకీ తొంగి చూసుకుంటాడు. అలాంటి సందర్భంలో తన రేఖాచిత్రంలో సుద్దాల హనుమంతు లాంటివారు కనపడతా రంటాడు.

ఇప్పుడు అదే సందర్భం. సినీగేయ రచయితగా ప్రఖ్యాతి గడించిన సుద్దాల అశోక్ తేజ, తన కుటుంబ సభ్యులంతా తమ తల్లిదండ్రుల జ్ఞాపకంగా నెలకొల్పిన సుద్దాల హనుమంతు జానకమ్మ జాతీయ పురస్కారం ఈ ఏడాది అందెశ్రీకి అందిస్తున్నారు. మట్టిని, మట్టి పరిమళాన్ని ఒళ్ళంతా పులుముకుని, నరాల బిగువున పొలాలు దున్ని, కరాళ బలమున వరాలుతీసి, పంట పండించిన నిజ పాలబుగ్గల జీతగాడిని అవార్డు వరించడం నిజంగా అభినందనీయం. అయితే సుద్దాల హనుమంతు పాట వింటూ పెరిగిన అందెశ్రీకి, హనుమంతు పాటలకు బలమైన సారూప్యతలున్నాయి. వారి పాట ఎల్లెడలా రాజ్యంపై ధిక్కార స్వర పతాకమై ఎగురుతూనే ఉంటుంది. నాడు పల్లెటూరి పిల్లగాడ పాట వెట్టి చాకిరీ విముక్తికి జాతీయ గీతంలా ధ్వనిస్తే, నేడు అందెశ్రీ "జయజయహే తెలంగాణ" పాట రాష్ట్రావతరణకు జాతిగీతమై జ్వలించింది. నాడు సుద్దాల ఎర్రకోటమీద ఎర్రజెండా ఎగరవేసే ప్రజారాజ్య నిర్మాణంకై కలలు కన్నాడు. అది జరిగితే తప్పేంలేదు కానీ జరగట్లే. అందుకోసం బలి అయిన వారి త్యాగాలు వృథా పోకుండా సుద్దాల కోరుకున్నది జరగడానికి, వారు అనుకునే సిద్ధాంతాన్ని ఇండియనైజ్ చేస్తే బాగుండునని భావిస్తాడు అందెశ్రీ. ఓ మానవీయ ఉన్నతోన్నత సమసమాజాన్ని కాంక్షించే అందెశ్రీ పాట మరింత ప్రజ్వరించాలని కోరుకుందాం.

(సుద్దాల హనుమంతు జానకమ్మ జాతీయ పురస్కారాన్ని అందెశ్రీ అందుకున్న సందర్భంగా...)

---

## గోసి



రెండు కొండల మద్దిల పారే ఏరులా
రెండు పిర్రల మద్దిల గోసి
గోసి మా అచ్చియ్యితాత కాల వంకీల
పూసిన నెలవొంక
అచ్చియ్యి బొట్టి ఆజి వొప్పుడూ అనీది
లెగిసిన కాసి తొంగునె దాక తాత
గోసిని వొగ్గడని గోసి తాతకి
అచ్చొచ్చిందని
యేసీకాలం నేదు సలికాలం నేదు
ఏ కాలమైతేటి తాత పిర్రల మద్దిల
గోసి మాతరం వుండాల

సిన్నోలిమి గోసిని సూసి యెటకరిత్తె
గోసికాడ నువ్వేపాటిరా అని తత్వం
జెప్పోడు
మా తూరుపోల బతుకు
గోసికి జబర గుండారకి కురస అంతారు
మావూల్లో
గోసని గోసోడని సులగ్గ తీసిపారీవొద్దొరే
నాయినలారా
మా తూరుపు గెడకర్ర మీద
రెపరెపలగ ఎగిరె అస్తిత్వపు జెండా
మా గోసి

**చంపావతి**
ఫోన్ : 967 649 3680

# కందుకూరి సంఘసంస్కరణ – అధిక్షేప రచనలు

**డా. కె.వి.ఎన్.డి. వరప్రసాద్, ఫోన్ : 94909 21345**

సంఘసంస్కరణకు నడుం బిగించిన వీరేశలింగంగారు దాని సమర్థ సాధనకు సాహిత్యాన్ని కూడా ఆయుధంగా ఉపయోగించు కున్నారు. ఆయన కాలంలో మూఢాచారాలు, దురాగతాలు, మూఢ నమ్మకాలు ఎక్కువగా ఉండేవి. నాడు ప్రజలలో విద్యావంతుల శాతం బాగా తక్కువ. చదువుకొన్న స్త్రీల సంఖ్యను లెక్కిస్తే బహు తక్కువ. అంతేకాకుండా బాల్యవివాహాలు, వృద్ధవివాహాలు ఎక్కువగా ఉండేవి. మరోవైపు వేశ్యల వలన ఎన్నో సంసారాలు ఆర్థికంగా చితికిపోయాయి. అంతేకాక వేశ్యలను ఉంచుకోవడం అనేది సంఘంలో మర్యాదగాను, రసికతకు గుర్తుగా ఉండేది. ఇక లంచగొండితనం ఉద్యోగులలో వెర్రితలలు వేసి ఉంది. దయనీయ మైన స్థితిలో ప్రతి ఇంటిలోను వితంతువులు ఉండేవారు. 1881 జనాభా లెక్కల ప్రకారం పెళ్ళైన ఏడాదిలోపులోనే వితంతువు లైనవారు సుమారు 800 వరకు ఉన్నారని బ్రహ్మర్షి రఘుపతి వేంకటరత్నం నాయుడుగారు ఒక సభలో చెప్పిన సంగతిని ఎవ్వరినైనా ఆలోచింపచేస్తుంది. హిందూ సమాజంలో స్త్రీ జనాభాలో ప్రతి ఆరుగురు ఆడవారిలో ఒక వితంతువు తప్పనిసరిగా ఉండేదని రఘుపతి వేంకటరత్నంనాయుడుగారు చెప్పేవారు. ఈ విషయాలన్నీ గురజాడ అప్పారావుగారు కన్యాశు ల్కం పీఠికలో చెప్పారు. మూడు ఏళ్ళ సమయంలో కన్యాశుల్క వివాహాలు వెయ్యికి మించి నమోదు అయ్యాయని అప్పారావుగారు రాయడాన్ని గమనించాలి. అందుకనే గురజాడవారు ఈ భయంకరమైన దురాచార పరిస్థితిని వివరిస్తూ కన్యాశుల్కం పీఠికలో “Such a Scandalous state of things is a disgrace to society” అనడం గమనార్హం.

సహజంగానే అక్రమాలను ఎదిరించే స్వభావం ఉన్న వీరేశలింగం పంతులుగారు ఈ పరిస్థితుల్ని ఎదుర్కోవలసి వచ్చింది. ఆయనకు 20 సంవత్సరాల ప్రాయంలో భూతవైద్యం, మంత్రతంత్రాలు, వశీకరణ విద్యలు, వేశ్యాలంపటం మొదలైన దురాచారాలన్నింటికీ కారణం స్త్రీలకు విద్య లేకపోవటమే అని గ్రహించారు. స్త్రీలు విద్యావంతులు కానంతవరకు మనదేశం బాగుపడదని, మన అభివృద్ధి అంతా స్త్రీల అభివృద్ధిలోనే ఉన్నదనే నిర్ణయానికి వచ్చి స్త్రీజనాభ్యుదయానికై విశేషంగా కృషి చేశారు. ఒక చేతితో సంఘసంస్కరణకు కృషి చేస్తూ మరో చేతితో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన సవ్యసాచి వీరేశలింగం. జడత్వంతో ఉన్న సంఘాన్ని చైతన్యపరచటంలో సాహిత్యం పాత్ర అనూహ్యం. తమ చెడు ప్రవర్తనకు సిగ్గుపడుతూ తలవంచుకొని నవ్వుకొని తమ ప్రవర్తనను మార్చుకోవాలని నిర్ణయించుకోవడానికి అధిక్షేపం పనికి వచ్చినంతగా తక్కిన సాహిత్యం పనికిరాదు. మెత్తమెత్తగా కొట్టినట్లుగా అధిక్షేపం ఉపయోగపడుతుంది. **“తెలుగు సాహిత్యంలో అధిక్షేపాన్ని అత్యంత బలమైన సాధనంగా ఉప యోగించుకున్న వారిలో వీరేశలింగంగారు ఆద్యులు”** అన్న అక్కిరాజుగారి మాటలు అక్షర సత్యాలు.

తెలుగు సాహిత్యంలో సాంఘిక ప్రయోజన శీలమైన అధిక్షేపానికి ఒరవడి దిద్దినవాడు వీరేశలింగం గారే. అధిక్షేపం అనే మాటకు ఎత్తిపొడుపు అని అర్థం. వ్యంగ్యం, పరిహాసం, అవహేళన, వేళాకోళం, వెటకారం ఇవన్నీ అధిక్షేపానికి దగ్గర బంధువులు. నాడు సంప్రదాయ వాదులు, పండితులు కందుకూరి మొదలైన సంఘ సంస్కరణ వాదుల వాదనలను ఒప్పుకోని కారణంగా స్త్రీల విషయమై వీరేశలింగంగారు కొన్ని అధిక్షేప రచనలు చేయవలసి వచ్చింది. ప్రత్యర్థులపై విమర్శలు చేయడానికి వ్యంగ్యాస్త్రాలు విసరడానికి వీరేశలింగంగారికి అధిక్షేప రచనలు బాగా పనికి వచ్చాయి. ఆరోజుల్లో వీరేశలింగంగారికి ప్రత్యర్థి కొక్కొండవారు. ఆయన సంఘంలో వచ్చే మార్పుల్ని తొందరగా జీర్ణించుకోలేని వారు. అందువల్ల వీరేశలింగంగారిని ఆయన తన పత్రికలో అపహాస్యం చేస్తూ ఉండేవారు. వీరేశలింగంగారి ‘వివేకవర్ధిని పత్రిక’ను ఆయన వేళాకోళం చేసేవారు. దానితో పంతులుగారికి ఆవేశం ఎక్కి కొక్కొండవారి ‘ఆంధ్రభాషా సంజీవని’ని వేళాకోళం చేయడం మొదలు పెట్టారు. అప్పటికి పంతులుగారి వయస్సు 26 ఏళ్ళు మాత్రమే. వీరి విమర్శ, ప్రతివిమర్శ ఏ స్థాయిలో ఉండేవంటే **“కొక్కొండవారు స్త్రీలకు విద్య కూడదు అని ప్రకటిస్తే, వీరేశలింగంగారు పురుషులకు విద్యకూడదు అని వెంటనే ప్రకటించేవారు”.** ఈ సందర్భంగానే వీరేశలింగంగారు బ్రహ్మ వివాహం, వ్యవహార ధర్మబోధిని వంటి ప్రహసనాలు రాశారు.

**వీరేశలింగంగారి అధిక్షేప రచనలు** : వీరేశలింగంగారివి నాలుగు అధిక్షేప రచనలు లభిస్తున్నాయి. ఒకటి – సరస్వతీ నారద విలాపం, రెండు – అభాగ్యోపాఖ్యానము, మూడు – సత్యాద్రౌపదీ సంవాదము, నాలుగు – శ్రీసత్యరాజాచార్యకృతాంధ్రీకృత నవరత్నమంజరి.

సరస్వతీ నారద విలాపం చక్కటి అధిక్షేప రచన. నాటికే తెలుగు సాహిత్యంలో విరివిగా వచ్చిన కవులు తమ సామర్థ్యాన్ని నిర్లక్ష్యంచేసి సాహిత్యపరమైన దొమ్మరి విద్య ప్రదర్శించడం వీరేశలింగంగారికి నచ్చలేదు. పద్యంలో పద్యం, పాదంలో పాదం దూర్చటం వంటివి, ఆశు, గర్భ, చిత్ర, కవితా క్రీడలు ఆయనకు వెగటు కలిగించాయి. దేవుడిచ్చిన కాళ్ళతో నడవకుండా పొట్టతో

దేకడంలా పండితులు పాండిత్యాన్ని ప్రదర్శిస్తున్నారని ఈసడించుకున్నారు. సృజనాత్మక మైన ప్రతిభ కవులలో తగ్గిపోతే ఇటువంటి విపరీతాలు సంభవిస్తాయని ఆయన వేళాకోళం చేస్తూ చేసిన అధిక్షేప రచనా విశేషమే సరస్వతీ నారదవిలాపం. తర్వాత తర్వాత సాహిత్యం సాముగరిడీల వాళ్ళ పాలైందనీ, సంగీతము సానివాళ్ళ పాలైందనీ తల్లీ కొడుకులు అనగా సరస్వతీదేవి, నారదులు ఒకచోట తారస పడినప్పుడు, సంగీత సాహిత్యాల విషయమై వారిరువురి ఆక్రందనయే సరస్వతీ నారద విలాపమనే అధిక్షేప రచన. సరస్వతీ నారద విలాపంలోని మూడు పద్యాలు మచ్చుకు.

ప్రస్తుతం వస్తున్న కవిత్వం తనకు ఏమాత్రం అర్థం కావడం లేదని కొడుకుతో సరస్వతి చెపుతున్న ఈ పద్యాన్ని చూద్దాం.

**తెలియదు సుమ్మిప్పుడు నా**
**పలుకుల యర్థంబు నాకె భావము లేమిన్**
**వెలభూషలు గాకివిసం**
**కెలలయి కదు నాదు మేనికిన్ వెత నించున్**

దానికి సమాధానంగా నారదుడు అన్న ఈ కింది పద్యాలలో ఏది కవిత్వమో, ఏది కవిత్వమో, కాదో వివరించడం బాగుంది. నారదుడు అన్నట్లు చెప్పిన ఈ కింది పద్యాలను చూద్దాం.

**"సుందర బహు రసపుష్టి న**
**మందానందంబు బుధుల మదికిడలేనిన్**
**ఛందోబద్ధంబగు పద**
**బృందదాటోపంబు తాకవిత్వంబగునే"**

**"రసములు కానే ప్రాణము**
**లసమాస కవిత్వకాంత కవనీ స్థలిలో**
**రసహీనమై కవితకు**
**బొసగించు నలంకృతి శవమునకిదు తొడవౌ"**

వీరేశలింగంగారి మరో అధిక్షేపరచన అభాగ్యోపాఖ్యానము. అభాగ్యోపాఖ్యానము పూర్తిగా నవ్విస్తుంది. అభాగ్యుడు అనేవాడు కావ్య నాయకుడు. ఊరుపేరు వ్యాఘ్రూఖ్యపట్టణం. నాయిక పేరు ఖరవాణి. ఇది ఏకాశ్వాస కావ్యం. గద్య పద్యాల గల చంపూ రచన. దీనిలోని ప్రతి వచనం నవ్వు తెప్పిస్తుంది. విరహాన్ని భరించలేకనో, ప్రతినాయకుడి దెబ్బలవలన నాయకుడు చచ్చి సున్నమైనట్లు వర్ణించాడు. ఇక్కడ పంతులుగారి వెటకారం తీవ్రస్థాయిలో ధ్వనిస్తుంది. ఇది 116 గద్య, పద్యాల రచన. అభాగ్యోపాఖ్యానంలో రెండు పద్యాలను పరిశీలిద్దాం.

**"అవ్వల నూరబంది యొకటద్దము వచ్చిన దద్భటావళుల్**
**చివ్వకు నీటెలం గొనుచు శీఘ్రము పర్విడు పంది వారలన్**
**దవ్వుల జూచిలో బెదరి దారుణ భంగిని ఘుర్ఘురింపగా**
**నెవ్వడి బారి రాభటులు నిల్వక దానికి లొంగ కుక్కనన్"**

**"శునకము రోదనంబు గతి సూకరననాదము భంగి గార్ధభ**
**స్వనము విధంబునన్ బ్రబల సైరిభరావము పోల్కిదవ్వులన్**
**వినబడె రాక్షసాధముని వీనుల కెంతయు విందుసేయుచున్**
**ఘన వినదంబు భూమిధర గహ్వరజాలము మారు మ్రోయగన్"**

వీరేశలింగంగారి సత్యాద్రౌపదీ సంవాదము కూడా చక్కటి అధిక్షేప రచన. దీనిలో అధిక్షేపం చాలా మృదువుగా ఉంటుంది. ఆనాటి సంఘంలోని అతి బాల్యవివాహాలు, బాలవింతంతువుల కష్టాలు, అనుచిత వివాహాలు, వశీకరణ ఔషధాలపట్ల భ్రాంతి ఎక్కువగా ఉండేవి. విటుల దగ్గర డబ్బులు కొల్లగొట్టే వేశ్యా స్త్రీలు, విటులను చెప్పుచేతల్లో ఉంచుకోవడానికి మందులు, మాకులు, మంత్రాలు, తంత్రాలు ఉపయోగించడంలాంటివి ఆ రోజుల్లో సాధారణంగా కనిపించేవి. ఆనాటి పరిస్థితులను ఏవగించుకున్న వీరేశలింగం పంతులుగారు భారత అరణ్యపర్వంలోని ఒక సన్నివేశాన్ని ఆధారంగా చేసుకొని సత్యా ద్రౌపదీ సంవాదాన్ని రచించారు. ప్రేమ ఇచ్చిన ప్రేమ వచ్చును అని భార్యాభర్తలకు పంతులుగా ఆనాడే బోధించడం కనిపిస్తుంది.

పంతులుగారి మరో అధిక్షేప రచన శ్రీసత్యరాజాచార్య కృతాంధ్రీకృత నవరత్నమంజరి. ఈ అధిక్షేప రచనలో స్త్రీల విషయమై పురుషాహంకారపు ప్రపంచాన్ని పంతులుగారు ఎంతగానో ఏవగించుకున్నారు. స్త్రీ జనాభ్యుదయంకోసం పంతులుగారు వకాల్తాపుచ్చుకొని రాసిన గొప్ప రచన ఇది. ఈ దేశంలో స్త్రీలు అనుభవిస్తున్న బాధలు, అవమానాలు, నిందలు, హింసలు పురుషులు కూడా అనుభవించవలసివస్తే ఎలా ఉంటుందో అనే విషయాన్ని తెలియచేసే రచన. గొప్ప హాస్యం, ప్రజ్ఞ, చమత్కారం దీనిలో కనిపిస్తున్నాయి. మచ్చుకి ఈ పద్యాలు చూడండి.

**"పురుషునకిమ్మహి బత్నియె**
**పరమంబగుదైవతంబు పత్నీసేవన్**
**నిరతముచేసెడి పురుషుడె**
**పరమున నిహమున సుఖముం బడయుంజుమ్మీ"**

**"ప్రతి దినంబును బురుషుండుపత్ని కంటె**
**ముందుగాలేచి నదిలోనమునిగి జలము**
**కలశమునదెచ్చి నిజపత్నికాళ్ళుకడిగి**
**తాను శ్రీపాదతీరంబు తాగవలయు"**

ఎలాంటి దురాచారాలులేని ఆరోగ్యవంతమైన సమాజాన్ని కోరుకున్న పంతులుగారు సమాజంలోని చెడును తొలగించడానికి సంఘసంస్కరణ, సాహిత్యాలను ఆయుధంగా చేసుకున్న సవ్యసాచి. ఆయన అధిక్షేప రచనలు సమాజంలోని దురాచార పర్వతాలకు వజ్రాయుధాలు.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 2  UGC Care List Approved Journal
హైదరాబాద్ డిసెంబర్ : 2022

# సీతారాం కవిత్వంలో మృత్యు తాత్త్వికత

**పగిడిపల్లి వెంకటేశ్వర్లు**, అసిస్టెంట్ ప్రొఫెసర్ తెలుగు, ఖమ్మం. ఫోన్ : 94913 76171



సీతారాం "ఇదిగో ఇక్కడిదాకే" కావ్యం తాను ఎందుకు రాసిందనే అభిప్రాయాన్ని తన మాటల్లో" నేను మనిషిని మనిషితో కలిపి కుట్టే కన్నీటి దారాన్ని పెనాలని కవిత్వం రాశాను. నేను నువ్వూ ఒకటే అనీ ఎక్కడ ఎవరు మరణించినా దహనక్రియలు జరిపించవలసింది మనకే అనుకుని రాశాను. నాకలా అనిపించింది. కవిత్వాన్ని నేను రాయలేదు. కవిత్వమే నన్ను రాసింది. దీన్లో చిత్రించిన చావు జీవితపు వాసన వేసింది నాకు. చిగురించిన స్వప్నం ఇది. మొలకెత్తిన వ్యథ ఇది. ఎక్కడ అని అడక్కండి. నా పోయిన గుండెలో నాకు దూరంగా పోతున్న గుండెలో మృత్యువు నవ్విన చిర్నవ్వు చూశాను. అచ్చూ నా నవ్వులాగే. అందుకే నాకు నేను చావునై వెంటాడుకుని నాకు నేను జీవితాన్నై చావును ఛేదించుకుని ఇదంతా రాయటం కోసం చేసిన ప్రయత్నమే "(ఇదిగో ఇక్కడి దాకే, సీతారాం. పుట. 68)

ఈ కావ్యంలో సీతారాం ఎక్కువ కవితలు, ఎక్కువ సార్లు చావు గురించి పలవరించాడు. అందుకే తాను రాసుకున్న తన మాటలు "వైఫల్యాల్లోంచి".. తను ఎందుకు చావు గురించి పలవరించాడో, పలకరించాడో తెలుస్తుంది." సీతారాం దు:ఖకవి, మృత్యు కవి కూడా 'ఇదిగో ఇక్కడిదాకే" మృత్యువు ప్రతీక కవిత. ఇది అచ్చుయ్యే నాటికి పట్టుమని పాతికేళ్లుండవు. ఆయన ఆ వయస్సులో మృత్యువును ఎలా పట్టుకున్నాడని ఆశ్చర్యమేస్తుంది" (సీతారాం సాహిత్యం విశ్లేషణ వ్యాసాలు, పుట. 46)

**"వెళ్ళిపోయానని**
**మళ్ళీరానని నిరాశా వద్దు**
**ఇదిగో ఇక్కడి దాకే**
**ఈ మూల మలుపు వరకే**
**మాములుగా బజారెళ్ళి వచ్చినట్లుగానే**
**ఎప్పుడో మొదలైన పయనం ఇది**
**ఎక్కడికెక్కడికో పోయి తిరిగి రావాలి కదా**
**ఇది అంతే"** (ఇదిగో ఇక్కడి దాకే. పుట1)

పై కవిత వాక్యాలలో కవి సాదాసీదాగా మాట్లాడుతున్నట్లున్న అందులో మృత్యు తాత్వికత వినిపిస్తుంది. ఒక జీవుడి వేదన గోచరిస్తుంది. " The Jiva passing from body to body, the bodies improving as his powers unfold. This is called re-birth, re- incarnation or Transmigration" (Sanatana Dharma, An Elementary Text Book of Hindu Religion and Ethics, Page 34) పుట్టటం సహజం, చావటం సహజం. మరణించిన వారు తిరిగి పునర్జన్మ పొందుతారు. కాబట్టి నిరాశ చెందవద్దని చెప్పుతున్నాడు. మరణమంటే మనం బజారెళ్ళి మాములుగా తిరిగి యింటికి వచ్చినట్లుగానే తిరిగి జన్మిస్తామంటున్నాడు కవి. ఇది ఇప్పటిది కాదు భూమి మీద ప్రాణి పుట్టింది మొదలు జరుగుతున్న ప్రకృతి ధర్మమంటున్నాడు.

**"విడిచిన బట్టలు ఉతకమని చెప్పలేదు**
**మాములుగా ఉతికేయండి**
**కన్నీళ్ళలో జాడించి పిండేరు సుమా"**
**(ఇదిగో ఇక్కడిదాకే. పుట1)**

"As a man casting off worn-out garments, taketh new ones, so the dweller in the body, casting off worn-out bodies, entereth into other that new (Sanatana Dharma Page 40) చావు పుట్టుక పాత బట్టలు విడిచి, కొత్తబట్టలు ధరించటం లాంటిది. కాబట్టి పార్థివదేహాన్ని అర్భాటాలుతో అంత్యక్రియలు చేయనవసరం లేదు. మాములుగా చేయండి అనవసర శోకాలు కూడ వద్దు అంటూనే

**"బతుకుని మోసుకుపోతున్నాను**
**మీ శోకాలు వినపడుతున్నాయి**
**మీ కన్నీటి నదులు వెనకే పంపిస్తున్నాను**
**మీరిన్నాళ్ళు కట్టేసిన సముద్రాల్ని వదులుతున్నాను"**
**(ఇదిగో ఇక్కడిదాకే. పుట 1)**

బ్రతుకు మీద ప్రీతిని, ఆశను ప్రదర్శిస్తున్నాడు. అందుకే ఇప్పటి దాక బ్రతికిన బ్రతుకున్ని గురించి మాట్లాడుతున్నాడు. ఈ భూమి మీద బ్రతికిన బ్రతుకంతాలోని భోగభాగ్యాలు, కష్టనష్టాలు, సుఖ

# నా కావ్య బంధువు

నేను ఇప్పుడు వాన నీటిలో
కాగితపు పడవనై తేలిపోతున్నాను
నేనిప్పుడు కలల వర్షంలో
సంతోషపడుతూ ఉన్నాను
మబ్బుల గుండెల్లోంచి
పంపు వర్షించినట్టు
ఒకటే కుండ పోత
వర్షించాలని ఆరాటపడుతున్నా
మా ఊరి కొండపై నుండి
వెండి జలపాతాలు సాగి వస్తున్నాయి
అక్కడక్కడ వరద
కాలువలు కాలువలై
కొండలపై నుండి శరవేగంగా
జలపాతాల ఝురి గా పడుతున్నాయి
ఈ వర్షం నా కావ్య బంధువు
నా అక్షరాల సింధువు
గుండెలోని తడిదనాన్ని
నింపుతూ ఉన్నది





డా. సిహెచ్ ఆంజనేయులు
ఫోన్ : 770 253 7453

సంతోషాలు, ప్రేమానురాగాలు, రాగద్వేషాలన్ని మోసుకుపోతున్నానని చెప్పుతున్నాడు. తనకోసం శోకించే మనుష్యులకై ఆన్వేషణ సాగిస్తున్నాడు. తను చస్తే నలుగురు ఏడ్వాలని, తన శవం నలుగురు మోయాలని కోరుకోవటం మానవ సహజ లక్షణం కదా.

**"వచ్చాను కనుక పోక తప్పదు**
**తిరిగి రావటానికే పోతున్నది" (ఇదిగో ఇక్కడిదాకే. పు.ట 1)**

ఈ కవిత వాక్యాలు భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునుడికి ఉపదేశించిన గీతాసారంలోని వాక్యాలు స్ఫురణకు తెస్తున్నాయి.

**"జాతస్య హి ధ్రువో మృత్యుర్ధ్రువం జన్మ మృత్యస్య చ!**
**తస్మాద పరిహార్యేర్థే న త్వం శోచితుమర్హసి!!"**

పుట్టిన వానికి మరణము తప్పదు మరియు మరణము పిదప జన్మము తప్పదు కావున అనివార్యమైన నీ విధ్యుక్త ధర్మ నిర్వహణము నందు నీవు దు:ఖింపరాదు. (భగవద్గీత యథాతథము శ్రీశ్రీల ఏ.సి.భక్తి వేదాంత స్వామి ప్రభు పాదులు, ద్వితీయాధ్యాయము, శ్లోకం 27, పుట.120) ఈ కవితలో కవి తన మరణాన్ని తానే వైయక్తంగా చూసినప్పుడు ఇదొక Auto elegy (స్వీయ స్మృతి కవిత) అవుతుంది. కవి సమాజం యొక్క చావును చూసినప్పుడు సామాజిక స్మృతి గీతమవుతుంది. కవి సమాజ చావును ఎలా చూసాడదనేది ప్రశ్న. కవి సమాజ చావును భౌతికంగా చూసాడా, సాంఘికంగా చూసాడా, నైతికంగా చూసాడదనేది ముఖ్యమైనాంశం. ఇక్కడ కవిని సమాజాన్ని విడదీసి చూడలేము. ఇద్దరు పరస్పర పూరకాలు కాబట్టి కవి తను చావు గురించి మాట్లాడుతున్నప్పుడు సమాజముంటుంది. సమాజం గురించి మాట్లాడుతున్నప్పుడు తనుంటాడు. ఇందులో కవికి చావు పట్ల నిరాశ ఉందని చెప్పలేము. కాని మళ్ళీ పుట్టుతాననే ధీమా ఉంది. అది మనిషిగానే, కవిగానే పుట్టుతాననే ధీమా కన్పిస్తుంది. **"ఎంతటి భౌతిక వాదికైనా మృత్యువూ, దాని అనంతర సన్నివేశాలు కొంత నైరాశ్యానికి, వైరాగ్యానికి లోను చేస్తాయి. సీతారాం భౌతికవాది కాడు. మృత్యువును ముఖాముఖీ చూడటానికి దాన్ని ఆమోదించటానికి ఎంతో ధైర్యం అవసరం. విరాగి భాషలోనైనా ఆధైర్యం వ్యక్తం కావటమే కాదు, తిరిగి తాను రాబోతున్నానన్న పునరాగమన వార్తను చెప్పగలగటం కూడా విశేషమే. ఇందులో ఒక జీవశక్తి ఉంది. మృత్యువు, జీవితం వేరు వేరు కావు. ఒకే నాణానికి బొమ్మా బొరుసులే అన్న జ్ఞానం ఉంది. వేదాంతం చెప్పే పునర్జన్మ సిద్ధాంతంలో కచ్చితంగా మనిషి తిరిగి మనిషి జన్మ ఎత్తుతాడన్న హామీ లేదు. కాని సీతారాం చాలా ధైర్యంగా మనిషిగానే కాదు, అదే మనిషిగా తిరిగి రాగలననే హామీని ఇస్తున్నారు. ఇది విలక్షణ విశ్వాసం"**

(సీతారాం సాహిత్యం విశ్లేషణ వ్యాసాలు, పుట.29)

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 2  UGC Care List Approved Journal
హైదరాబాద్ డిసెంబర్ : 2022

# స్ఫూర్తి మంత్రాలు – ఆత్మ కథలు

**జి. ప్రదీప్**, తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 94909 21345


ఒక వ్యక్తి తన కథను తానే చెప్పుకోవడాన్ని ఆత్మకథ అంటారు. ఆ వ్యక్తి కథనే మరొకరు చెబితే జీవితకథ అంటారు. జీవితకథలు ఒకరి ద్వారా విన్నవో, ఎక్కడో చదివి రాసినవో కావడం వల్ల వాటిలో ఆత్మకథల్లో ఉండే ఆత్మీయత ఉండదు.


ఒక దేశ చరిత్ర నిర్మాణానికి అవేక ఆధారాలు ఉంటాయి. వాటిని స్థూలంగా చారిత్రికాలు, సాహిత్యికాలు అని విభజించవచ్చు. అలా చరిత్రకు ఆధారభూతంగా నిలిచే సాహిత్యిక అధారాలలో ఆత్మకథలు ప్రముఖ స్థానాని వహిస్తాయి. ఒక వ్యక్తి జీవితం నాటి సమాజం, సంస్కృతితో ముడిపడి ఉండడమే ఇందుకు కారణం అని చెప్పవచ్చు.తమ మేలు కన్నా పరుల మేలు ముఖ్యంగా భావించి, అంతరాల్లేని సమాజం కోసం పాటుపడిన వారి జీవితచరిత్రలు మనుషుల్లో సిసలైన వ్యక్తిత్వ వికాసానికి ఉపబలకాలు అవుతాయి.

తెలుగులో ఆత్మకథలనే మాటకి ముందు స్వీయచరిత్రలనే మాటనే ఉపయోగించారు. తొలి తెలుగు ఆత్మకథగా కందుకూరి వీరేశలింగం పంతులు గారి 'స్వీయచరిత్ర' ప్రాచుర్యంలో వుంది. ఈ స్వీయచరిత్ర అన్న పదాన్ని కందుకూరి కన్నా దశాబ్దం ముందే గురజాడ శ్రీరామమూర్తి పంతులు వ్యక్తి తన చరిత్రను తానే రాసుకోవటమనే అర్థంలో ఉపయోగించారు. ఈ పదాన్ని కందుకూరి వీరేశలింగం వాడుకున్నారు. వీరి కన్నా ముందుగానే వెన్నెలకంటి సుబ్బారావు ఇంగ్లీషులో తన జీవితగాథ రాసుకున్నారు. పరవస్తు వేంకట రంగాచార్యులు స్వీయచరిత్రను సంస్కృతంలో రాశారు. మండపాక పార్వతీశ్వర శాస్త్రి పద్యరూపంలో స్వీయచరిత్ర రాశారు. ఈరకంగా వీరేశలింగం కన్నా ముందుగానే తెలుగునాట స్వీయచరిత్రలు వెలువడ్డాయని చెప్పవచ్చు. అయితే ఒక నిర్దిష్టమైన ఆధునిక స్వరూప స్వభావాలతో ఉండటం కందుకూరి స్వీయచరిత్ర తెలుగులో తొలి స్వీయచరిత్ర అయింది.

పుచ్చలపల్లి సుందరయ్య ఆత్మకథ తెలంగాణ సాయుధపోరాటచరిత్రలో ఆదర్శప్రాయమైన కమ్యూనిస్ట్ జీవితం కనిపిస్తుంది. ఈ ఆత్మకథలో ఏడు దశాబ్దాలకు పూర్వం తెలంగాణ ప్రాంతంలో ఉన్నసమస్యలు, పరిస్థితులు వర్ణింపబడ్డాయి. అలాగే మాకినేని బసవపున్నయ్య, వి.ఆర్.బొమ్మరెడ్డి, రావి నారాయణరెడ్డి వంటి పోరాటయోధుల ఆత్మకథల్లో నిజాంకాలం నాటి సమాజం సజీవంగా దర్శనమిస్తుంది.

తెలంగాణ ప్రాంతంలో వచ్చిన రాజకీయ, సామాజిక, సాహితీ సాంస్కృతికోద్యమాలు కొందరి ఆత్మకథలో ఆవిష్కృతం అయ్యాయి. మందుముల నరసింగరావు, కొండ వెంకట రంగారెడ్డి, కోదాటి




నారాయణరావు, మాదిరాజు రామకోటేశ్వరరావు, రావి నారాయణరెడ్డి, వంటి వారి ఆత్మకథలు ఈ కోవలోకి వస్తాయి. ఆంధ్రోద్యమ చరిత్ర మాడపాటి హనుమంతరావు ఆత్మకథలో వ్యక్తమైంది. దాశరథి కృష్ణమాచార్య స్వీయచరిత్రలో, దాశరథి రంగాచార్య జీవనయానంలో నిజాం నవాబుపై తిరుగుబాటు, తెలంగాణలో వెట్టిచాకిరి, భూస్వామ్యపీడనలకు వ్యతిరేకంగా వెల్లువెత్తిన చైతన్యం కనిపిస్తాయి. దేవులపల్లి రామానుజరావు ఆత్మకథలో తెలంగాణలో సాంస్కృతిక పునరుజ్జీవనం ప్రస్తావనలున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా స్ఫూర్తిదాయకంగా నిలిచిన కొన్ని ఆత్మకథల పరిచయం ఇలా ఉంది. సత్యశోధన (స్టోరీ ఆఫ్ మై ఎక్స్ పెరిమెంట్స్ విత్ ట్రూత్) – 1940లో జాతిపిత మోహన్ దాస్ కరంచంద్ గాంధీ తన ఆత్మకథ 'ది స్టోరీ ఆఫ్ మై ఎక్స్ పెరిమెంట్స్ విత్ ట్రూత్' ను రచించారు, అక్కడ ఆయన బాల్యం నుండి 1921 వరకు తన జీవితాన్ని ఇందులో వర్ణించారు. 1998లో, ప్రప0చవ్యాప్త ఆధ్యాత్మిక, మతాధికారులతో కూడిన ఒక కమిటీ దీనిని "20వ శతాబ్దానికి చె0దిన 100 మ0చి ఆధ్యాత్మిక పుస్తకాల్లో" ఒకటిగా గుర్తి0చి0ది.

జవహర్ లాల్ నెహ్రూ స్వీయచరిత్ర – 1936లో జవహర్ లాల్ నెహ్రూ 'యాన్ ఆటోబయోగ్రఫీ' అనే ఆత్మకథను ప్రచురించారు, దీనిని 'టువర్డ్ ఫ్రీడమ్' అని కూడా పిలుస్తారు. ఈ పుస్తకం నెహ్రూ భారత తొలి ప్రధానమంత్రి కావడానికి ముందు జైలులో (1934–1935) వ్రాయబడింది.

ఒక యోగి ఆత్మకథ – యోగి పరమహంస యోగానంద 1946లో తన ఆత్మకథను రచించారు. ఇందులో భారతీయ తాత్వికతకు సంబంధించిన అనేక అంశాలున్నాయి.

# స్మశానం

అప్పుడప్పుడు ఈశాన్యభూమికి
వెళ్లి తీరాలి.....!
ముడతల మెదడులోని
స్వార్థం విడువాలన్న
ఆశ, కోరిక చావాలన్న
ధైర్యం తనువులో ఇంకాలన్న
కష్టాల, కడగండ్లల, నవ్వులకు
మనిషి మనసులోని ఎన్నో చిక్కు ప్రశ్నలకు
అసలు చిరునామాను
దర్శించక తప్పదు.

సమర్థులను అసమర్థులను
దాచుకున్న గని
రక్త బంధుత్వాలు రాక్షసత్వం చూపినా
నిర్లక్ష్యపు నీడలు మనసుకు
ముసిరినా.... అక్కున
చేర్చుకునే అంతశయ్య

తల్లి గర్భంలో
శిశువుకు ప్రాణం పోస్తున్నట్లు
సమాధి తనలో దాచుకున్న అస్థికల
చరిత్రను గుర్తు చేస్తుంది

ఆధిపత్యాన్ని, ధిక్కారాలను
సమన్వయ పరిచే మంత్రనగరి
అపరప్రేమ, అగాథ జీవితాలకు
అదొక సాంత్వనశాల
రెప్పపాటు విశ్రాంతి లేని
తొలుకప్పుకున్న శరీరాలకు
ఎత్తులు, చిత్తులు క్షణంలో
మరే కల్లోల జీవితాలకు
శాశ్వత సౌఖ్యానికి ఉచిత హామీ

కాని కొత్తగా రంగులు మారి
మత, కుల రుద్రాకీడము చేరి
కబ్జాలా పర్వాలు నెలకొన్నాయి
ఉన్నోడికి పాలరాయి
లేనోడికి శ్మశానం కూడా పరాయి

**సాహిత్య మణి**

వెయిటింగ్ ఫర్ ఎ వీసా – 1935–36 మధ్యకాలంలో భారతీయ న్యాయశాస్త్రవేత్త, ఆర్థికవేత్త, రాజకీయవేత్త, సంఘ సంస్కర్త డా. బి.ఆర్.అంబేద్కర్ అస్పృశ్యతతో తనకున్న అనుభవాల గురించి తన స్వంత చేతివ్రాతలో 20 పేజీల ఆత్మకథ రాశారు. దీనిని ప్రస్తుతం కొలంబియా విశ్వవిద్యాలయంలో పాఠ్యపుస్తకంగా ఉపయోగిస్తున్నారు.

బెంజమిన్ ఫ్రాంక్లిన్ ఆత్మకథ – ఈ ఆత్మకథలో ఒకవ్యక్తి పరిపూర్ణుడు కావడం కోసం అలవరచుకోవలసిన 13 సద్గుణాలను, వాటితో 13 వారాల్లోనే సరైన జీవితాన్ని పొందడం ద్వారా కేవలం 13 వారాల్లోనే జీవితాన్ని ఎలా ప్రగతిపథంలో నడిపించుకోవచ్చో తెలుస్తుంది.

లాంగ్ వాక్ టు ఫ్రీడమ్ – నెల్సన్ మండేలా – తెల్లవారి ఆధిపత్యంలో ఉన్న ప్రిటోరియాలో నల్లజాతి వారి జీవితాలు ఎంత దుర్భరంగా ఉండేవో, స్వతంత్రం కోసం వారి చేసిన ఉద్యమాలు, ఆ ఉద్యమాల్లో వారు ఎదుర్కొన్న సమస్యల వంటివి ఇందులో వర్ణింపబడ్డాయి. అలుపెరుగక పోరాటం చేస్తే ఎంతటి విజయాన్నైనా సాధించవచ్చని ఈ ఆత్మకథ వివరిస్తోంది.

ది డైరీ ఆఫ్ యంగ్ గర్ల్ – ఆన్ ఫ్రాంక్ – ఇది రెండవ ప్రపంచయుద్ధకాలంలో జర్మనీలో యూదులు పడ్డ వేదనలను, వారి జాతిహననం కోసం నాజీలు చేసిన దౌష్ట్యాలను వివరిస్తున్నది.

ఆటోబయోగ్రఫీ ఆఫ్ మాల్కమ్ ఎక్స్ – ఈ ఆత్మకథలో నల్లజాతివారిని తెల్లజాతివారు ఎలా హీనంగా చూసేవారో, ఎంత ప్రతిభావంతులైనా నల్లజాతివారిని ఎలా దూరంగా ఉంచేవారో తెలుస్తుంది.

ఆటోబయోగ్రఫీ ఆఫ్ మార్క్ట్వైన్ – అమెరికాకు చెందిన ప్రముఖ కథాకారుడైన మార్క్ ట్వేన్ రాసుకున్న ఈ ఆత్మకథలో 1835–1910 మధ్యకాలంలోని అమెరికా సమాజం దర్శితమౌతున్నది. సివిల్ వార్, బానిస వ్యవస్థ, వర్ణవివక్ష వంటి అనేక విషయాలు ఈ ఆత్మకథలో ఉన్నాయి.

మై కాంఫ్ – అడాల్ఫ్ హిట్లర్ –1925లో వెలువడిన ఈ ఆత్మకథ ప్రపంచంలోనే అత్యధికంగా చదువబడ్డ ఆత్మకథల్లో ఒకటి. ఇందులో హిట్లర్ తన రాజకీయ సిద్ధాంతాలు, రాజ్యవిషయంలో తనకున్న అభిప్రాయాలు, రాజకీయం, ఆర్యజాతి గురించిన తన భావాలను వ్యక్తం చేశాడు.

ఒకనాటి సమాజంలో ఆనాటి కాలంలో పరిస్థితులు ఎలా ఉండేవో ఈ ఆత్మకథల ద్వారా తెలుస్తుంది. పాఠకులకు ఆ సమాజంతో పరిచయం ఏర్పడడమే కాదు, ఆ ప్రాంత చరిత్రను పునర్నిర్మించడానికి కూడా ఈ ఆత్మకథలు ఆధారాలుగా నిలుస్తాయి. తమ జీవితాలను శూన్యం నుంచి మొదటుపెట్టి ఉన్నత శిఖరాను చేరుకున్నవారి ఆత్మకథలు నేటితరానికి స్ఫూర్తిప్రదాలు అని చెప్పవచ్చు.

# గిరిజా మనోహరుని ఆత్మ జ్ఞాన ప్రకాశిక

డా. టి. శ్రీరంగస్వామి, ఫోన్ : 994 985 7955

భారతీయ ధర్మం సనాతనమైనది. వేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తులు, పురాణాలు ఈ ధర్మానికి మూలాధారాలు. వేదాల్లో చెప్పిన ధర్మ విషయాలు శాసనాత్మకంగా ఉంటాయి. వాటినే క్రాంతదర్శులైన మహర్షులు ఉపనిషత్ పురాణాల్లో కథనాత్మకంగా వివరించారు.

మానవ జీవన సాఫల్యతకు, సౌశీల్య నిర్మాణానికి, సమాజ హితానికి, ఆదర్శవంతమైన సమాజ నిర్మాణానికి ఈ ధర్మం అత్యంత ఆవశ్యకం. తరతరాలుగా భారతీయులు ఈ ధర్మాన్నే అనుసరిస్తున్నారు. పటిష్టమైన జీవనబంధాన్ని, వ్యవస్థను సృష్టించుకున్నారు.

వేగవంతమైన నేటి ఆధునిక జీవనం యాంత్రికమైపోయింది. తీరికలు, ఓపికలు సన్నగిల్లాయి. పైపై ఆకర్షణల మోజులో మోహాంధులైన నేటితరం వారు ఉపనిషత్ గ్రంథాలను చదవలేక పోతున్నారు. వాటిలోని ధర్మ విషయాలను గ్రహించలేకపోతున్నారు. నిరాశా పూరితమైన అనాలోచితమైన భావోద్వేగాలను నిగ్రహించుకోలేక పోతున్నారు. సరిగ్గా ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో ఉన్నవారికి ఆశా కరదీపిక, ఆత్మజ్ఞాన ప్రకాశిక ఈ పరంజ్యోతి.

ఆ పరంజ్యోతిని దర్శింపచేస్తూ ఈ పరంజ్యోతి అనే పుస్తకాన్ని సృష్టించినవారు గన్నమరాజు గిరిజా మనోహర్ బాబుగారు. గిరిజా మనోహర్‌గారు తెలుగు సాహితీలోకంలో చిరపరిచితులు. విస్తృతమైన నిరంతర అధ్యయనశీలి. తెలుగు సంస్కృత సాహిత్య కావ్యాలు, ఉపనిషత్తులు, రామాయణ, భారత, భాగవత పురాణ గ్రంథాలపై సాధికారికమైన ప్రజ్ఞ సాధించారు. కావ్య పురాణ తత్త్వ శాస్త్ర విషయ ప్రజ్ఞా ధురీణులైన గిరిజా మనోహరబాబుగారి ద్వారా ఆవిష్కృతమైనది ఈ పరంజ్యోతి.

పరంజ్యోతి డెబ్బైఒక్క వ్యాసాంశాల సంపుటి. ఈ అంశాలన్నీ రామాయణ భాగవత మూలకమైనవే. చతుర్విధ పురుషార్థాల సాధన, అరిషడ్వర్గాల నియంత్రణ, సోదర, మైత్రీ బంధాల కొనసాగింపు, దాంపత్య జీవనరాగం, జీవనధర్మం, సత్కర్మాచరణ, సంస్కార సంభాషణా ధర్మం.... ఇలా ధర్మాచరణకు అవసరమైనవన్నీ ఇందులో పొందుపరిచారు. సత్య ధర్మానుష్ఠానమే లోకరక్ష అని ప్రారంభించి సకల మానవాళి వెలుగుల దిశగా పయనించడమే ధర్మం అని ముగించారు. పుస్తకంలోని ఆరంభవాక్యం మొదలుకొని చివరి వాక్యం చివరి పదం వరకు ధర్మాన్ని వదిలిన విషయ ప్రస్తావన లేదు.




**అక్షరార్చన**
గన్నమరాజు గిరిజామనోహర్ బాబు
వెల : అమూల్యం
**ప్రతులకు :** రచయిత, ఇం.నెం. 2-11-501/5,
విజయనగర్ కాలనీ, హనుమకొండ - 506 009.
ఫోన్ : 99490 13448

మొట్టమొదట సత్య ప్రాధాన్యతను నొక్కి చెప్పారు. సత్యపథమే సర్వశ్రేయోమార్గం అని రాముడు జాబాలి మధ్య జరిగిన సంభాషణ వివరించారు. తదనంతరం చతుర్విధ పురుషార్థాలైన ధర్మార్థ కామమోక్షాలు గూర్చి, వాటి సాధన గూర్చి సహేతుకంగా వివరించారు. అధర్మకామం తగినది కాదంటూ రావనాది రాక్షసుల విషయాలను ఉదాహరించారు. ఈ చతుర్విధ పురుషార్థాలలో మొదటి మూడు సామాజిక వ్యవస్థాగతం కాగా నాల్గవదైన మోక్షము పూర్తిగా వ్యక్తిగతం. మనిషి మోక్షం దిశగా పయనించడానికి సనాతనమైన ఉపనిషత్తులు, పురాణాలు మార్గదర్శకంగా ఉన్నాయని స్పష్టం చేశారు.

వైవాహిక జీవితం ధార్మికజీవితానికి పునాది అని, స్త్రీ, పురుషుల సంయోగం జీవాత్మ పరమాత్మల కలయిక అని అభివర్ణించారు. భారతీయ వివాహ వ్యవస్థ విశ్వానికే ఆదర్శం అని పేర్కొంటూ భారతీయ వివాహ వ్యవస్థపై, భారతీయుల దాంపత్య జీవనంపై గౌరవాన్ని ఇనుమడింపచేశారు.

మనిషికి కోపం తగినది కాదు. కోపంలో యుక్తాయుక్త విచక్షణ కోల్పోతారు. ఈ విషయమై భగవద్గీతలోని విషయాలను మరియు రామాయణంలోని లంకాదహన సమయంలో హనుమంతుని మాటలను ఉదాహరిస్తూ కోపాన్ని జయించినవాడే పురుషోత్తముడన్నారు. రామాయణంలో రాముడు కోపం ప్రదర్శించిన సందర్భాలు ఉన్నాయి కానీ అది రాముని ధర్మాగ్రహమే కాని, కోపం రాముని స్వభావసిద్ధం కాదని పేర్కొన్నారు. వ్యక్తి సహనశీలత సమాజానికి రక్ష అని ఆ సహనమే సర్వ విజయాలను సిద్ధింపచేస్తుందని విశదీకరించారు.

కర్తవ్య నిర్వహణ మానవుని సాధారణ ధర్మం. ఈ ధర్మ నిర్వహణలో ఎదురయ్యే అవాంతరాలకు వేదన చెందకూడదు. కుంగిపోకూడదు. ఆ కార్యసాధనకు ఉత్సాహంతో ప్రయత్నించాలి. రామాయణంలోని **'ఉత్సాహవంతో హి నరా న లోకే సీదంతి కర్మస్వతి దుష్కరేషు'** అనే లక్ష్మణుని వాక్యాలను ఉదహరించారు. మనిషిని మనిషిగా నిలిపి చైతన్య కేంద్రం చేయగలిగే శక్తి కేవలం ఉత్సాహానికి మాత్రమే ఉంటుందని, కావున మనిషి ఎప్పుడు ఉత్సాహవంతంగా ఉంటూ, కార్యసాధనకు కదలాలని మానవులను కర్తవ్యోన్ముఖత వైపు మళ్ళిస్తున్నారు.

ఏకాదశి వ్రతం, శ్రీకృష్ణజన్మాష్టమి, శ్రీరామనవమి, గణేశ చతుర్థి, దీపావళి, విజయదశమి మొదలైన పండుగలు, ఆ పండుగల వెనక ఉన్న పరమార్థాన్ని కూడా సమగ్రంగా, సముచితంగా తెలిపారు. కేవలం సాధారణ మానవ జీవనానికి సంబంధించిన విషయాలే కాకుండా అధికారంలో పాలనలో ఉన్న వ్యక్తులు ఏవిధంగా వ్యవహరించాలో, వ్యవహార ధర్మం ఏమిటో కొన్ని వ్యాసాల్లో తెలియజేశారు. మంత్రుల పరిపాలన, సమర్థత, నిర్మలత్వం మొదలైన విషయాలను ఆయా సందర్భాలలో సమగ్రంగా చర్చించారు.

ఇందులోని వ్యాసాలన్నీ కూడా దినపత్రిక కాలంలో వచ్చినవే. కాలం రాయడానికి కొన్ని పరిమితులు ఉంటాయి. ఆ పరిమితుల్లోనే అపరిమితమైన విషయాన్ని అధ్యాపకుడిగా సుదీర్ఘ బోధనానుభవం గిరిజా మనోహర్‌బాబుగారు వ్యక్తీకరించారు. ముఖ్యంగా పాఠకులను ఆకర్షించేవిధంగా ఎత్తుగడలోనే చెప్పదలచిన అంశాలను సూటిగా, స్పష్టంగా పేర్కొంటారు. ఆ తరువాత విషయ విశ్లేషణ, రామాయణ భాగవతాది గ్రంథాలు సంఘటనలను ఉదామరణలుగా ఆయా సందర్భాల్లో ఉటంకించారు. అంతేకాకుండా ముగింపులో ఒక సందేశాన్ని సత్యధర్మం వైపు నడిచే మార్గాన్ని సూచించారు. విషయం పట్ల అవగాహన, రచనాశైలి పాఠకుల మనోస్థితిని గుర్తెరిగిన గిరిజా మనోహర్‌గారు సమర్థవంతంగా ఈ అంశాలన్నింటినీ రచించ గలిగారు.

జీవనధర్మం, కర్తవ్యపరాయణం, సత్యనిష్ఠ, ధర్మాచరణ, దయాగుణం, భగవత్తత్వం.... అన్నీ కలిపితే ఆదర్శ మానవుడిగా, పురుషోత్తముడిగా మనిషి నిలవడానికి కావలసిన విషయాలు ఈ పరంజ్యోతిలో దర్శనమిస్తున్నాయి. ఈ పరంజ్యోతి కాలక్షేప గ్రంతం కాదు. ఇది ఆత్మజ్ఞాన ప్రకాశిక, నిత్యచైతన్య స్ఫూర్తి దీపిక. మనసులోని వేదనలను తొలగించే గుళిక. కర్తవ్యం వైపు మళ్ళించే మంత్రదండం. ఉత్సాహాన్ని కలిగించే దివ్యౌషధం. అందుకే **"ఆరోగ్యం కోసం రోజు ఓ మాత్ర వేసుకున్నట్టు ఆత్మకోసం రోజు ఒక్కటి చదివితే చాలు. దాని ప్రభావం రోజంతా ప్రశాంతంగా ఉటుంది"** అని పుస్తక ప్రారంభంలో తనికెళ్ల భరణిగారు చెప్పిన మాట అక్షర సత్యం.

అక్షరార్చన పరంజ్యోతి ద్వారా సమాజానికి సంస్కార ధర్మాన్ని వివరించిన శ్రీ గిరిజా మనోహర్‌బాబుగారు వందనీయులు. రచయితతో పాటు పాఠకలోకంలోకి తీసుకెళ్ళిన ప్రచారం చేసి ఆంధ్రజ్యోతి దినపత్రికవారు ప్రశంసనీయులు, అభినందనీయులు.


# శిలాక్షరం


**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.

**సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి**

**సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య**

**వెల : 300/-**





**సంప్రదించండి.**

**మూసీ మాసపత్రిక**


**ఫోన్ : 934 7971177**





**జీవనపర్వం (ఆత్మకథ)**
డా. శ్రీరంగాచార్య
వెల : 200 /-
**ప్రతులకు :** రచయిత, 11-14-25, హరిపురి కాలనీ, హైదరాబాద్ - 500 102.
ఫోన్ : 92994 51266







**తెలుగు సామెతలు - సమగ్ర సమాలోచన**
సంపాదకులు : డా. వై. సత్యనారాయణ
వెల : 150 /-
**ప్రతులకు :** సంగిశెట్టి బాబు, ఎంఐజి - 1, బ్లాక్-3, ఫ్లాట్ - 7, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500044.
ఫోన్ : 98490 71105



**పలుకు జెలి (సాహిత్య విమర్శ వ్యాసాలు)**
డా. టి. శ్రీరంగస్వామి
వెల : 100/- **ప్రతులకు :** శ్రీలేఖ సాహితి, ఇం.నెం. 27-14-53, ఎం.ఆర్.ఓ., ఆఫీస్ ఎదురుగా, శ్రీలేఖ కాలనీ, హసన్‌పర్తి, వరంగల్ - 506 371.
ఫోన్ : 99498 57955



**మంచి మనిషి (కథలు)**
- ఎస్. ఆర్. పృథ్వి
వెల : 150 /-
**ప్రతులకు :** శ్రీమతి పి. ఉషా రాణి, 104-6-140, ఎం.జి. స్ట్రీట్, రామకృష్ణ నగర్, రాజమహేంద్రవరం - 533 101. ఫోన్ : 94927 04750



**ఋతుసంహారః (స్వేచ్ఛాకవితానువాదం)**
- రఘువర్మ (డా. టి. లక్ష్మీనారాయణ)
వెల : 125/-
**ప్రతులకు :** రచయిత, ఇం.నెం. 3-1-264, పురానిపేట, జగిత్యాల - 505 327.
ఫోన్ : 92900 93933

## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి రూ. 2875 - 00
2. బ్రాహ్మణ రాజ్య సర్వస్వము రూ. 1200 - 00
3. నల్లగొండ జిల్లా కవులు - పండితులు రూ. 350 - 00
4. మల్యాల వంశ చరిత్ర - శాసనములు రూ. 100 - 00
5. శాసన సంపుటి రూ. 150 - 00
6. కందూరు చోడుల శాసనములు - చరిత్ర - సంస్కృతిరూ. 100 - 00
7. షబ్నవీస్ శతజయంతి సంచిక రూ. 100 - 00
8. విజయనగర శాసనములు - సాహిత్య సాంస్కృతిక విశేషములు 90 - 00
9. త్రిపురాంతక దేవాలయ శాసనములు రూ. 75 - 00
10. పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర రూ. 75 - 00
11. దేవాలయ వాస్తుశిల్పము రూ. 50 - 00
12. మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక రూ. 50 - 00
13. మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక రూ. 75 - 00
14. 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక రూ. 100 -00
15. మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక రూ. 100 - 00
16. ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు రూ. 175 - 00

## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

**చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా**
**సంపాదకుడు, మూసీ మాసపత్రిక,**
**ఇం.నెం. 2-2-1109/**
**బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,**
**బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-500013.**
**చందాలకు ఆన్‌లైన్ అకౌంట్**
**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.**
**అకౌంట్ నెం. 52019740642**
**IFS Code : SBIN0020083**
**editormusi@gmail.com**

# నేను మళ్ళీ జన్మిస్తా ...

కులం కులం అంటూ
కుల వ్యవస్థలో కళ్ళుమూసుకు
నిద్రిస్తున్న ఓ మానవులారా!
లే మేలుకో... లే మేలుకోండి
ఈ కుల వ్యవస్థ
బానిస సంకెళ్ళ నుంచి విముక్తికమ్ము
నాడు అడవిలో పుట్టిన
ఆది మానవునికి
తెలియలేదు తన మతమేదో ?
నేడు ఆసుపత్రిలో
పుట్టిన ఆధునిక మానవునికి
తెలుస్తుంది తన మతమేదో ?
తరతరాలుగా
అభివృద్ధి చెందుతున్న
మనదేశంలో
కుల మత జాతి వర్గీకరణలో
అన్ని దేశాల కంటే
అభివృధి పథంలో
నడుస్తుంది మా దేశం !
ఏ గోడకేసి సూసిన
ఏ రోడ్డుకేసి సూసిన
మా కులం..మా మతం..మా జాతి
వర్థిల్లాలి అంటూ
పిచ్చిరాతలు చూస్తున్నాం
మన మందరం
మనుషులమన్న మాట మారుస్తున్నాం
కుళ్ళి పోయిన పండువోలే
నేడు సమాజంలో కులమనే పండుకు
దుర్వాసన పరిమళాలు వీస్తుంటే
ఆ దుర్వాసన భరించలేక
నేను మరణిస్తున్న నేను మరణిస్తున్న
మరో జన్మనైన
ఈ కుల మత జాతి
వర్గీకరణను అడ్డుకోవడానికి
నేను మళ్ళీ జన్మిస్తా ! నేను మళ్ళీ జన్మిస్తా!!







**లక్ష్మీ శ్రీనివాస్**

**పలమనేరు, ఫోన్ : 967 660 1192**

# ఫర్టీ 9 సంతాన సాఫల్యత కేంద్రం

**మీ మాతృత్వపు స్పర్శకు దూరం అయ్యారా?**

అందమైన చిన్ని చిన్ని అడుగులు..
బోసి బోసి నవ్వుల కేరింతలు...
ఒక పూజ్యమైన అలక, అలుపెరగని ఉల్లాసం..
మారం చేస్తూ, మైమరిపిస్తూ...
మీ ఆనందం అంభరాన్ని తాకాలా ?

సరోగసి, అసిస్టెడ్ హ్యాచింగ్,
ఎంబ్రియో & సెమెన్ ఫ్రీజింగ్,
స్త్రీలలో గర్భాశయ అండాశయ
లోపాల నివారణ-చికిత్స,
వెరికోసిల్, వీర్యకణాల లోపం,
ల్యాప్రోస్కోపిక్ విధానం ద్వారా
లోపాల నిర్ధారణ -సవరణ,
ఆధునిక వైద్యవిధానాలతో చికిత్స.

**మీరు తీసుకునే
ప్రతి నిర్ణయానికి
మా ప్రేమ, సేవ
అంకిత భావం మీకు
తోడుగా ఉంటుంది.**

**7416 106 106**
www.ferty9.com

**IUI** **IVF** **ICSI** **IMSI** **HSG**



**ఫర్టీ 9** హాస్పిటల్ మరియు పరిశోధన కేంద్రం

మీ ఆశ, మీ స్వప్నం ఫలిస్తుంది ఫలప్రదంగా...

విజయ డయాగ్నస్టిక్స్ ఎదురుగా, సికింద్రాబాద్ మరియు నిజాంపేట్ క్రాస్ రోడ్, కూకట్‌పల్లి, హైదరాబాద్